ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు రూ.కోట్లు కుమ్మరించారు. ప్రలోభాలు, పంపకాలకే ఉమ్మడి జిల్లాలో రూ.వెయ్యి కోట్లకుపైన వెచ్చించినట్లు అంచనా. ప్రచారం, ఇతరత్రా ఖర్చులు దీనికి అదనం. ఎన్నికల ఖర్చు విషయంలో ఒంగోలు, దర్శి నియోజకవర్గాల అభ్యర్థులు ముందున్నారు. ఒక్కోచోట రూ.150 కోట్లకు పైగానే వెచ్చించారు. అద్దంకి, పర్చూరు, చీరాల, కందుకూరు నియోజవర్గాల్లో రూ. 100 కోట్ల చొప్పున ఖర్చుచేసినట్లు అంచనా. మార్కాపురం, గిద్దలూరుల్లోనూ ఒక్కోచోట రూ.80కోట్లు వెచ్చించారు. జనరల్ కేటగిరీలో కనిగిరిలోనే కాస్తంత తక్కువ ఖర్చు చేశారు. దళితులకు రిజర్వు అయిన స్థానాల్లో కొండపి, ఎర్రగొండపాలెం అభ్యర్థులు టాప్‌లో నిలిచారు. అన్నింటా తక్కువ వ్యయం అయిన నియోజకవర్గాల్లో సంతనూతలపాడు కనిపిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు జిల్లాలో గతం కన్నా ఎక్కువ వెచ్చించినట్లు తేలగా, పార్టీల నుంచి కూడా అంతో ఇంతో ఆర్థికసాయం లభించింది. మరీ ముఖ్యంగా వైసీపీ అభ్యర్థులే ఓటర్ల ప్రలోభాలకు అధిక మొత్తాన్ని ఖర్చు చేశారు. ఒకట్రెండు చోట్ల టీడీపీ కూటమి అభ్యర్థులు పోటీపడగా, మరి కొన్ని చోట్ల ఈవిషయంలో వెనుకబడి పోయారు.



వెయ్యి కోట్లు

ఎన్నికల్లో ప్రలోభాలు, పంపకాలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు కుమ్మరించిన డబ్బు

ఒంగోలు, దర్శిలో ఒక్కోచోట రూ.150కోట్లపైనే ఖర్చు

చీరాల, కందుకూరు, పర్చూరు, అద్దంకిలో వంద కోట్ల చొప్పున..

మార్కాపురం, గిద్దలూరులో రూ.80కోట్లపైనే!

జనరల్ స్థానాల్లో కనిగిరిలో తక్కువ

ఎస్సీ నియోజకవర్గాల్లో కొండపి, వై.పాలెం టాప్

చివరలో సంతనూతలపాడు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

సాధారణ ఎన్నికల్లో పార్టీలు, వాటి మేనిఫెస్టోలు, ఆపై అభ్యర్థుల ప్రభావానికి గతంలో ప్రాధాన్యం ఉండేది. వాటికితోడు స్థానిక అంశాల ప్రభావం కన్పించేది. అనంతరం కులాలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పుడు వీటన్నింటికీ మించి డబ్బుతో ఓటర్లను ఆకర్షించడం పెరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో అది మరింత అధికంగా కనిపించింది. దీనికితోడు ఈసారి ప్యాకేజీల పేరుతో కిందిస్థాయి నాయకులను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీగా వెచ్చించారు. సహజంగా ఎన్నికల్లో ఓటర్లను అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. పార్టీలు, వాటి విధానాలతో ఢీ అంటే ఢీ అన్నస్థాయిలో పోటీ జరిగిన నియోజకవర్గాల్లో అంతో ఇంతో డబ్బు ప్రభావం గెలుపోటములపై కనిపించిన దాఖలాలు కూడా ఉన్నాయి. కానీ ద్విముఖ పోటీలో ప్రధాన పార్టీల అనుకూల, వ్యతిరేక పవనాల ప్రభావం కూడా కీలకం. ఎక్కువ స్థానాల్లో ఆ అంశమే జయాపజయాలను నిర్ణయిస్తుంది. అయితే ఈ పర్యాయం ఇటు టీడీపీ కూటమి, అటు అధికార వైసీపీ అభ్యర్థులు తాయిలాలతో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను గుర్తించి గత ఐదేళ్లలో అంతోఇంతో సంపాదించిన నేపథ్యంతో ఈ విషయంలో అధికార పార్టీ అభ్యర్థులు ముందు నిలిచారు. వైసీపీ రాష్ట్ర నాయకత్వం కూడా పార్టీ అభ్యర్థులకు ఆర్థిక చేయూత ఎక్కువగానే ఇచ్చినట్లు తేటతెల్లమవుతోంది.

ఒంగోలు, దర్శిలో భారీగా వ్యయం

ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు చేసిన వ్యయంపై ఒక అధ్యయనం చేయగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, దర్శి అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే అభ్యర్థులు భారీగా ఖర్చు చేసినట్లు వెల్లడైంది. వ్యక్తిగతంగా చూస్తే మొత్తం అభ్యర్థుల్లో ఒంగోలు వైసీపీ అభ్యర్థి ఎక్కువ మొత్తం వెచ్చించినట్లు కనిపిస్తోంది. ఒంగోలు అసెంబ్లీలో వైసీపీ అభ్యర్థి తరఫున ఓటుకు మూడు వేల రూపాయల చొప్పున పంపిణీ చేశారు. అందుకోసమే రూ.60 కోట్లకు పైగా వెచ్చించినట్లు అంచనా. దీనికి అదనంగా బియ్యం, చీరలు ఇచ్చారు. ఇతరత్రా కలుపుకున్నా ఒంగోలులో వైసీపీ తరఫునే రూ.100 కోట్లకు పైగా ఖర్చుచేసినట్లు భావిస్తున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి పక్షాన ఓటుకు వైసీపీకన్నా తక్కువ ఇచ్చారు. ఆరకంగా రూ.40 కోట్లు, ఇతరత్రా ప్రలోభాల వ్యయం కలుపుకుంటే మొత్తంగా రూ.70 కోట్లు ఆయన ఖర్చు చేసినట్లు అంచనా వేస్తున్నారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి ఓటుకు రూ.3వేల ప్రకారం ఇచ్చారు. టీడీపీ అభ్యర్థి కూడా పోటీగా చెల్లించారు. ఆ రకంగా అభ్యర్థులిద్దరూ రూ.120 కోట్ల వరకూ ఓట్ల కొనుగోలుకే ఖర్చు చేశారు. ఇతరత్రా మరో రూ.45 కోట్ల వ్యయం అయినట్లు అంచనా.

ఆ మూడింటిలో ఒక్కో చోట రూ.100 కోట్లపైనే

ఉమ్మడి జిల్లాలోని చీరాల, కందుకూరు, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కోచోట ప్రధాన పార్టీల అభ్యర్థుల తరుపున రూ.100 కోట్లకుపైన ఓట్ల కొనుగోలుకు కుమ్మరించినట్లు వెల్లడవుతోంది. చీరాలలో వైసీపీ, టీడీపీలకు తోడు కాంగ్రెస్ అభ్యర్థి డబ్బులు పంపిణీ చేశారు. వైసీపీ, టీడీపీ సమానంగా ఇవ్వగా, కాంగ్రెస్ తరఫున కొందరికి వెయ్యి, కొందరికి రూ.1,500 పంపిణీ చేశారు. పోలింగ్ రోజు మధ్యాహ్నం తర్వాత నుంచి అదనపు పంపిణీలు జరిగాయి. ఇక్కడ ముగ్గురూ కలిసి రూ.100 కోట్లపైనే ఖర్చు చేసినట్లు అంచనా. అందులో వైసీపీ తరఫునే ఎక్కువ వెచ్చించినట్లు తెలుస్తోంది. కందుకూరులోనూ టీడీపీ, వైసీపీ అభ్యర్థుల వ్యయం కలిపి చూస్తే రూ.వందకోట్లు దాటింది. పర్చూరులో ఇరుపార్టీల వారు డబ్బులు సమానంగా పంపిణీ చేయగా, నేతల ప్యాకేజీలు భారీగానే ఉన్నాయి. అద్దంకిలోనూ ఇరు పార్టీల వారు సమానంగా పంచారు. ఇలా ఒక్కో చోట రూ. 100 కోట్లకుపైబడి అభ్యర్థులు ఓట్ల కొనుగోలుకు వెచ్చించినట్లు కనిపిస్తోంది.

ప్రతి నియోజకవర్గంలో 1.50 లక్షల మందికిపైగా ఓటర్లకు డబ్బులు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ 1.50 లక్షల మంది నుంచి 2 లక్షల మంది ఓటర్లకు ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బులు పంపిణీ చేయగలిగారు. వివిధ కారణాల వల్ల గతం కన్నా లిక్కర్ పంపిణీ తగ్గింది. లిక్కర్ కావాలనుకున్న వారికి అదనంగా డబ్బు పంపిణీ చేశారు. ఇవి కాకుండా ప్రచార సభలు, సమావేశాలు నామినేషన్ల కార్యక్రమాల ర్యాలీలకు జనసమీకరణకు ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 వరకూ చెల్లించారు. ఇలాంటి ఖర్చులకు జిల్లా మొత్తంగా అభ్యర్థులు మరికొన్ని కోట్లకుపైన వెచ్చించినట్లు అంచనా. ఎక్కువ శాతం ఓటర్లకు ఇరు పార్టీల వారి నుంచి డబ్బులు అందాయి. వారు ఇరు పక్షాలకు న్యాయం చేశారా? పాలనాపరంగా, సామాజికపరంగా వారు మెచ్చిన పార్టీలకే ఓట్లు వేశారా? అనేది తేలాలి. ఈపర్యాయం ఉద్యోగుల ఓట్లకి అభ్యర్థుల నుంచి వ్యయం తక్కువే అయిందని చెప్పుకోవచ్చు.

పశ్చిమాన తక్కువే..

పశ్చిమప్రాంతంలోని కొన్ని నియోజకవర్గాల్లో ఓట్ల కొనుగోలుకు చేసిన వ్యయం కాస్త తక్కువగానే ఉంది. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఒక్కో చోట పంపకాలు, ప్రలోభాలకు రూ.80 కోట్లకుపైగానే వెచ్చించారు. మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ తరఫున కొన్ని ప్రాంతాల్లో ఓటుకు రూ.1,500, మునిసిపాలిటీల్లో రెండు వేల ప్రకారం పంపిణీ చేశారు. టీడీపీ కూటమి తరఫున అన్ని ప్రాంతాల్లో సమానంగా ఇచ్చారు. గిద్దలూరు నియోజకవర్గంలో వైసీపీ తరఫున ఓటుకు రెండు వేల ప్రకారం పంపిణీ చేశారు. కూటమి తరఫున అంతకంటే కొద్దిగా తక్కువ ఇచ్చారు.

కనిగిరిలో సమానం

జనరల్ కేటగిరీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనిగిరిలో ఇరుపార్టీల అభ్యర్థులు ఓటు రేటును సమాన స్థాయిలో అమలు చేశారు. ఇక్కడ ఇటు టీడీపీ కూటమి, అటు వైసీపీ తరఫున కూడా రూ.1500 ప్రకారమే పంపిణీ చేశారు. ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే ప్యాకేజీలు, ఇతర ఖర్చులు కూడా ఇక్కడ తక్కువే అయినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఇరుపార్టీల అభ్యర్థులు కలిపి రూ.65 కోట్ల నుంచి 70కోట్ల వరకూ వెచ్చించినట్లు అంచనా.

రిజర్వుడు స్థానాల్లోనూ..

రిజర్వుడు నియోజకవర్గమైన కొండపిలో వైసీపీ తరఫున ఓటుకు రూ. 2000, కూటమి తరఫున కొంత తక్కువ పంపిణీ జరిగింది. ఎర్రగొండపాలెంలో కూడా వైసీపీ పక్షాన ఓటుకు రూ.2000 పంపిణీ జరగ్గా, టీడీపీ తరఫున అందులో సగం చెల్లించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇరుపక్షాల తరఫున ఓటుకు సమానంగా పంపిణీ జరిగింది. ప్రతి నియోజకవర్గంలో వలంటీర్లకు ఆగిపోయిన జీతాల పేరుతో వైసీపీ ఒక్కొక్కరికి రూ.5 వేలు పంపిణీ చేసింది. అలా రెండు నెలలపాటు ఇచ్చింది. ఇక వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేకించి గిఫ్ట్‌లు కూడా అందజేశారు.

తొలకరి సాగుకు సానుకూలం

జిల్లావ్యాప్తంగా జల్లులు.. సగం మండలాల్లో ఒక మోస్తరు వర్షం

దుక్కుల దున్నకానికి సిద్ధమవుతున్న రైతులు

ఒంగోలు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ముందస్తు వానలు రైతులను మురిపిస్తున్నాయి. తొలకరి సాగుకు సానుకూల పరిస్థితిని కల్పించాయి. ఈనెలలో ఇప్పటికే జిల్లాలోని దాదాపు సగం మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈసారి వర్షాలు ఆశాజనకంగా ఉంటాయన్న సంకేతాలు వాతావరణశాఖ నుంచి అందుతున్నాయి. తాజా వర్షాలతో పలు ప్రాంతాల్లో దుక్కులు దున్నకానికి సిద్ధమవుతున్నారు.

ఈ ఏడాది ముందస్తు వానలు

ఈ ఏడాది తొలకరి సాగుకు సానుకూల వాతావరణం కనిపిస్తోంది. గత పక్షం రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలు అందుకు ఉపకరిస్తున్నాయి. జిల్లాలో మేలో 51.30 మి.మీ సాధారణ వర్షపాతం కాగా వారం రోజుల్లో దాదాపు 49.0 మి.మీ నమోదైంది. గరిష్ఠంగా మద్దిపాడు మండలంలో 139.6 మి.మీ కురిసింది. హనుమంతునిపాడులో 105.4, మార్కాపురంలో 103.8, పొదిలిలో 90.6, నాగులుప్పలపాడులో 91.4, తర్లుపాడులో 81.2, ఒంగోలులో 87.4 మి.మీ.వర్షపాతం నమోదైంది. అలాగే పీసీపల్లి, సంతనూతలపాడు, కొండపి, వెలిగండ్ల, ముండ్లమూరు, దొనకొండ, పెద్దారవీడు, త్రిపురాంతకం మండలాల్లో 50నుంచి 80 మి.మీ కురిసింది. ఇతర మండలాల్లోనూ ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. జిల్లా అంతటా మూడు రోజులుగా జల్లులు పడుతూ వాతావరణం చల్లబడింది. మరో రెండు రోజులు ఇలాంటి పరిస్థితే ఉండొచ్చన్న సమాచారం వాతావరణ శాఖ నుంచి అందుతోంది.

జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం లక్షా 72వేల హెక్టార్లు కాగా.. సుమారు 40వేల హెక్టార్లలో తొలకరి పైర్లు వేస్తారు. నెలాఖరు లోపు రెండు, మూడుసార్లు ఒక మోస్తరు వర్షం కురిస్తే మరింత ఉత్సాహంగా ఖరీఫ్ సాగును చేపట్టే అవకాశం ఉంది. ఖరీఫ్ సీజన్ పంటల సాగు జూన్ నుంచి ప్రారంభిస్తారు. మెట్ట పైర్లను అధికంగా వేస్తారు. మే రెండో వారంలో జల్లులు పడితే నాల్గో వారం నుంచి తొలకరి సాగుకు ఉపక్రమిస్తారు. ప్రధానంగా లేటు ఖరీఫ్‌లో లేదా రబీలో రెండో పంట వేసేందుకు వీలుగా సజ్జ, నువ్వు, పెసర వంటి వాటితోపాటు పచ్చిరొట్ట ఎరువుకు ఉపకరించే పిల్లిపెసర, జీలుగ, జనుము ఇతర పశుగ్రాస పంటలు తొలకరి పైర్లుగా సాగు చేస్తారు. మే ఆఖరు నుంచి జూన్ ఆఖరులోపు వేసే ఈ పైర్లు మూడు నెలల్లో చేతికి వస్తాయి. వాటిని కోసిన అనంతరం ఆ భూముల్లో వరి, పొగాకు, మొక్కజొన్న, శనగ ఇతరత్రా పంటలు వేస్తారు. కొన్నేళ్లుగా వర్షాకాలం తారుమారుగా ఉంటున్న నేపథ్యంలో తొలకరి సాగు సక్రమంగా జరగడం లేదు.

వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక

ఖరీఫ్ సాగుకు సుమారు 8,893 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు కోరుతూ ఉన్నతాధికారులకు నివేదించామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. అందులో 177 క్వింటాళ్ల జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుకు సంబంధించిన విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మరో నాలుగు వేల క్వింటాళ్ల కంది, పెసర, మినుము విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు.



అస్థిరంగా లోగ్రేడ్ మార్కెట్

ధరల హెచ్చుతగ్గులతో భారీ నష్టం

రైతు ప్రతినిధుల ఆవేదన

ప్రస్తుత మార్కెట్ తీరుపై రైతులు, అధికారులతో బోర్డు ఈడీ సమీక్ష

మరో రూ.5 పెరిగి కిలో రూ.308 పలికిన మేలురకం గరిష్ఠ ధర

పలు కేంద్రాల్లో కొనుగోళ్లను పరిశీలించిన బోర్డు సెక్రటరీ

ఒంగోలు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఈఏడాది పొగాకు ధరలు బాగానే ఉన్నప్పటికీ లోగ్రేడ్ రకం మార్కెట్ స్థిరంగా లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పలువురు రైతు ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. లోగ్రేడ్‌లోని పచ్చ, మాడు, బ్రౌన్ రకం బేళ్లకు ఒక్కోరోజు ఒక్కోరకంగా ధరలను వ్యాపారులు ఇస్తున్నారన్నారు. అలా కాకుండా లోగ్రేడ్ ధరలు స్థిరంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబును కోరారు. దక్షిణాది పొగాకు మార్కెట్ హాట్‌హాట్‌గా కొనసాగుతున్నప్పటికీ ధరల హెచ్చుతగ్గులతో రైతులు నష్టపోతున్న తీరును పలువురు రైతు ప్రతినిధులు బోర్డు ఉన్నతాధికారైన ఈడీ దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో ఆయన శుక్రవారం ఒంగోలు వచ్చి ఇక్కడి ఆర్ఎం కార్యాలయంలో దక్షిణాది ప్రాంత వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు పొగాకు బోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్, ఆర్ఎం లక్ష్మణరావు వెల్లంపల్లి, ఒంగోలు-2, టంగుటూరు కేంద్రాల్లో వేలం తీరును పరిశీలించారు. ఆ సందర్భంగా వారు గమనించిన అంశాలను ఈడీ సమీక్షలో వివరించారు. కాగా ప్రస్తుతం లభిస్తున్న ధరల పట్ల సంతృప్తి ఉన్నప్పటికీ రోజుకో రకంగా హెచ్చుతగ్గుల మార్కెట్‌తో రైతులు నష్టపోతున్నారని, దానిని చక్కదిద్దాలని రైతు ప్రతినిధులు ఈడీ శ్రీధర్‌బాబును కోరారు. అలాగే అధికోత్పత్తి పంట అమ్మకాలను కూడా ఒకేసారి ప్రస్తుత వేలంతోపాటే కొనసాగించాలని, గత ఏడాది వలే అపరాధ రుసుం రద్దు చేయాలని, చూర, ముక్క, టాప్‌లీఫ్‌ను వేలం కేంద్రాల్లోనే కొనేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తి తగ్గడంతో ఇక్కడ మంచి ధరలు లభిస్తున్నాయన్నారు. రైతులు ఆందోళన చెందుతున్న లోగ్రేడ్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. అధిక ఉత్పత్తి పంట అమ్మకాల అనుమతి కోసం ఉన్నతాధికారులకు ఇప్పటికే లేఖ రాశామని ఆయన చెప్పారు. ఈ లోపు అనుమతి ఉన్న పంటను విక్రయించుకోవాలని సూచించారు. అపరాధ రుసుం మొత్తం రద్దు చేస్తే పంట ఉత్పత్తిపై నియంత్రణ కోల్పోతామన్న ఆయన కొంత మేర అది ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో బోర్డు సభ్యులు పొద ప్రసాదరావు, బ్రహ్మయ్య, మారెడ్డి సుబ్బారెడ్డి, వివిధ వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు, వేలం కేంద్ర అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం మార్కెట్‌లో మేలురకం పొగాకు గరిష్ఠ ధర కిలోకు రూ.5 పెరిగి రూ.308కి చేరింది. ఒంగోలు-1లో ఈ ధర దక్కింది. ఇతర కేంద్రాల్లో కిలో రూ.303 నుంచి 305 వరకూ లభించింది.



రైతు ప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తున్న ఈడీ శ్రీధర్‌బాబు



ప్రక్షాళన ప్రారంభం

డిప్యుటేషన్‌పై పనిచేసే ఉద్యోగులపై డీఎంహెచ్‌వో ఆరా

ఇద్దరిని వారి సొంత స్థానాలకు వెళ్లాలని ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనంతో వైద్యశాఖలో కలకలం

ఒంగోలు(కలెక్టరేట్), మే 17 : వైద్యారోగ్యశాఖలో ప్రక్షాళన ప్రారంభమైంది. డిప్యుటేషన్లు రద్దు చేసినా ఆశాఖలో పాతుకుపోయిన ఇరువురు ఉద్యోగులను వారి మాతృ స్థానాలకు వెళ్లిపోవాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. వైద్యారోగ్యశాఖలో అక్రమాలు, అడ్డగోలుగా డిప్యుటేషన్‌లపై 'ప్రక్షాళన ఏదీ' అన్న శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఇది కలకలం రేపింది. డిప్యుటేషన్లపై పనిచేస్తున్న వారిపై డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యాలయంలో అలా ఎంత మంది పనిచేస్తున్నారు? ఇప్పటి వరకు ఎంతమంది డిప్యుటేషన్లను రద్దు చేశారు? తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. పూర్తి వివరాలను ఇవ్వాలని సంబంధిత సెక్షన్‌ల సూపరింటెండెంట్‌లను ఆదేశించినట్లు సమాచారం. అలాగే ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన డాక్టర్లు కూడా డిప్యుటేషన్‌పై వైద్యశాఖలో పనిచేస్తుండటంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం వేలకు వేలు జీతాలు ఇస్తున్నా ప్రజలకు వైద్య సేవలు అందించకుండా కొందరు కార్యాలయంలో పాతుకుపోయి పెత్తనం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అలాంటి వారిపై ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్న సురేష్‌కుమార్ అటువంటి డిప్యుటేషన్ల రద్దుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే వైద్యశాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు శ్రీకారం చుట్టారు. డిప్యుటేషన్‌లపై పనిచేసే వారందరినీ వారి సొంత స్థానాలకు పంపనున్నారు.

పోస్టుల భర్తీపై ప్రభుత్వానికి నివేదిక : డీఎంహెచ్‌వో

వైద్యారోగ్యశాఖలో పోస్టుల భర్తీ విషయమై వచ్చిన ఆరోపణలపై విచారించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లపై వచ్చిన ఆరోపణలపై రాజమండ్రి ఆర్డీ విచారణ చేశారన్నారు. ఒక ఫార్మసీ ఆఫీసర్, ఒక హెల్త్ ఎడ్యుకేటర్ మాత్రమే పని కేటాయింపు ఆధారంగా వైద్యశాఖ జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్నారని తెలిపారు. పీహెచ్‌సీలకు చెందిన వారెవ్వరూ ప్రస్తుతం ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేయడం లేదని ఆయన వివరణ ఇచ్చారు.

తప్పుడు కేసులు పెడితే సహించం

పోలీసులు న్యాయబద్ధంగా వ్యవహరించాలి

టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని

బొట్లపాలెంలో వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన పార్టీ కార్యకర్తలకు పరామర్శ

దర్శి, మే 17: టీడీపీ వర్గీయులపై తప్పుడు కేసులు పెడితే సహించబోమని ఆపార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. పోలింగ్ సందర్భంగా మండలంలోని బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడిచేసి గాయపరిచిన విషయం విదితమే. అనంతరం పోలీసులు ఏకపక్షంగా వ్యవహిస్తూ బాధితులపై అక్రమ కేసులు బనాయించారు. ఈనేపథ్యంలో శుక్రవారం బాలాజీ బొట్లపాలెం వచ్చారు. గాయపడిన టీడీపీ కార్యకర్తలను పరామర్శించారు. జరిగిన ఘటనపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నూకసాని మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని, భయపడాల్సిన పనిలేదని బాధితులకు భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం దర్శిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీకి కొమ్ముకాసిన అధికారులను ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడ కూడా పోలీసులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల అనంతరం బడుగు, బలహీన వర్గాలపై వైసీపీ వర్గీయులు విచ్చలవిడిగా దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏకపక్షంగా వ్యవహరిస్తూ టీడీపీ వర్గీయులను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడితే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు శాగం కొండారెడ్డి, మారెళ్ల వెంకటేశ్వర్లు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, వరగాని పౌలు, మన్నేపల్లి సమర, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు

20 వేల మెజార్టీతో విజయం మనదే..!

ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు ● టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), మే 17 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో ఒంగోలు నియోజకవర్గంలో 20 వేల మెజారిటీతో గెలవబోతున్నామని టీడీపీ కూటమి అభ్యర్థి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని, వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీ కోసం కష్టపడి పనిచేసి ప్రతి కార్యకర్తకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం ఒంగోలులోని ఎన్టీఆర్‌భవన్‌లో బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో దామచర్ల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఎంతో కష్టపడ్డారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలను చైతన్యం చేసి, టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించి, టీడీపీ కూటమికి ఓటు వేసేలా కష్టపడి పనిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేయడంతోపాటు అధికారంలోకి రాగానే అందరికీ అందుబాటులో ఉండి, అన్ని విధాలుగా అండగా ఉంటానని చెప్పారు. ప్రజలు ఓటు వేసిన విధానం చూస్తే స్వచ్ఛందంగా దేశ, విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్ఠాత్మకం కావడంతో టీడీపీ కూటమి గెలుపే ధ్యేయంగా అందరు పనిచేశారన్నారు. వచ్చే నెల 4న జరిగే కౌంటింగ్‌లో ఒంగోలు నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి 20 వేల మెజారిటీతో గెలవబోతుందని, అలాగే రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కాబోతున్నారని దామచర్ల తెలిపారు. సమావేశంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాసరావు, షేక్ కపిల్‌బాషా, పాలూరి వెంకటేశ్వరరెడ్డి, బండారు మదన్ తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఈవీఎంలకు పటిష్ట భద్రత కల్పించాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా

ఒంగోలు(కలెక్టరేట్), మే 17: రాష్ట్రంలో పోల్ ఎలక్ట్రానిక్ యంత్రాలకు పటిష్టమైన భద్రత కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. సచివాలయం నుంచి శుక్రవారం సాయంత్రం ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిలు జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్‌మీనా మాట్లాడుతూ ఈవీఎంలకు పటిష్ట భద్రత కల్పించడంతో పాటు స్ట్రాంగ్ రూముల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం కలెక్టర్లు, ఎస్పీలు ప్రతిరోజు వాటిని సందర్శించాలన్నారు. రాష్ట్రంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బయట, లోపల సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఆర్వోలు సుబ్బారెడ్డి, లోకేశ్వరరావు, నాగజ్యోతి, జాన్‌ఇర్విన్, కుమార్, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్

కరువు, తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

ఖరీఫ్ సాగుకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు ఇవ్వాలి ● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రసాద్ డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), మే 17: గత ఏడాది వచ్చిన కరువు, మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీప్రసాద్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఖరీఫ్‌లో రైతులకు జరిగిన నష్టాన్ని ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం దారుణంగా ఉందన్నారు. జగన్ ప్రభుత్వం అయితే ఏకంగా ఎన్నికల రెండు రోజుల ముందు రైతుల అకౌంట్లోకి డబ్బులు విడుదల చేసి రాజకీయంగా లబ్ధి పొందాలని చూసిందని, అయితే దీనిని గుర్తించిన ఎన్నికల కమిషన్ ఎన్నికల అయిన వెంటనే విడుదల చేయాలని సూచించిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా ఇంతవరకు రైతుల అకౌంట్లోకి నగదు జమ చేయలేదని విమర్శించారు. గతంలో రాయలసీమ జిల్లాలకు చెందిన 58వేల మంది రైతులు 3.68 లక్షల హెక్టార్లలో సాగు చేసిన పంటలు నష్టపోయారన్నారు. మిచౌంగ్ తుఫాన్‌తో 6.95 లక్షల మంది రైతులు 5.68 లక్షల హెక్టార్లలో సాగు చేసిన పంటను కోల్పోయినా ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోవడం దారుణంగా ఉందని చెప్పారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ అందుకు విరుద్ధంగా పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు దత్త ఇచ్చే దిశగా మూడు నల్లచట్టాలను తెచ్చిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 1.50లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించిన పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, పాపులూరి అంజయ్య, పోలవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

సంక్షోభంలో సామాజిక వన రైతులు

- ● గిట్టుబాటు ధరలు లేక ఆవేదన
- ● పట్టించుకోని ప్రభుత్వాలు

మద్దిపాడు, మే 17: అసలే కరువు. దానికి తోడు జామాయిల్, సుబాబుల్ రైతుల పరిస్థితి గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు కూడా రాని దారుణమైన మార్కెట్ దోపిడీని ఎదుర్కొంటున్నారు. కర్ర కొనుగోలు చేసే వ్యాపారులు, దళారీ వ్యవస్థ రైతులను సంక్షోభంలో నెట్టి వేస్తున్నారు. సామాజిక వనాలుగా గుర్తింపు పొందిన జామాయిల్, సుబాబుల్ సాగు ఖర్చులు కూడా రాకుండా చేస్తున్నారు. తమ కష్టాన్ని, పెట్టుబడిని వదులుకోవాల్సిన పరిస్థితి వారిది. టన్ను సుబాబుల్ రూ.4200 ధర పలకగా జామాయిల్ రూ.4600లకు కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు నేతృత్వంలోని కమిటీ నిర్ధారించినా ఈ రంగంలో మార్కెట్‌ను శాసిస్తున్న కంపెనీలు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గిట్టుబాటు ధరల కోసం రైతులు ఆందోళన చేపడుతున్న కంపెనీలు వ్యవహార శైలి ఆందోళన కలిగిస్తున్నాయని రైతులు అంటున్నారు. జామాయిల్, సుబాబుల్ దాదాపు మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకు కర్రను అలాగే ఉంచితే కర్ర ఎండిపోయే పరిస్థితి వస్తున్నట్లు వారు చెబుతున్నారు. కర్ర కోత అనంతరం పొలాన్ని దున్ని వేసి మామూలు స్థితికి తీసుకురావాలన్నా ఎకరాకు రూ.12 వేల నుంచి రూ.15 వేల ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. చాలా మంది వరకు రైతులు వచ్చిన కాడికి తెగనమ్మేసే పరిస్థితిలో ఉండగా, నాలుగైదు సంవత్సరాలు ఉంచినా కొలు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 20 శాతం అమ్ముకోగా 80 శాతం రైతుల వద్ద ఉంది. ప్రభుత్వం నిర్ణయించే ధరలకు మార్కెట్ యార్డ్ ద్వారా సుబాబుల్, జామాయిల్‌ను కొనుగోలు చేస్తే తప్ప రైతులు కోలుకోలేని పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. మద్దిపాడు మండలంలో దాదాపు 150 ఎకరాల్లో జామాయిల్, 30 ఎకరాల్లో సుబాబుల్ తోటలను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు దాదాపు లక్ష రూపాయల వరకు పెట్టుబడి అవుతుందని, ప్రభుత్వం జోక్యం చేసుకుని టన్నుకు రూ.6 వేల ధర నిర్ణయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



మద్దిపాడులో సాగులో ఉన్న జామాయిల్ తోట

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
-కాకర్ల విజయ్‌కుమార్, నాగన్నపాలెం



కొన్ని వేల టన్నులు న్యూస్ ప్రింట్ ఇతర దేశాల నుంచి దిగుమతి జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం లేదు. దీనివల్ల ఇక్కడ సాగులో ఉన్న కర్రకు పూర్తిగా డిమాండ్ తగ్గిపోతోంది. తక్షణం ప్రభుత్వం స్పందించి సామాజిక వనాల రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

రూ.6వేల ధర నిర్ణయించాలి
-బెజవాడ శ్రీరామమూర్తి, దొడ్డవరప్పాడు



జామాయిల్, సుబాబుల్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని టన్నుకు రూ.6 వేలుగా నిర్ణయించాలి. రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు, వడ్డీలు కట్టలేని స్థితిలో ఉన్నారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి సామాజిక వన రైతుల సమస్యలను పరిష్కరించాలి.

అన్యాయం జరిగిందని

పచ్చాకు కూలీల ఫిర్యాదు

● పరిశీలించాలని సీఈవో ముఖేష్‌కుమార్ మీనా ఆదేశం

కొండపి, మే 17 : తమను పచ్చాకు పనులకు తీసుకెళ్లి, చేసిన పనికి కూలి డబ్బులు ఇవ్వకుండా ఎగవేశారని, డబ్బులు అడిగితే తమను దూషించారని, తమకు న్యాయం చేయాలని బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన కూలీలు సీఈవో ముఖేష్‌కుమార్‌కు కొండపి మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన రైతులపై ఫిర్యాదు చేశారు. కూలీలకు, రైతులకు మధ్య కూలి డబ్బుల విషయంలో వివాదం ఏర్పడింది. చేసిన పనికి తక్కువగా డబ్బులు వస్తాయని రైతులు అంటుండగా, తాము ఒప్పందం ప్రకారం పనిచేశామని తమకు డబ్బులు ఇంకా రావాలని కూలీలు అంటున్నారు. కూలీల ఫిర్యాదుకు స్పందించిన సీఈవో ఆ ఫిర్యాదును రాష్ట్ర డీజీపీకి పరిశీలించాలని శుక్రవారం పంపారు. డీజీపీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కూలీలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై కృష్ణబాజీబాబు తెలిపారు.

రైలులో పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత

పొదిలి, మే 17 : రైల్లో పోగొట్టుకున్న బ్యాగును భద్రపరిచి యజమానికి అందజేసి రైల్వేపోలీసులు తమ నిజాయితీని చాటుకున్నారు. పొదిలికి చెందిన కారంశెట్టి హరికృష్ణ అనే వ్యాపారి ఈనెల 14న ఉజ్జయిని వెళ్లాడు. ఈ క్రమంలో తిరుగు ప్రయాణంలో బంగారు వస్తువులు, మరికొన్ని విలువైన వస్తువులతో కూడిన బ్యాగును రైల్లో తాను కూర్చున్న సీటు కింద పెట్టి మర్చిపోయి రైలు దిగాడు. ఇంటికి వచ్చేంత వరకు బ్యాగును గమనించని హరికృష్ణ ఇంటికి వచ్చి చూశాడు. బ్యాగు పోగొట్టుకున్నాని గమనించి రైల్వే పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు తమిళనాడులోని కాట్‌పాడి వద్ద రైల్లో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకొని భద్రపరిచారు. బాధితుడికి విషయం తెలియజేయడంతో కాట్‌పాడి వెళ్లి సంబంధించిన ఆధారాలు చూపించడంతో పోలీసులు హరికృష్ణకు బ్యాగును అందజేశారు. రైల్వేపోలీసుల నిజాయితీకి హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ఇది కాలువ కాదు..రోడ్డే..!



రాజీవ్‌గృహకల్ప కాలనీలోని ఓ రోడ్డులో నిలిచిన వర్షపునీరు

ఒంగోలు నగరం గురువారం ఒక్కరోజు కురిసిన వానకు తడిసి ముద్దయ్యింది. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని నగరం ఒక్క రోజు ఓ గంటపాటు కురిసిన వానకు నగర వీధులు చెరువుల్లా మారాయి. వర్షం నిలిచి 24 గంటలు అవుతున్నా, నేటికి పలు కాలనీల్లో రోడ్లపై వర్షపు నీరు అలాగే నిలిచింది. స్థాని రాజీవ్‌గృహకల్పలో ఇప్పటికీ రోడ్లలో నీరు నిలిచి, కాలువలను తలపిస్తున్నాయి. ఇదిలా ఉంచితే నగరంలోని పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. - ఒంగోలు (కార్పొరేషన్)

కిమ్స్‌లో అరుదైన చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ హరీష్

ఒంగోలు(కలెక్టరేట్), మే 17: ఒంగోలులోని కిమ్స్ హాస్పటల్‌లోని కార్డియాలజీ విభాగంలో అరుదైన చికిత్స చేసినట్లు డాక్టర్ ఓరుగంటి హరీష్ తెలిపారు. స్థానిక కిమ్స్ వైద్యశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 67 సంవత్సరాల వెంకట్రావు అనే వ్యక్తి తీవ్రమైన ఎరోటిక్ సటనోసిస్‌తో బాధపడుతూ తమ ఆసుపత్రికి వచ్చారన్నారు. సాధారణంగా ఇలాంటి వ్యాధులకు ఓపెన్‌హార్ట్ సర్జరీ(ఏవీఆర్) అనే పెద్ద ఆపరేషన్ చేయాల్సి ఉంటుందన్నారు కానీ ఈ రోగికి గతంలో బైపాస్ సర్జరీ జరగడం వల్ల ఏవీఆర్ ఆపరేషన్ సాధ్యపడలేదని చెప్పారు. కిమ్స్‌లో అధునాతన పరికరాలు, ఆధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉండటంతో టీఏవీఐ విధానం ద్వారా ఆపరేషన్ లేకుండా రోగికి వ్యాధిని నయం చేసినట్లు తెలిపారు. రెండు రోజుల్లోనే ఆరోగ్యం మెరుగుపడి డిశ్చార్జ్ అయ్యారన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరి మాట్లాడుతూ మెట్రో నగరాలకే పరిమితమైన ఇటువంటి క్లిష్ట సర్జరీలను ఒంగోలులోని కిమ్స్ హాస్పటలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ టి.శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ చికిత్సలో పాల్గొన్న డాక్టర్ హరీష్, కార్డియాలజీ వైద్య బృందాన్ని అభినందించారు. హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ అత్యాధునిక వైద్య సేవలు జిల్లా వాసులకు ఎప్పటికప్పుడు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు హాస్పటల్ యాజమాన్యం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

9.3 మి.మీ వర్షపాతం

ఒంగోలు(కలెక్టరేట్), మే 17 : జిల్లాలోని పలు మండలాల్లో గురువారం ఒక మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 9.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఒంగోలులో అత్యధికంగా 56.4 మి.మీ కురిసింది. వెలిగండ్ల మండలంలో 48.2మి.మీ, పీసీపల్లిలో 34.4, హనుమంతునిపాడులో 28.4, కొండపిలో 22.8, సింగరాయకొండలో 18.8 మి.మీ వర్షపాతం నమోదైంది. సంతనూతలపాడు మండలంలోని 18.6మి.మీ, పుల్లలచెరువులో 18.0, టంగుటూరులో 14.8, జరుగుమల్లిలో 14.6, ఎర్రగొండపాలెంలో 14.2, ముండ్లమూరులో 11.6 మి.మీ కురిసింది. మరో పది మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

విద్యార్థులకు శిక్షణ తరగతులు



పాట పాడుతున్న చిన్నారి

కొండపి, మే 17 : కొండపి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తకాలను పఠించారు. కథలు చెప్పడం, పాటలు పాడటం చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు అగ్గిరాముడు విద్యార్థులకు ఇంగ్లీషు భాషాభివృద్ధి చేసుకోవడంలో మెలకువలు వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని గ్రంథ పాలకుడు బత్తుల కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

కోదండ రామస్వామికి పూజలు



స్వామివారికి లక్ష మల్లెపూలతో అర్చన

సింగరాయకొండ, మే 17 : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని కోదండ రామస్వామి దేవస్థానంలో శుక్రవారం సీతాదేవి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ, లక్ష్మణ, సీతాదేవి విగ్రహాలను పుష్పాలతో అలంకరించారు. అనంతరం వైభవంగా లక్ష మల్లెల పూజ చేశారు. తదనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పొగాకు వేలం పరిశీలన



వేలాన్ని పరిశీలిస్తున్న ఆక్షన్ మేనేజర్, ఆర్ఎం

టంగుటూరు, మే 17 : టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం బోర్డు ఆక్షన్ మేనేజర్, ఇన్‌చార్జి కార్యదర్శి వేణుగోపాల్ సందర్శించారు. తొలుత వీరు వేలం సరళిని, వివిధ పొగాకు గ్రేడ్లకు వచ్చిన ధరలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. వేలానికి అన్ని రకాల పొగాకు గ్రేడ్లు తెచ్చుకోవాలని, బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. ఆయన వెంట ఆర్ఎం లక్ష్మణరావు ఉన్నారు. కాగా శుక్రవారం జరిగిన వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.304 దక్కింది. వేలం కేంద్రానికి తూమాడు, జమ్ములపాలెం రైతుల 1,005 బేళ్లను అనుమతించారు. ఇందులో 974 బేళ్ల కొనుగోలు కాగా, మిగిలిన తిరస్కరణకు గురయ్యాయి. కొనుగోళ్లలో 17 వ్యాపార కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు. గరిష్ఠ ధర రూ.304 కాగా, కనిష్ఠ ధర రూ.205 రైతులకు లభించింది.

అనధికార భవన నిర్మాణాన్ని ఆపాలంటూ నోటీసు జారీ

టంగుటూరు, మే 17 : టంగుటూరులోని కుమ్మరి ఈనాంలో అనధికారికంగా ఇళ్లు నిర్మిస్తున్న తులసి వెంకటసుబ్బయ్యకు ఆ నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ పంచాయతీ కార్యదర్శి జగదీష్ శుక్రవారం నోటీసు జారీ చేశారు. బస్టాండ్ సెంటర్‌లో అప్సర థియేటర్ ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 1248/బిలోని 69 సెంట్ల స్థలంలో 5 సెంట్ల ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఈ భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. ఆ స్థలంలో జరుగుతున్న నిర్మాణాల గురించి కార్యదర్శి తహసీల్దార్‌కు తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి వెంటనే వెంకటసుబ్బయ్యకు నోటీసు ఇచ్చారు.

అవీ..ఇవీ..

చీమకుర్తి ఎంఈవోగా నరసింహారావు



నరసింహారావును అభినందిస్తున్న నాయకులు

ఒంగోలు(విద్య), మే 16: చీమకుర్తి ఎంఈవో-1గా డీవీఎల్.నరసింహారావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్యా గుంటూరు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడి ఎంఈవో వెంకటేశ్వరరెడ్డి గతనెల 30న ఉద్యోగ విరమణ చేశారు. ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనల ప్రకారం ప్రభుత్వ సర్వీసులోని హైస్కూలు ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఎంఈవో-1 పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగించే అవకాశం ఉంది. దీంతో మైనంపాడు ప్రభుత్వ హైస్కూలు ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న నరసింహారావుకు చీమకుర్తి ఎంఈవో-1గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన నియామకంలో తదుపరి చర్యలు తీసుకోవాలని డీఈవో, ఒంగోలు ఉప విద్యాధికారులను ఆర్జేడీ ఆదేశించారు.

ఏపీటీఎఫ్ నాయకుల అభినందన

చీమకుర్తి : చీమకుర్తి ఎంఈవోగా నరసింహారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈవో పోస్టు ఖాళీగా ఉండటంతో మండలంలోని టీచర్ల జీతభత్యాలకు ఇబ్బందిగా మారింది. ఈక్రమలో ఎంఈవోగా నరసింహారావును నియమించడంతో ఆయనను ఏపీటీఎఫ్ నాయకులు కలిసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు యాకోబు, మాకినేని శ్రీనివాసరావు, హరిబాబు, మాదాల హనుమంతరావు, ఆదిశేషు, శిరిగిరి శ్రీనివాసరావు, శర్మ, రాజేష్, రామిరెడ్డి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ అంజిరెడ్డి

ఒంగోలు(విద్య), మే 17: రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో నూతనంగా విద్యార్థులు చేరేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ఏపీఈఏపీసెట్ ఎంట్రెన్స్ పరీక్షలను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. వల్లూరు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎంట్రెన్స్ పరీక్షా కేంద్రాలతో పాటు ఒంగోలు నగరంలోని నేషనల్‌కౌన్సిల్ చర్చ్ సోషల్ యాక్షన ఇన్ ఇండియా పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఎంట్రెన్స్ పరీక్షలను సజావుగా, సక్రమంగా నిర్వహించాలని ఆయా పరీక్షా కేంద్రాల నిర్వహకులకు ఆయన సూచించారు.

రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్

మద్దిపాడు, మే 17: నిరంతరం రక్తపోటును పరీక్షించుకుంటూ దానిని నియంత్రణలో ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధిక రక్తపోటు గుండె, మూత్రపిండాలపై ప్రభావం చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీదేవి, వైద్యాధికారి శ్రవణ్‌కుమార్, డాక్టర్ ఆనందమోహన్, ఎంపీహెచ్‌ఈవో తాళ్లూరి వెంకటేశ్వరరావు, వైద్యులు భగీరథి, ఎం.ప్రదీప్‌కుమార్, కె.మోక్షానంద్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వెంకట్రావు



ప్రమాణస్వీకారం చేస్తున్న సంఘ సభ్యులు

ఒంగోలు(విద్య), మే 17 : ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనునకున్నారు. శుక్రవారం ఒంగోలులోని వీఐపీరోడ్డులోని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం భవనంలో కేవీజీ.కీర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా నూతన గౌరవాధ్యక్షులుగా ఎ.అమ్మయ్య, అధ్యక్షుడిగా బి.వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.అశోక్‌కుమార్, సహాధ్యక్షులుగా ఎస్.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా పీవీ.ప్రభాకరావు, కె.వెంకటేశ్వర్లు, ఎం.విశ్వభారతి, టి.పాండురంగస్వామి, కార్యదర్శులుగా బి.నాగార్జున, విక్రమ్, జి.పాండు, ఎస్.శ్రీదేవి, కె.పెద్దన్న, ఎం.సురేష్‌బాబు, ఎ.గురులింగం, టి.వెంకటేశ్వర్లు, అదనపు కార్యదర్శిగా ఎస్‌హెచ్.కబీర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.ఆంజనేయులు, అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా సీహెచ్‌వీ.చలపతి, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.వెంకటరావు, బి.అశోక్‌కుమార్, పీవీ.సుబ్బారావు, వై.శ్రీనివాసులు, కేవీజీ.కీర్తిలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎ.సురేందర్‌రెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా ఏవీ.రావులు వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



దాణాను అందజేస్తున్న జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, మే 17: సీజనల్ వ్యాదుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ జేడీఏ బేబీరాణి సూచించారు. ఉప్పుగుండూరు గ్రామంలోని పశువైద్యశాల వద్ద పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా టీకాలు అందించే కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల్లో గొంతువాపు, చిటికె వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. వ్యాధిని గుర్తించిన వెంటనే టీకాలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రభుత్వం టీకాలు అందిస్తుందని, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గేదెలు, గొర్రెలకు టీకాలను అందించి కాల్షియం టానిక్‌లు, మినరల్ దాణాను అందించారు. కార్యక్రమంలో పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన

మద్దిపాడు, మే 17: మద్దిపాడులోని బ్రహ్మంగారి చెట్టు వద్ద శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఏలూరి లక్ష్మీనారాయణచారి, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వామివారి భజన పాటలను భక్తులు ఆలపించారు. అలాగే లింగంగుంటలో సైతం బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

మేలురకం పొగాకు కేజీ రూ.304

కొండపి, మే 17 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం ఎఫ్-1రకం మేలిమి గ్రేడ్ పొగాకు కేజీ 304 రూపాయలు అత్యధిక ధర పడింది. ధర్మవరం, కోయవారిపాలెం, వెంకటకృష్ణాపురం, తాటాకులపాలెం, ముక్కోడిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1040 పొగాకు బేళ్లు వేలంలో ఉంచగా, వ్యాపారులు వెయ్యి బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ తెలిపారు.

కొండపి ప్రాంతంలో మోస్తరు వర్షం

కొండపి, మే 17 : కొండపి ప్రాంతంలో గురువారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో భూమి చల్లబడింది. వేసవి ఎండలతో, ఉక్కపోతలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఊరటనిచ్చింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఎండల తీవ్రత నుంచి శుక్రవారం ఉపశమనం పొందారు.



అమ్మవారి వేషధారణలో కళాకారుడు



మంటలతో కళాకారుడి విన్యాసం



డప్పు దరువుల మధ్య నృత్యాలు

శోభాయమానంగా వాసవి అమ్మవారి నగరోత్సవం



పురవీధుల్లో విహరిస్తున్న అమ్మవారు

ఒంగోలు (కల్చరల్), మే 17 : ఒంగోలు నగరం గాంధీరోడ్డులోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం శుక్రవారం అత్యంత శోభాయమానంగా జరిగింది. ఈ సంద ర్భంగా అమ్మవారికి చందనాలంకరణ నిర్వహించి సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేశారు. ఇక పెద్ద సంఖ్యలో మహిళలు మల్లెపూల ను చేతపట్టుకుని భక్తిశ్రద్ధలతో గాం .ధీరోడ్డు, దక్షిణం బజారు, ఏనుగు చెట్టు, పప్పుబజార్ మొదలైన ప్రధానవీధులలో నగరోత్సవంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి తీసుకురాగా అనంతరం అమ్మవారికి లక్షమల్లెల అర్చన జరిగింది. అదేవిధంగా వాసవి కోలాట భజన మండలి మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ తదియారాధన సంఘ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



అమ్మవారు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

సిట్‌లో ప్రకాశం పోలీస్..

ఒంగోలు క్రైం, మే 17: రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన అనంతరం అనేక జిల్లాల్లో చోటుచేసుకున్న అరాచకాలపై ఎన్నికల కమిషన్ స్పందించింది. ఈమేరకు పలువురు అధికారులను బదిలీ, సస్పెండ్ చేయడంతో పాటుగా జరిగిన ఘటనలపై విచారణ చేసేందుకు సిట్ ఏర్పాటు చేసింది. సిట్ పర్యవేక్షకుడుగా ఉన్న వినిత్ బ్రిజలాల్ ప్రస్తుతం ఎస్‌ఐబీలో అడిషనల్ డీజీగా పనిచేస్తున్నారు. ఆయన 2007లో ప్రకాశం జిల్లా ఎస్పీగా ఆరు నెలల పాటు పనిచేశారు. అదేవిధంగా సిట్‌లో సభ్యులుగా ఉన్నవారిలో ప్రస్తుతం ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న వల్లూరి శ్రీనివాసరావు, పీటీసీలో సీఐగా ఉన్న మొయిన్‌ను, ఎస్ నుంచి సీఐగా అనేక ప్రాంతాల్లో పనిచేసిన వి.భూషణం ఉన్నారు. సిట్‌లో తాడిపత్రి, తిరుపతి, మాచర్ల, తదితర ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో ఈ బృందం విచారణ చేపట్టనుంది. అక్కడ అవసరమైతే తిరిగి కేసులు కూడా నమోదు చేయించేందుకు ఎన్నికల కమిషన్ సిట్‌కు విశేష అధికారాలు ఇచ్చింది. జిల్లాలో పనిచేసిన పోలీసులు సిట్‌లో స్థానం దక్కించుకోవడంపై పలువురు అభినందిస్తున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్), మే 17 : ఒంగోలు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. శుక్రవారం రాత్రి ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్‌రూములకు వేసిన సీల్‌ను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఒంగోలు పార్లమెంట్‌తో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను పటిష్టంగా చేపట్టడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న స్వీప్ అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 17 : జిల్లాలో ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో అత్యధిక శాతం మంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు కృషి చేసిన జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సత్కరించారు. శుక్రవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో స్వీప్ అధికారులు దినేష్‌కుమార్‌ను శాలువతో సన్మానించారు. రాష్ట్రంలో ఒంగోలు పార్లమెంట్ స్థానం 87.06శాతం ఓటింగ్‌తోనూ, దర్శి అసెంబ్లీ స్థానంలో 90.91శాతం ఓటింగ్‌తో మొదటి స్థానంలో నిలిచేందుకు చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారులు డాక్టర్ బి.రవి, వీఎస్.జ్యోతి, సూపరింటెండెంట్ నాగజ్యోతి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మారుతి, స్వీప్ టీం సభ్యులు పాల్గొన్నారు.

కాచిగూడ రైలు పునరుద్ధరణ

గిద్దలూరు, మే 17 : రైల్వే డబ్లింగ్ పనుల కారణంగా ఈనెలాఖరు వరకు రద్దు చేయబడిన కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలును వెంటనే పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. గుంటూరు-గిద్దలూరు-కాచీగూడ (17251) రైలు ఈనెలాఖరు వరకు రద్దు చేయగా, ఈ రైలును ఈనెల 18వ తేదీ నుంచి పునరద్ధరిస్తున్నట్లు స్థానిక రైల్వే కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అలాగే కాచిగూడ-గిద్దలూరు-గుంటూరు (17252) ఎక్స్‌ప్రెస్ రైలు జూన్ 1వ తేదీ వరకు రద్దు చేయగా ఈరైలును ఈనెల 19 నుంచే పునరుద్ధరించారని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామాల్లో కొత్త పనులపై దృష్టి

● డ్వామా పీడీ అర్జున్‌రావు

మార్కాపురం రూరల్, మే 17: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో న్యూ స్ట్రాటజీ పనుల పై దృష్టి సారించాలని డ్వామా పీడీ అర్జునరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో శుక్రవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపయో గపడే విధంగా ఫారంపాండ్‌లు, మొక్కల పెంపకం తదితర పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. గ్రామాలలో ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు కచ్చితంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని, సగటు వేతనం అందేలా పనులు చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ, కచ్చితంగా పనిదినాలు కల్పించాలని అన్నారు. సమావేశంలో ఏపీడీ నిర్మలాదేవి, ఎంపీడీవో తోట చందన, ఏపీవో జీవరత్నం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

● బొప్పాయి, అరటితోటలకు జీవం

ఎర్రగొండపాలెం, మే 17 : మండలంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక మోస్తరు వర్షం కురిసింది. ఎర్రగొండపాలెం మండల కేంద్రంలో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు ప్రవహించింది. దీంతో మండలంలోని గ్రామాల్లో సాగులో ఉన్న బొప్పాయి, అరటి తోటలకు వర్షం జీవం పోసింది. శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో వర్షం కురుస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురు చూసినా వర్షం కురవలేదని నిరాశ చెందారు. కొద్దిగా పెద్దవర్షం కురిస్తే కాలువల్లోకి, కుంటలలోకి నీరు చేరితే పొలం వెళ్ళే పశువులకు, మేకలకు, గొర్రెలకు తాగునీరు దొరుకుందని మండలంలో రైతులు, పశువుల యజమానులు ఆశగా ఎదురుచూశారు. రైతులకు నిరాశే మిగిలింది. మండలంలో నైరుతి రుతుపవనాలు రాక ముందే ఒకమోస్తరు వర్షం కురవడంతో మండల ప్రజలు ఉపశమనం చెందారు.

బాలికపై యువకుడు అత్యాచారం

● కేసు నమోదు, పరారీలో నిందితుడు

పెద్దదోర్నాల, మే 17: బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన యువకుడిపై పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదేకాలనీకి చెందిన ఎలకపాటి ప్రవీణ్ శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్సై అంకమరావు గ్రామానికి వెళ్లి విచారించగా యువకుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ప్రవీణ్‌పై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశారు. బాలికను మార్కాపురం ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

విద్యుత్ షాక్‌తో 11 నెలల బాలుడు మృతి

విజయనగర్‌కాలనీ(చీరాలటౌన్), మే 17 : ఇంట్లోని విద్యుత్ మోటార్ తగిలి 11 నెలల బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం కాలనీకు చెందిన వినోద్, దివ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈక్రమంలో వీరికి రియాన్ హన్స్(11 నెలలు) బాలుడు సంతానం. సొంతిల్లు లేకపోవడంతో కాలనీలోనే అద్దె ఇంట్లో ఉంటు ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా పురాతన ఇల్లు కావడంతో కాస్త చెమ్మవచ్చింది. దీంతో ఇంట్లోని నీళ్ల మోటారు కూడా తడిసింది. ఈనేపథ్యంలో ఇప్పుడిప్పుడే నడక నేర్చుకుంటున్న బాలుడు బంతాడుతూ మోటార్ పట్టుకుని కుప్పకూలాడు. వెంటనే బాలుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్య పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు.

మున్సిపాలిటీ స్థల ఆక్రమణలపై చర్యలు


కనిగిరి, మే 17: మున్సిపాలిటీ స్థలాలను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ రోడ్డులో రూ.కోటి రూపాయల విలువైన మున్సిపాల్టీ స్థలాన్ని ఆక్రమించి కొంతమంది వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఆంధ్రజ్యోతి మినీలో శుక్రవారం అధికారుల ఆదేశాలు బేఖాతర్ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ కమిషనర్ స్పందించి ఆక్రమణలను తొలగించారు. మున్సిపాల్టీకి చెందిన వాగు, వంక, పోరంబోకు, తదితర స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే అలాంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే, మున్సిపాల్టీ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో దృష్టి సారించి వాటిని సంరక్షిస్తామన్నారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా సంబంధిత సచివాలయంలో రాతపూర్వకంగా నమోదు చేయించాలని ఆయన కోరారు. దీంతో ఆయా సిబ్బంది నిర్ణీత సమయంలో ఆయా సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

పటిష్ట భద్రతలో పోస్టల్ బ్యాలెట్లు

దర్శి, మే 17: దర్శి అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్ ఈవీఎంలను ఒంగోలులోని రైస్ కళాశాలలో భద్రపరిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆర్‌వో కార్యాలయంలో శుక్రవారం రాజకీయ నాయకుల ప్రతినిధులు, చీఫ్ ఏజెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్‌లను స్థానిక ఆర్‌వో కార్యాలయంలో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి సీల్ వేసినట్టు చెప్పారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టమైన బందోబస్తుతోపాటు సీసీ కెమెరాల నిఘాలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలకు ఏమైనా అనుమానాలు ఉంటే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించుకోవచ్చునన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహిరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ రాజకీయపార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టణ ఓటర్ల మొగ్గు ఎటు..?

● అసెంబ్లీ ఎన్నికల్లో ఆది నుంచి టీడీపీదే పైచేయి
● సంప్రదాయం కొనసాగుతుందా..
● జోరుగా బెట్టింగులు



మార్కాపురం, మే 17: సార్వత్రిక ఎన్నికలు ముగిసి నాలుగు రోజులవుతోంది. ఫలితాలు తేలాలంటే జూన్ 4వ తేదీ వరకు ఆగాల్సిందే. ప్రస్తుతం నియోజకవర్గ ప్రజలు గెలుపోటములపై ఉత్కంఠతో ఉన్నారు. మరీ ముఖ్యంగా నాయకులు, కార్యకర్తలు లెక్కల్లో మునిగి తేలిపోయారు. ఏ మండలంలో ఏ పార్టీకి పట్టుంది, ఎవరికెంత మెజార్టీ వస్తుంది తదితర అంశాలపై జోరుగా చర్చ నడుస్తోంది. నియోజకవర్గంలో ప్రధానంగా చెరో రెండు మండలాల్లో ప్రధాన పార్టీలు ఆధిపత్యం చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మార్కాపురం పట్టణంలో వచ్చే మెజార్టీనే ఎవరి గెలుపుకైనా కీలకంగా మారుతుందనేది విశ్లేషకుల అంచనా.

టీడీపీకి కంచుకోటలా పట్టణం

గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పుర ప్రజలు టీడీపీకే జై కొట్టారు. గతంలో ముక్కోణపు పోటీలు జరిగినప్పుడు కూడా ఇక్కడి ప్రజలు టీడీపీ పక్షానే నిలిచారు. టీడీపీ ఆవిర్భావం నుంచి జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఇతర పార్టీలు ఇక్కడ ఆధిపత్యం చూపిన దాఖలాలులేవు. 1994 లో టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా టీడీపీ మద్ధతుతో పోటీలో నిలిచిన జంకె వెంకటరెడ్డికి ఇక్కడ మెజార్టీ వచ్చింది. అంతకు మినహా అన్ని ఎన్నికల్లోనూ పట్టణంలో టీడీపీదే హవా నడిచింది. 1999లో ఇక్కడ కేపీ.కొండారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచినా పట్టణంలో మాత్రం టీడీపీనే మెజార్టీ సాధించింది. 2004లో రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచింది. అవే ఎన్నికల్లో ఇక్కడ టికెట్ దక్కక టీడీపీ రెబల్‌గా జంకె వెంకటరెడ్డి పోటీ చేశారు. అయినా అప్పుడు టీడీపీ తరపున మొదటిసారి పోటీలోవున్న కందుల నారాయణరెడ్డిని పట్టణ ఓటర్లు ఆదరించారు. 2009 ఎన్నికల్లో ఒక్క పట్టణంలోనే సుమారు 10 వేల పైచిలుకు మెజార్టీ టీడీపీకి వచ్చింది. ఆ ఎన్నికల్లో పట్టణంలో వచ్చిన మెజార్టీతోనే కందుల నారాయణరెడ్డి మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెందినా పట్టణంలో మాత్రం 3,500 ఓట్ల మెజార్టీ వచ్చింది. 2019లో జరిగిన ఎన్నికల్లో జగన్ ప్రభంజనం వీచినా మార్కాపురం పట్టణ కంచుకోట మాత్రం చెక్కుచెదరలేదు. చివరికి టీడీపీని వీడి జనసేన తరపున ఇమ్మడి కాశీనాథ్ పోటీచేసి ఓట్లు చీల్చినా టీడీపీ అభ్యర్థి కందుల నారాయణ రెడ్డికి పట్టణంలో 1,450 ఓట్లపైనే మెజార్టీ వచ్చింది. ఇప్పుడు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆర్య వైశ్య సామాజికవర్గానికి చెందిన అన్నా రాంబాబు వైసీపీ తరపున బరిలో నిలవడంతో తొలిసారి పట్టణంలో మెజార్టీ సాధిస్తామని ఆ పార్టీ వర్గాలు ధీమాగా ఉన్నాయి. పట్టణంలో ఆర్య వైశ్య సామాజికవర్గం మొదటినుంచి టీడీపీకి మద్దతుగా నిలిచింది. విపత్కర పరిస్థితుల్లో కూడా పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారు. మరి ఈసారి కూడా ఆ సామాజిక వర్గం మద్దతు పూర్తిస్థాయిలో ఉంటే పట్టణంలో మెజార్టీ సాధించడం నల్లేరుపైన నడకే.

జోరుగా సాగుతున్న పందేలు

ఎన్నికల ఫలితాలపై పందెం రాయుళ్లు జోరుగా బెట్టింగులు పెడుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపైకంటే పట్టణంలో ఏ పార్టీకి మెజార్టీ వస్తుంది అనే దానిపైనే ఎక్కువ మొత్తంలో పందేలు కాస్తున్నట్లు సమాచారం. మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని 24వ బూత్ నంబరు నుంచి 81 వరకు పట్టణ బూత్‌లుగా పరిగణిస్తారు. కొందరైతే ఆర్యవైశ్య సామాజికవర్గ ఓటర్లు అధికంగా బూత్‌లపై కూడా బెట్టింగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీకి చెందిన ఓ నాయకుడు పట్టణ మెజార్టీపై భారీ మొత్తంలో పందెం కాసినట్లు విశ్వసనీయ సమాచారం. గెలు పోటములు ఎలావున్నా ప్రస్తుత ఎన్నికలు పట్టణంలో వచ్చే మెజార్టీ చుట్టే తిరుగుతుండటం గమనార్హం.

పశువుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి బేబీరాణి



పశువుల షెడ్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ బేబీరాణి

తాళ్లూరు, మే 17: పశువుల షెడ్‌ల వద్ద ఉండే వ్యర్థపదార్థాలతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి అన్నారు. పశుపోషకులు పశువుల షెడ్‌ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండలంలోని పలుగ్రా మాల్లో శుక్రవారం పశువుల షెడ్లను శుక్రవారం పరిశీలించారు. గ్రామాల్లో పశువుల షెడ్ల నుచి వచ్చే వ్యర్థపదార్థాలతో డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెం దుతున్నాయని వైద్యశాఖ సిబ్బంది ఆశాఖ అధికారులకు విన్నవించారు. దీంతో పశుసంవర్థకశాఖ అధికారులు శివరాంపురంలో పశువుల షెడ్‌లను పరిశీలించి పశుపోషకులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ పశుపోషకులు కూడా తమ షెడ్‌ల వద్ద అపరిశుభ్రం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగునీరు ప్రవహించే ప్రాంతాల్లో బ్లీచింగ్, ఫినాయిల్ పిచికారి చేయించి దో మలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ కాలేషావలి, ఉపసంచాలకులు రమేష్‌బాబు, సహసంచాలకులు పురుషోత్తమరావు, పశువైద్యాధికారులు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, రాంబాబు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై బాపట్ల డీఎస్పీ విచారణ

యద్దనపూడి, (మార్టూరు) మే 17: పోలీసులు నమోదు చేసిన అట్రాసిటీ కేసుపై శుక్రవారం రాత్రి బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీ కృష్ణ విచారణ చేపట్టారు. ఆయన రాత్రి యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి వచ్చి సంఘటనకు దారితీసిన పరిస్థితులు, ఫిర్యాదుదారు మహేష్‌ను, కొంతమంది వ్యక్తులను విచారించారు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలో ఈ నెల 11వ తేదీన తెలుగుదేశం కూటమికి చెందిన పార్టీ కార్యకర్తలు ద్విచక్రవాహనాలపై ర్యాలీగా వెళుతుండగా యనమదల వైపు నుంచి చింతపల్లిపాడు వైపు ఎంపీ నందిగం సురేష్ కాన్వాయ్‌తో వస్తున్నారు. అక్కడ ర్యాలీపై వస్తున్న కార్యకర్తలకు, ఎంపీ సురేష్ మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో వైసీపీ మద్దతుదారు మహేష్ స్టేషన్‌లో కొంతమంది టీడీపీ మద్దతుదారులపై అట్రాసిటీ కేసు పెట్టారు. దాంతో డీఎస్పీ చింతపల్లిపాడు గ్రామానికి వచ్చి కొంతమందిని విచారించారు. తరువాత మార్టూరు మండలంలో కోనంకి గ్రామంలో రెండు అట్రాసిటీ కేసులకు సంబంధించి డీఎస్పీ మురళీ కృష్ణ విచారణ చేశారు. కోనంకి గ్రామంలో పోలింగ్ రోజున టీడీపీ, వైసీపీ మద్దతుదారులకు చెందిన వ్యక్తుల మధ్య జరిగిన గొడవకు సంబంధించి మార్టూరు స్టేషన్‌లో ఇరు వర్గాలు ఫిర్యాదుతో రెండు అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి బాధితులను వారి ఇంటి వద్ద డీఎస్పీ విచారించారు. ఆయన వెంట మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజ శేఖర్ రెడ్డి, ఏఎస్‌ఐలు సైదా, బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల డీఎస్పీ ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

● సహాయ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన ఆమంచి వర్గీయులు

చీరాలటౌన్, మే 17 : చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ వ్యవహార శైలి ప్రజాస్వామ్యానికి భిన్నంగా ఉందని, అతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమంచి వర్గీయులు సహాయ ఎన్నికల అధికారి కోటేశ్వరరావును కోరారు. శుక్రవారం వారు అధికారిని కలిసి చీరాల నియోజకవర్గంలో ఎన్నికల రోజు నుంచి జరిగిన పలు అంశాలను వివరించారు. ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రెగోరీపై డీఎస్పీ ఉద్దేశపూర్వకంగానే దాడిచేసినట్లు ఆరోపించారు. అలాగే స్థానిక శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ బయటకు వ్యక్తులను తీసుకువచ్చి ఆమంచిపై దాడికి తెగబడినట్లు ఆరోపించారు. చీరాల్లో జరిగిన ఘటనలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుపత్రం అందజేశారు. అధికారిని కలిసిన వారిలో పలువురు ఆమంచి వర్గీయులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అద్దంకిపై కొనసాగుతున్న పందేలు

● అత్యధిక శాతం టీడీపీ మెజార్టీ పైనే..

అద్దంకి, మే17: సార్వత్రిక ఎన్నికలు ముగిసి 4 రోజులు దాటినా ఇంకా బెట్టింగుల జోరు మాత్రం కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై ఇరు పార్టీల నేతలు ఎవరి ధీమా వారిదేగా బెట్టింగులు పెడుతున్నారు. ఇక అద్దంకి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు నుంచే బెట్టింగులు మొదలయ్యాయి. ఎన్నిలు ముగిసిన తరువాత 4 రోజులుగా రెండు పార్టీల నాయకులు గ్రామాల వారీగా లెక్కలు వేసుకొని బెట్టింగులకు సిద్ధపడుతున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ విజయం విషయంలో తక్కువ బెట్టింగులు జరుగుతుండగా, 15 వేల మెజార్టీ చుట్టూ ఎక్కువ బెట్టింగులు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక మండలాల వారీగా కూడా మెజార్టీలపై ఎక్కువ బెట్టింగులు సాగుతున్నట్లు సమాచారం. గ్రామాలలో కూడా కొంతమంది బెట్టింగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు బెట్టింగులు కొనసాగే అవకాశం ఉంది.

ఆమంచిపై ఇండిపెండెంట్ అభ్యర్థి ఫిర్యాదు



రాష్ట్ర సహాయ ఎన్నికల అధికారి కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేస్తున్న తేళ్ల రాంబాబు

చీరాలటౌన్, మే 17 : ఎన్నికల సమయంలో చీరాల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ చేసిన అఘాయిత్యాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని చీరాల ఇండిపెండెంట్ అభ్యర్థి తేళ్ల రాంబాబు కోరారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని రాష్ట్ర సహాయ ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావును రాంబాబు కలిశారు. ఈ సందర్భంగా ఆమంచిపై రాతపూర్వకంగా తయారు చేసిన ఫిర్యాదు పత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఒకవైపు పోలింగ్ జరుగుతుండగా మరోవైపు పలువురిపై ఆమంచి దాడులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా గతంలోను ఆమంచిపై పలు కేసులున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారిని రాంబాబు కోరారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

త్రిపురాంతకం, మే 17: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గణపవరం ఎస్సీ కాలనీలో శుక్రవారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన మాచర్ల కొండలు (35) ఐస్ క్రీం బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి నిద్రపోయో ముందు తన ఐస్ క్రీం బండికి కూలింగ్ కోసం ఎప్పటిలాగే విద్యుత్ సరఫరా ఇచ్చాడు. శుక్రవారం ఉదయం బేరానికి వెళ్లే ముందు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రయత్నం చేస్తుండగా షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో గాయపడి వ్యక్తి మృతి

కొత్తపట్నం(ఒంగోలు నగరం) మే 17: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మెడికల్ రిప్రజంటేటివ్ మృతిచెందాడు. కొత్తపట్నంరెడ్డిపాలెంకు చెందిన వెంకటరావు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తూ గురువారం రాత్రి కొత్తపట్నం నుంచి బైక్‌పై ఒంగోలు వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో వెంకటరావుకు బలమైన గాయాలు కావటంతో చికిత్స కోసం ఒంగోలులోని ప్రయివేట్ వైద్యశాల కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ సాంబశివరావు తెలిపారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో వాసవీమాత

మార్కాపురం వన్‌టౌన్, మే 17: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయంలో వాసవీ మాత జయంత్యూత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి మూల విరాట్‌కు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. క్షీరాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. గణపతి లలిత సహస్ర నామ హోమం వాసవీ మహిళా మండలి సభ్యులతో వాసవీ పారాయణం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కార్యదర్శి సూరె వెంకట సుబ్బారావు, కోశాధికారి రామడుగు వెంకట రమేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


భజనలు చేస్తున్న మహిళలు

పట్టణ ఓటర్ల మొగ్గు ఎటువైపు?

- అసెంబ్లీ ఎన్నికల్లో ఆది నుంచి టీడీపీదే పైచేయి
- సంప్రదాయం కొనసాగుతుందా..!
- పట్టణంపైనే జోరుగా బెట్టింగులు

మార్కాపురం, మే 17: సార్వత్రిక ఎన్నికలు ముగిసి నాలుగు రోజులవుతోంది. ఫలితాలు తేలాలంటే జూన్ 4వ తేదీ వరకు ఆగాల్సిందే. ప్రస్తుతం నియోజకవర్గ ప్రజలు గెలుపోటములపై ఉత్కంఠతో ఉన్నారు. మరీ ముఖ్యంగా నాయకులు, కార్యకర్తలు లెక్కల్లో మునిగి తేలిపోయారు. ఏ మండలంలో ఏ పార్టీకి పట్టుంది, ఎవరికెంత మెజార్టీ వస్తుంది తదితర అంశాలపై జోరుగా చర్చ నడుస్తోంది. నియోజకవర్గంలో ప్రధానంగా చెరో రెండు మండలాల్లో ప్రధాన పార్టీలు ఆధిపత్యం చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మార్కాపురం పట్టణంలో వచ్చే మెజార్టీనే ఎవరి గెలుపుకైనా కీలకంగా మారుతుందనేది విశ్లేషకుల అంచనా.

టీడీపీకి కంచుకోటలా పట్టణం

గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పుర ప్రజలు టీడీపీకే జై కొట్టారు. గతంలో ముక్కోణపు పోటీలు జరిగినప్పుడు కూడా ఇక్కడి ప్రజలు టీడీపీ పక్షానే నిలిచారు. టీడీపీ ఆవిర్భావం నుంచి జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఇతర పార్టీలు ఇక్కడ ఆధిపత్యం చూపిన దాఖలాలులేవు. 1994లో టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా టీడీపీ మద్ధతుతో పోటీలో నిలిచిన జంకె వెంటకరెడ్డికి ఇక్కడ మెజార్టీ వచ్చింది. అంతకు మినహా అన్ని ఎన్నికల్లోనూ పట్టణంలో టీడీపీదే హవా నడిచింది. 1999లో ఇక్కడ కేపీ కొండారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచినా పట్టణంలో మాత్రం టీడీపీనే మెజార్టీ సాధించింది. 2004లో రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచింది. అవే ఎన్నికల్లో ఇక్కడ టికెట్ దక్కక టీడీపీ రెబల్‌గా జంకె వెంకటరెడ్డి పోటీ చేశారు. అయినా అప్పుడు టీడీపీ తరపున మొదటిసారి పోటీలోవున్న కందుల నారాయణరెడ్డిని పట్టణ ఓటర్లు ఆదరించారు. 2009 ఎన్నికల్లో ఒక్క పట్టణంలోనే సుమారు 10 వేల పైచిలుకు మెజార్టీ టీడీపీకి వచ్చింది. ఆ ఎన్నికల్లో పట్టణంలో వచ్చిన మెజార్టీతోనే కందుల నారాయణరెడ్డి మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెందినా పట్టణంలో మాత్రం 3,500 ఓట్ల మెజార్టీ వచ్చింది. 2019లో జరిగిన ఎన్నికల్లో జగన్ ప్రభంజనం వీచినా మార్కాపురం పట్టణ కంచుకోట మాత్రం చెక్కుచెదరలేదు. చివరికి టీడీపీని వీడి జనసేన తరపున ఇమ్మడి కాశీనాథ్ పోటీచేసి ఓట్లు చీల్చినా టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డికి పట్టణంలో 1,450 ఓట్లపైనే మెజార్టీ వచ్చింది. ఇప్పుడు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన అన్నా రాంబాబు వైసీపీ తరపున బరిలో నిలవడంతో తొలిసారి పట్టణంలో మెజార్టీ సాధిస్తామని ఆ పార్టీ వర్గాలు ధీమాగా ఉన్నాయి. పట్టణంలో ఆర్య వైశ్య సామాజికవర్గం మొదటినుంచి టీడీపీకి మద్దతుగా నిలిచింది. విపత్కర పరిస్థితుల్లో కూడా పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారు. మరి ఈసారి కూడా ఆ సామాజిక వర్గం మద్ధతు పూర్తిస్థాయిలో ఉంటే పట్టణంలో మెజార్టీ సాధించడం నల్లేరుపైన నడకే.

జోరుగా సాగుతున్న పందేలు

ఎన్నికల ఫలితాలపై పందెం రాయుళ్లు జోరుగా బెట్టింగులు పెడుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపైకంటే పట్టణంలో ఏ పార్టీకి మెజార్టీ వస్తుంది అనే దానిపైనే ఎక్కువ మొత్తంలో పందేలు కాస్తున్నట్లు సమాచారం. మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని 24వ బూత్ నంబరు నుంచి 81 వరకు పట్టణ బూత్‌లుగా పరిగణిస్తారు. కొందరైతే ఆర్యవైశ్య సామాజికవర్గ ఓటర్లు అధికంగా బూత్‌లపై కూడా బెట్టింగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీకి చెందిన ఓ నాయకుడు పట్టణ మెజార్టీపై భారీ మొత్తంలో పందెం కాసినట్లు విశ్వసనీయ సమాచారం. గెలుపోటములు ఎలావున్నా ప్రస్తుత ఎన్నికలు పట్టణంలో వచ్చే మెజార్టీ చుట్టే తిరుగుతుండటం గమనార్హం.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కోటయ్య

పొదిలి, మే 17 : కౌంటింగ్ సమయంలో మండలంలో శాంతిభద్రతలకు అఘాతం కలిగిస్తే ఎవరిని సహించేది లేదని ఎస్ఐ కోటయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు, ఏలూరు, సల్లూరు గ్రామాల్లో పర్యటించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న గొడవలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో పలు గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తగా అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో కౌంటింగ్ రోజు ఎలాంటి హింసాత్మక ఘటనలు, గొడవలు జరగకుండా శాంతియుతంగా ఉండాలన్నారు. కౌంటింగ్ రోజున ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని గ్రామాల్లో ముందస్తుగా అక్కడ ఉన్న పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. కౌంటింగ్ తరువాత గ్రామాల్లో ఎమైనా అవాంఛనీయ ఘటనలు జరిగే ప్రమాదం ఉందా అనే కోణంలో పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఏదైనా సమస్య తలెత్తే అవకాశం ఉంటుందనే సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కనుక గ్రామాల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా ఉండాలని లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ సమయంలో గ్రామాల్లో గుంపులుగా ఏర్పడి ఇబ్బందులు సృష్టించవద్దన్నారు.

ఘర్షణలు వద్దు- ప్రశాంతతే ముద్దు

కొమరోలు, మే 17 : గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించిన గొడవలు జరిగితే నాన్ బెయిల్ కేసులు నమోదు చేస్తామని గిద్దలూరు సీఐ దాసరి ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక కొమరోలు పోలీసుస్టేషన్‌లో సీఐ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాదు మాట్లాడుతూ గ్రామాల్లో తాగి గొడవలు పడుతూ రాజకీయ రంగు పులుముతున్నారన్నారు. అటువంటి వారిపై పోలీసు శాఖ తీవ్రమైన చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో ఎవరైనా గొడవలు రెచ్చగొడితే ఉపేక్షించేది లేదన్నారు. గ్రామాల్లో ప్రశాంతతకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై మదుసుధన్‌రావు, టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత

పొదిలి, మే 17 : రైల్లో పోగొట్టుకున్న బ్యాగును భద్రపరిచి యజమానికి అందజేసి రైల్వేపోలీసులు తమ నిజాయితీని చాటుకున్నారు. పొదిలికి చెందిన కారంశెట్టి హరికృష్ణ అనే వ్యాపారి ఈనెల 14న ఉజ్జయిని వెళ్లాడు. ఈ క్రమంలో తిరుగు ప్రయణంలో బంగారు వస్తువులు, మరికొన్ని విలువైన వస్తువులతో కూడిన బ్యాగును రైల్లో తాను కూర్చున్న సీటు కింద పెట్టి మర్చిపోయి రైలు దిగాడు. ఇంటికి వచ్చేంత వరకు బ్యాగును గమనించని హరికృష్ణ ఇంటికి వచ్చిచూశాడు. బ్యాగు పోగొట్టుకున్నాని గమనించి రైల్వే పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు తమిళనాడులోని కాట్‌పాడి వద్ద రైల్లో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకొని భద్రపరిచారు. బాధితుడికి విషయం తెలియజేయడంతో కాట్‌పాడి వెళ్లి సంబంధిచిన ఆధారాలు చూపించడంతో పోలీసులు హరికృష్ణకు బ్యాగును అందజేశారు. రైల్వేపోలీసుల నిజాయితీకి హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

త్రిపురాంతకం, మే 17: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గణపవరం ఎస్సీ కాలనీలో శుక్రవారం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన మాచర్ల కొండలు (35) ఐస్ క్రీం బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి నిద్రపోయో ముందు తన ఐస్ క్రీం బండికి కూలింగ్ కోసం ఎప్పటి లాగే విద్యుత్ సరఫరా ఇచ్చాడు. శుక్రవారం ఉదయం బేరానికి వెళ్లే ముందు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రయత్నం చేస్తుండగా షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

బాలికపై అత్యాచారం

- కేసు నమోదు, పరారీలో యువకుడు

పెద్దదోర్నాల, మే 17: బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన యువకుడిపై పోలీసులు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై గ్రామానికి చెందిన ఎలకపాటి ప్రవీణ్ శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్సై అంకమరావు గ్రామానికి వెళ్లి విచారించగా యువకుడు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ప్రవీణ్‌పై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశారు. బాలికను మార్కాపురం ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పొగాకు వేలం కేంద్రం పరిశీలన


వేలాన్ని పరిశీలిస్తున్న ఆక్షన్ మేనేజర్, ఆర్ఎం

టంగుటూరు, మే 17 : టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం బోర్డు ఆక్షన్ మేనేజర్, ఇన్‌చార్జి కార్యదర్శి వేణుగోపాల్ సందర్శించారు. తొలుత వీరు వేలం సరళిని, వివిధ పొగాకు గ్రేడ్లకు వచ్చిన ధరలను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. వేలానికి అన్ని రకాల పొగాకు గ్రేడ్లు తెచ్చుకోవాలని, బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. ఆయన వెంట ఆర్ఎం లక్ష్మణరావు ఉన్నారు. కాగా శుక్రవారం జరిగిన వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.304 దక్కింది. వేలం కేంద్రానికి తూ మాడు, జమ్ములపాలెం రైతుల 1,005 బేళ్లను అనుమతించారు. ఇందులో 974 బేళ్ల కొనుగోలు కాగా, మిగిలిన తిరస్కరణకు గురయ్యాయి. కొనుగోళ్లలో 17 వ్యాపార కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు. గరిష్ఠ ధర రూ.304 కాగా, కనిష్ఠ ధర రూ.205 రైతులకు లభించింది.

ఉన్నత విద్యతోనే మహిళల అభివృద్ధి

ఆర్‌డీటీ ఏటీఎల్ వేమయ్య


అవగాహన కల్పిస్తున్న ఆర్‌డీటీ సంస్థ ప్రతినిధులు

పెద్దదోర్నాల, మే 17: ఉన్నత విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని ఆర్‌డీటీ సంస్థ ఏరియా టీమ్ లీడర్ వేమయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఆడిటోరియంలో ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో స్త్రీల హింసా నిరోధక చట్టాలపై చెంచు గిరిజనులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఏటీఎల్ వేమయ్య మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో మహిళలు పోటీ పడుతున్న ఈ కాలంలోనూ ఇంకా మహిళలపై అత్యాచారాలు, అత్తింటి ఆరిళ్లు తప్పడం లేదన్నారు. స్త్రీ పురుష వివక్ష సమాజం స్త్రీలను తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తోందన్నారు. ప్రధానంగా నిరుపేదలైన గిరిజనులు చదువుకు దూరం కావడంతో అనేక హింసలు పడాల్సి వస్తోందన్నారు. చెంచు గిరిజనులు తమ పిల్లలను చదివేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందించే సహకారంతో ఉన్నత విద్యనభ్యసించాలని సూచించారు. గృహ హింస, ర్యాగింగ్ వంటి దుర్మార్గాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు రాజ్యాంగం రూపొందించిన పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ స్త్రీలపై జరిగే అకృత్యాలను, అడ్డుకునేందుకు తీసుకోవాలసిన చర్యలపై ఉద్వేగభరిత గీతాలను ఆలపిస్తూ చైతన్యపరిచారు.

కాలువ పూడిక తీసేదెన్నడో...!

చెత్తాచెదారంతో నిండిన సగిలేరు సప్లయ్ చానల్


చెత్తాచెదారంతో నిండిన సగిలేరు సప్లైకాలువ

గిద్దలూరు, మే 17 : చెరువులకు సాగునీటిని అందించే పంట కాలువ మురికి కాలువ కంటే అధ్వానంగా తయారైంది. దీంతో వర్షం నీరంతా చెరువులకు చేరకుండా వాగుల ద్వారా వృథాగా పోతోంది. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షం ద్వారా సగిలేరు నదికి నీరు చేరుతోంది. ఈ సగిలేరు నుంచి వర్షం నీటిని రాచర్ల మండలంలోని ఐదు గ్రామాల పరిధిలోని చెరువులకు నీరు అందించేందుకు వీలుగా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సగిలేరు సప్లై ఛానల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సప్లైఛానల్ కాలువ సగిలేరునది నుంచి గిద్దలూరు పట్టణం మీదుగా రాచర్ల మండలంలోని చెరువుల వరకు నిర్మించారు. అయితే పట్టణం నుంచి వెళ్లే ఈ సప్లై ఛానల్ కాలువపై పైకప్పు లేకపోవడంతో ప్రజలు చెత్తాచెదారాన్ని వేస్తున్నారు. కొందరు తమ ఇళ్లలోని మురికి నీటిని కూడా ఈ సప్లై ఛానల్‌లోకే వదులుతున్నారు. దీంతో పందులు, కుక్కలకు ఆవాస కేంద్రంగా మారింది. పట్టణ పరిధిలో కాలువంతా పూడిపోయింది. వర్షం నీరు ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ కాలువలో పూర్తిస్థాయిలో పూడిక తీసి పై కప్పు నిర్మించాలని ఏళ్ల తరబడి రైతులు కోరుతున్నప్పటికీ ఈ విజ్ఞప్తులు ప్రజాప్రతినిధుల, అధికారుల చెవికి ఎక్కడం లేదు. దాంతో వర్షం నీరు వృథాగా పోతుండగా ఆయకట్టు రైతులు మాత్రం వర్షాధారంపై ఆధారపడి పంటలు వేసుకోవలసిన దుస్థితిలో ఉన్నారు.

తర్లుపాడులో దాహం కేకలు

- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు


నీటిని పట్టుకుంటున్న మహిళలు, నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

తర్లుపాడు, మే 17: మండల కేంద్రమైన తర్లుపాడులో రెండు నెలల నుంచి మంచినీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి మొత్తం ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా గతంలో సరఫరా చేసేవారు. రెండు నెలల క్రితం ఓవర్ హెడ్ ట్యాంకుకు నీరు ఎక్కించే డీప్ బోర్లు వట్టిపోయాయి. దీంతో ప్రజలు నీటికి నానా ఇబ్బందులకు గురవుతున్నారు. తర్లుపాడు గ్రామానికి 90 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. ఈ ట్యాంకు ద్వారా ఉదయం, సాయంత్రం ప్రజలకు నీటి సరఫరా చేస్తారు. ప్రస్తుతం బోర్లు వట్టిపోవడంతో ప్రజలు మంచి నీటికి అల్లాడుతున్నప్పటికీ విషయం తెలిసిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. తర్లుపాడులో నీటి ఎద్దడిని నివారించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే కేవలం ఆరు ట్రిప్పులు మాత్రమే మంచి నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. దీంతో ప్రజలు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండడంతో ఎన్నికలకు ముందు ఇరుపార్టీల నాయకులు ప్రజలకు పోటాపోటీగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. ప్రస్తుతం ఎన్నికలు ముగియడంతో రాజకీయ పార్టీల నాయకులు నీరు తోలడం తగ్గించారు. దీంతో కొన్ని వీధుల్లో ప్రజలు మరింత ఇక్కట్లకు గురవుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాత్రం తర్లుపాడు వైపు కన్నెత్తి చూడడం లేదు. అధికారులు మాత్రం ఆరు ట్రిప్పుల నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పినప్పటికీ అవి ఎక్కడ సరఫరా చేస్తున్నారో వారికి తెలియకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి ఇక్కట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సరఫరా చేయలేం

తర్లుపాడుకు ప్రస్తు తం నీటి సరఫరా ట్యాంకర్ల ద్వారా చేయలేము. గ్రామానికి 6 ట్రిప్పులు మాత్రమే మంజూరయ్యాయి. ఆ మేరకు నీటిని అదిస్తాం. అదనంగా ట్యాంకర్ల కోసం ఉన్నతాధి కారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు

పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్షాకేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ అంజిరెడ్డి

ఒంగోలు(విద్య), మే 17: రాష్ట్రంలో ఉన్న ఇంజనీ రింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో నూతనంగా వి ద్యార్థులు చేరేందుకు ప్ర భుత్వం నిర్వహిస్తున్న ఈ ఏపీసెట్ ఎంట్రెన్స్ పరీక్ష లను ఆంధ్రకేసరి విశ్వవి ద్యాలయం వైస్ చాన్స్‌లర్ మారెడ్డి అంజిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. వల్లూరు సమీపంలోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎంట్రెన్స్ పరీక్షా కేంద్రాలతో పాటు ఒంగోలు నగరంలోని నేషనల్‌కౌన్సిల్ చర్చ్ సోషల్ యాక్షన ఇన్ ఇండియా పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఎంట్రెన్స్ పరీక్షలను సజావుగా, సక్రమంగా నిర్వహించాలని ఆయా పరీక్షా కేంద్రాల నిర్వహకులకు ఆయన సూచించారు.

పల్లెలకు చేరని ప్రగతి రథచక్రాలు

నేటికీ ఆటోలే శరణ్యం


ఆటోలలో వెళుతున్న ప్రయాణికులు

త్రిపురాంతకం, మే 17: ఎటువంటి లాభాపేక్షా లేకుండా ప్రయాణికులను గమ్యస్థానం చేర్చేందుకు ఆర్టీసీ ప్రవేశపెట్టిన పల్లెవెలుగు బస్సులు జాతీయ రహదారులకే పరిమితం అయ్యాయి. దీంతో పేరుకే పల్లెవెలుగులుగా ఉన్నప్పటికీ పల్లెల ముఖం కూడా చూడట్లేదు. దీంతో పల్లె వెలుగుల లక్ష్యం గమ్యం చేరట్లేదు.

నియోజకవర్గ కేంద్రం ఎర్రగొండపాలెంకు వెళ్లే దారిలో ఉన్న గ్రామాలు, జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రామాలకు మినహా మిగిలిన ఏ గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడిచే పరిస్థితి లేదు. కేశినేనిపల్లి, హసానాపురం, నడిగడ్డ, సోమేపల్లి, విశ్వనాథపురం, లేళ్లపల్లి, దువ్వలి, కంకణాలపల్లి, మిరియంపల్లి, గాంధీనగర్, ఒడ్డుపాలెం, పాపన్నపాలెం, కొత్తముడివేముల, పాతముడివేముల, గణపవరం, ఎండూరివారిపాలెం, పాతఅన్నసముద్రం, కొత్తఅన్నసముద్రం, డీవీఎన్ కాలనీ, గుట్లపల్లి, వెంగాయపాలెం గ్రామాలతోపాటు అటవీ ప్రాంతంలోని తాండా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు దీంతో ఆటోలే శరణ్యమయ్యాయి.

మండలంలో ఒకప్పుడు ఏ మారుమూల ప్రాంతం చూసినా ఎర్రబస్సులు తలుక్కుమనేవి. తరువాత ఏటికేడు ఆర్టీసీ బస్సులు తిప్పడం మానేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఆటోలే దిక్కయ్యాయి. ఫలితంగా ఆటోవాలాలు ఆర్టీసీ కన్నా అధిక చార్జీలు వసూలు చేస్తుండటంతో ప్రయాణికుల జేబుకు చిల్లుపడుతోంది. దీనికి తోడు ఆటో నిండేవరకు గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో కిక్కిరిసేలా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తుండడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. వ్యయ ప్రయాసలకోర్చి ఆటో ఎక్కినా గమ్యం చేరుతామనే ధీమా లేదు. దీనికి తోడు మండలంలోని అన్ని గ్రామాల రోడ్లు అధ్వానంగా మారడంతో ఆటోలు ఉయ్యాల-జంపాల ఊగుతూ ప్రయాణిస్తుండడంతో సురక్షితంగా ఇంటికి చేరేంత వరకు నమ్మకంలేదు. ఇప్పటికైనా రానున్న కొత్త ప్రభుత్వంలో ఆర్టీసీ అధికారులు, పాలకులు ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పూర్వం రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

గ్రామానికి వెళ్లాలన్నా, రావాలన్నా కాలినడకనో, సైకిల్‌పైనో, ఆటోలోనో ప్రయాణించాల్సిందే. రహదారి కూడా అధ్వానంగా ఉంది. ఆటోవాలాలు మనిషికి రూ. 30 వసూలు చేస్తున్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

బాలు, టి.చెర్లోపల్లి

ఆటోలే దిక్కు

గ్రామానికి బస్సుసౌకర్యాన్ని కల్పించాలని అధికారులను చాలాసార్లు కోరాం. నేటికీ అధికారులు, పాలకులూ పట్టించుకోలేదు. ఎక్కడికి వెళ్లాలన్నా ఆటోలే దిక్కు. ఆటోవాలాలు చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తున్నారు.

వెంకటేశ్వర్లు, లేళ్లపల్లి

అవీ..ఇవీ..

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన


విశేష అలంకరణలో వీరబ్రహేంద్రస్వామి

పొదిలి, మే 17 : గోవింద మాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆధాధన మహోత్సవం పట్టణంలోని విరాట్ నగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన సందర్భంగా విరాట్‌నగర్‌లోని దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతి పూజ చేసి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా ఆరాధన మహోత్సవం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తర్లుపాడు, మే 17: తర్లుపాడులో వెలసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు అలుగు బాలబ్రహ్మం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ గోవిందాంబ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం వేదపండితులు సంజయ్య, వీరబ్రహ్మం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆరాధన మహోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గోవిందాంబ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద స్వామిని తర్లుపాడు పురవీధుల్లో మేళతాళాలతో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వార్లకు వార్లుపోసి కాయకర్పూరాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త గంగాపురం వీరబ్రహ్మం కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పెద్ద దోర్నాల :మండలంలోని వీర బ్రహ్మేంద్రస్వామి దేవాలయాల్లో శుక్రవారం ఆరాధనోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధానంగా దోర్నాల, తిమ్మాపురం, పెద్ద బొమ్మలాపురం, కడపరాజుపల్లె గ్రామాల్లో ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు.

కాచిగూడ రైలు పునరుద్ధరణ

గిద్దలూరు, మే 17 : రైల్వే డబ్లింగ్ పనుల కారణంగా ఈనెలాఖరు వరకు రద్దు చేయబడిన కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలును వెంటనే పునరుద్ధరిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. గుంటూరు-గిద్దలూరు-కాచీగూడ (17251) రైలు ఈనెలాఖరు వరకు రద్దు చేయగా, ఈ రైలును ఈనెల 18వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు స్థానిక రైల్వే కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అలాగే కాచీగూడ-గిద్దలూరు-గుంటూరు (17252) ఎక్స్‌ప్రెస్ రైలు జూన్ 1వ తేదీ వరకు రద్దుచేయగా ఈరైలును ఈనెల 19 నుంచే పునరుద్ధరించారని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామాల్లో కొత్త పనులపై దృష్టి

- డ్వామా పీడీ అర్జున్‌రావు



మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

మార్కాపురం రూరల్, మే 17: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో న్యూ స్ట్రాటజీ పనులపై దృష్టి సారించాలని డ్వామా పీడీ అర్జునరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపయోగపడే విధంగా ఫారం పాండ్‌లు, మొక్కల పెంపకం తదితర పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. గ్రామాలలో ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు కచ్చితంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని సగటు వేతనం అందేలా పనులు చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ, కచ్చితంగా పనిదినాలు కల్పించాలని అన్నారు. సమావేశంలో ఏపీడీ నిర్మలాదేవి, ఎంపీడీవో తోట చందన, ఏపీవో జీవరత్నం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

- బొప్పాయి, అరటితోటలకు జీవం

ఎర్రగొండపాలెం, మే 17 : మండలంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక మోస్తరు వర్షం కురిసింది. ఎర్రగొండపాలెం మండల కేంద్రంలో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు ప్రవహించింది. దీంతో మండలంలోని గ్రామాల్లో సాగులో ఉన్న బొప్పాయి, అరటి తోటలకు గురువారం రాత్రి కురిసిన వర్షం జీవం పోసింది. శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో వర్షం కురుస్తుందేమోనని రైతులు ఆశగ ఎదురు చూసిన వర్షం కురవలేదని నిరాశ చెందారు. కొద్దిగ పెద్ద వర్షం కురిస్తే కాలువల్లోకి, కుంటలలోకి వర్షం నీరు చేరితే పొలం వెళ్ళే పశువులకు, మేకలకు, గొర్రైలకు తాగు నీరు అన్న దొరుకుందని మండలంలో రైతులు, పశువుల యజమానులు ఆశగా ఎదురుచూశారు. రైతులకు నిరాశే మిగిలింది. మండలంలో నైరుతిరుతుపవనాలు రాక ముందే అల్పపీడన ద్రోణితో ఒకమోస్తరు వర్షం కురవడంతో మండల ప్రజలు ఉపశమనం చెందారు.వర్షంతో గరిష్ఠ ఉష్ణోగ్రత 31 డిగ్రీలు, కనిష్ఠ డిగ్రీలు నమోదు అయ్యింది. దీనితో వాతావరణం ఉదయం నుంచి చల్లబడింది.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు

త్రిపురాంతకం, మే 17: మండల కేంద్రంలోని కోదండ రామాలయ వార్షికోత్స సందర్భంగా హోమాలను, స్వామి అమ్మవార్ల శాంతి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని విశ్వక్షేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్నిద్యానము, మూల మంత్ర హోములు, పంచామృత, పంచరస, పంచసుగంధ ద్రవ్య సపేన, కుంబషేక, కుంబాభిషేకము, అలంకరణలు తీర్థ ప్రసాద వినియోగములు నిర్వహించారు. కోదండ రామస్వామి, సీతా అమ్మవార్ల శాంతి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు మహిళా భక్తులు, దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


హోమాల్లో పాల్గొన్న భక్తులు

మున్సిపాలిటీ స్థల ఆక్రమణలపై చర్యలు



మున్సిపాలిటీ స్థలంలో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

కనిగిరి, మే 17: మున్సిపాలిటీ స్థలాలను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ రోడ్డులో రూ.కోటి రూపాయల విలువైన మున్సిపాల్టీ స్థలాన్ని ఆక్రమించి కొంతమంది వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఆంధ్రజ్యోతి మినీలో శుక్రవారం అధికారుల ఆదేశాలు బేఖాతర్ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ కమిషనర్ స్పందించి ఆక్రమణలను తొలగించారు. మున్సిపాల్టీకి చెందిన వాగు, వంక, పోరంబోకు, తదితర స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే అలాంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే, మున్సిపాల్టీ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో దృష్టి సారించి వాటిని సంరక్షిస్తామన్నారు. కనిగిరి మున్సిపాల్టీ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా సంబంధిత సచివాలయంలో వ్రాతపూర్వకంగా నమోదు చేయించాలని కోరారు. దీంతో ఆయా సిబ్బంది నిర్ణీత సమయంలో ఆయా సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

పటిష్ఠ భద్రతలో ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు

దర్శి, మే 17: దర్శి అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్ ఈవీఎంలను ఒంగోలులోని రైస్ కళాశాలలో భద్రపరిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు తెలిపారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో శుక్రవారం రాజకీయ నాయకుల ప్రతినిధులు, చీఫ్ ఏజెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్‌లను స్థానిక ఆర్వో కార్యాలయంలో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి సీల్ వేసినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ఠమైన బందోబస్తుతోపాటు సీసీ కెమెరాల నిఘాలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలకు ఏవైనా అనుమానాలు ఉంటే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించుకోవచ్చునన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ రాజకీయపార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ వసుంధరాదేవి

తాళ్లూరు, మే 17: పొదుపు మహిళలు తీసుకున్న స్త్రీనిధి, సీఐఎఫ్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో రికవరీ జరిగేలా చూడాలని వైకేపీ ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. పొదుపు మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తూ ఆర్థికంగా వృద్ధి చెందాలపాకపనేజ మహిళల అభ్యున్నతి కోసం పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ పవన్‌కల్యాణ్, ఏపీఎం దేవరాజ్, సీసీలు కోటేశ్వరరావు, సుచంద్రరావు, అకౌంట్ కుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుభాషిణి, కోశాధికారి విజయలక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పీసీపల్లి, మే 17: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. నాడు చదివిన విద్యార్థులందరూ వారివారి యోగక్షేమాల గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వివిధ రంగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ రెండున్నర దశాబ్దాల తరువాత ఒకచోట కలుసుకోవడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. పూర్వ విద్యార్థులంతా కలిసి తమ గుర్తుగా పాఠశాలకు బీరువాలు, లాకర్లను బహూకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎక్కడున్నా మా అభివృద్ధికి పునాది వేసిన పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తమవంతు సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం నాటి గురువులను సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు మాలకొండారెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంఈవీ ఆర్.శ్రీనివాసులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఖరీఫ్ సాగుకు ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు విడుదల చేయాలి
- రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రసాద్ డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), మే 17: గత ఏడాది వచ్చిన కరువు, మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీప్రసాద్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఖరీఫ్‌లో రైతులకు జరిగిన నష్టాన్ని ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం దారుణంగా ఉందన్నారు. జగన్ ప్రభుత్వం అయితే ఏకంగా ఎన్నికల రెండు రోజుల ముందు రైతుల అకౌంట్లోకి డబ్బులు విడుదల చేసి రాజకీయంగా లబ్ధి పొందాలని చూసిందని, అయితే దీనిని గుర్తించిన ఎన్నికల కమిషన్ ఎన్నికల అయిన వెంటనే విడుదల చేయాలని సూచించిందని అయన పేర్కొన్నారు. ఎన్నికల జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా ఇంతవరకు రైతుల అకౌంట్లోకి నగదు జమ చేయలేదని విమర్శించారు.

గతంలో రాయలసీమ జిల్లాలకు చెందిన 58వేల మంది రైతులు 3.68 లక్షల హెక్టార్లలో సాగు చేసిన పంటలు నష్టపోయారన్నారు. మిచౌంగ్ తుఫాన్‌తో 6.95 లక్షల మంది రైతులు 5.68 లక్షల హెక్టార్లలో సాగు చేసిన పంటను కోల్పోయినా ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోవడం దారుణంగా ఉందని చెప్పారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ అందుకు విరుద్ధంగా పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు దత్తత ఇచ్చే దిశగా మూడు నల్లచట్టాలను తెచ్చిందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 1.50లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించిన పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, పావులూరి అంజయ్య, పోలవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పాలి

- రాజకీయ పార్టీల నేతలు పోలీసులకు సహకరించాలి
- డీఎస్పీ రామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామరాజు

కనిగిరి, మే 17: కనిగిరి ప్రాంతంలో స్నేహపూర్వక వాతావరణ నెలకొల్పేవిధంగా రాజకీయ పార్టీల నేతలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ రామరాజు అన్నారు. రాష్ట్రంలో అక్కడక్కడా జరుగుతున్న హింసాత్మక ఘటనల దృష్ట్యా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయ పార్టీలకు చెందిన నేతలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల అనంతరం పలుచోట్ల రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, నాయకులు, కార్యకర్తలపై దాడులు, అల్లర్లు జరుగుతున్నాయన్నారు. కనిగిరి ప్రాంతంలో ప్రధానపార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసుశాఖకు ఎంతో సహకరించటం అభినందనీయమన్నారు. అదేస్ఫూర్తితో ఇకముందు కూడా నడుచుకుని ఇరుపార్టీల నేతలు స్నేహభావంగా మెలగాలని కోరారు. జూన్4న జరిగే కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీజీపీ, ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం కట్టుదిట్ట చర్యలు అమలుచేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడా ఐదుగురికి మించి గుమిగూడవద్దన్నారు. వివాదాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసే వారిని అదుపులోకి తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు, అభ్యర్థుల మెజార్టీలపై బెట్టింగులకు పాల్పడితే వారిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. కనిగిరి ప్రాంతంలో కొత్త వ్యక్తులు సంచరిస్తునట్లయితే సమాచారం పోలీసులకు చేరవేయాలని కోరారు. సమావేశంలో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ త్యాగరాజు, వివిధ రాజకీయపార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రాళ్ల కుప్పలు

- రోడ్డుపక్కన డంపింగ్
- చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి



అవులమంద రోడ్డులో రోడ్డుపక్కన పడవేసిన రాళ్ల కుప్పలు

కురిచేడు, మే 17: కురిచేడు - అవులమంద రోడ్డులో రోడ్డు పక్కగా పెద్దపెద్ద రాళ్ళ కుప్పలను గుర్తు తెలియని వ్యక్తులు లారీలలో తీసుకువచ్చి పడవేశారు. ఆరోడ్డులో రోడ్డు మీద కూడా రాళ్ళు పడి ఉన్నాయి. ఆ రాళ్ళు ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. మండలంలో ఎక్కడో వైట్ క్వాట్జ్ రాయి తీస్తూ వృథా రాళ్ళను టిప్పర్లలో తీసుకువచ్చి అవులమంద రోడ్డులో పడవేస్తున్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. రాత్రి సమయాలలో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో రోడ్డు మార్జిన్ దిగితే రాళ్ళ కుప్పలపై పడే ప్రమాదం ఉంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఆ రోడ్డులో మూడు కిలో మీటర్ల మేర రోడ్డుపై వైట్ క్వాట్జ్ రాళ్ళు పెద్దవి, చిన్నవి పడి ఉన్నాయి. టిప్పర్ ప్రయాణ సమయంలో పైనుంచి జారీ పడి ఉంటాయి. ఇవి మరీ ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ టిప్పర్లు రాత్రి సమయాలలో రాళ్ళను తీసుకువచ్చి రోడ్డు పక్కన పడవేసిన ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. పోలీసులు ఈ టిప్పర్‌లను ఆపకపోతే, వీటివల్ల ఆమార్గంలో ప్రయాణించే వారికి ప్రాణాపాయం తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- భయంభయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



వరండాలో పెచ్చులూడిపోయి బయటపడిన ఇనుప సువ్వలు

పీసీపల్లి, మే 17: పీసీపల్లి తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. కిటికీలు, తలుపులకు చెదలు పట్టి ఊడిపోయాయి. స్లాబ్ పెచ్చులు ఊడి సువ్వలు బయటపడ్డాయి. దీంతో ఈ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు భయంభయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బంది విధులు నిర్వహించే గది, వరండాలోని దూలాలకు ఉన్న స్లాబ్ పెచ్చులూడి కిందపడిపోతోంది. సమావేశపు హాలుకు ఉన్న కిటికీలు చెదలుపట్టి ఊడిపోయాయి. ఉద్యోగులతో పాటు వివిధ పనులకోసం ప్రజలు కార్యాలయానికి వస్తుంటారు.

వర్షాలు పడుతున్న సమయంలో ఎక్కువగా పెచ్చులూడి పడితే ఉద్యోగులతో పాటు ప్రజలు గాయపడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల అన్నదానం



కురిచేడులోని ఆలయంలో ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి, పూజలుచేస్తున్న భక్తులు



పామూరులో పూజలు చేస్తున్న భక్తులు



కనిగిరిలో విశేష అలకరణలతో భక్తులకు దర్శనమిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి

పామూరు, మే 17: పామూరు మేజర్ పంచాయతి పరిధిలోని విరాట్ నగర్ కాలనీలో వెలసియున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో 331వ ఆరాధన వేడుకలను శుక్రవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానంలో సుప్రభాతం, అభిషేకాలు, అష్టోత్తరం, ద్వారపూజ, మహానివేదన, పూజలు నిర్వహించి స్వామి వార్లకు నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, బాణసంచాలతో గ్రామోత్సవం నిర్వహించారు.ఈకార్యక్రమాల్లో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నొస్సం నాగేంద్రచారి, విరాట్‌నగర్ దేవస్థాన గౌరవాధ్యక్షుడు వినుకొండ రామాచారి, అధ్యక్షుడు ఎం.దొరసానయ్యచారి, ఉపాధ్యక్షుడు పునుగుపాటి చారి, కార్యద ర్శులు శానంపూడి చంద్రశేఖర్, వెగ్గళం మల్లికార్జున, ఉప్పలపాటి ప్రభా కరరావు, ఎన్.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కాగా పట్టణంలోని సమాధి సిద్ధినొందిన శ్రీచిలక సుబ్బయ్య అవధూత మఠంలో ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా అంకురారోహణ, అరాధన ఉత్సవం, పూర్ణాహుతి, మహనివేదన పూజా కార్య క్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. భక్తులకు అన్నదాన కా ర్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మఠం ధర్మకర్త పీవీ నారాయణచారి, భక్తులు పా ల్గొన్నారు.

కనిగిరిలో.. కనిగిరి, మే 17: కాలజ్ఞాన తత్వవేత్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధనోత్సవాలు స్థానిక దొంతులమ్మ దేవాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆరాధనోత్సవం సందర్భంగా స్వామి వారికి అర్చనలు, విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. దొంతులమ్మ ఆలయంలో ఆలయ కమిటీ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కనిగిరి పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయకమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు తంగుటూరి గోవిందరావు, అధ్యక్షుడు డాక్టర్ అర్.రామయ్యనాయుడు, ప్రధానకార్యదర్శి ముండ్లమూరి మాలకొండయ్య, సుబ్బారావు, వాకమల్ల కిశోర్, పి.నారాయణ, బ్రహ్మయ్య, తిరుపతిరెడ్డి, సుబ్బారావు, కదిరిప్రసాద్‌లు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కురిచేడులో.. కురిచేడు, మే 17: కురిచేడులో వెలసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్వామి వారికి ఉదయాన్నే పంచామృత అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, మే 17: మండల కేంద్రమైన ముండ్లమూరుతో పాటు పెదఉల్లగల్లు, మారెళ్ళ, ఈదర, పోలవరం, సింగనపాలెం, శంకరాపురం గ్రామాల్లో వేంచేసి ఉన్న బ్రహ్మంగారి దేవాలయాల్లో శుక్రవారం ఆరాధన మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు దేవతామూర్తులైన బ్రహ్మంగారు, గోవిందమ్మ, ఈశ్వరమ్మ, పోతులూరయ్యలను భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లమూరు, పెదఉల్లగల్లులో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు.

బ్రహ్మంగారి ఆరాధన రోజు ఆలయాల వద్ద జాగారం చేస్తే పుణ్యం దక్కుతుందని ఆలయాల్లోనే జాగారం చేశారు. దేవాలయాలను విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు. సాయంత్రం పూట ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. మొక్కుబడి ఉన్న భక్తులు ఆలయాల ముందు పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు.

పశువుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పశువుల షెడ్‌ను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి

తాళ్లూరు, మే 17: పశువుల షెడ్‌ల వద్ద ఉండే వ్యర్థపదార్థాలతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి అన్నారు. పశుపోషకులు పశువుల షెడ్‌ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం పశువుల షెడ్లను శుక్రవారం పరిశీలించారు. గ్రామాల్లో పశువుల షెడ్ల నుచి వచ్చే వ్యర్థపదార్థాలతో డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని వైద్యశాఖ సిబ్బంది ఆశాఖ అధికారులకు విన్నవించారు. దీంతో పశుసంవర్థకశాఖ అధికారులు శివరాంపురంలో పశువుల షెడ్‌లను పరిశీలించి పశుపోషకులకు అవగాహన కల్పించారు.

ఈసందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ పశుపోషకులు కూడా తమ షెడ్‌ల వద్ద అపరిశుభ్రం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగునీరు ప్రవహించే ప్రాంతాల్లో బ్లీచింగ్, ఫినాయిల్ పిచికారి చేయించి దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ కాలేషావలి, ఉపసంచాలకులు రమేష్‌బాబు, సహసంచాలకులు పురుషోత్తమరావు, పశువైద్యాధికారులు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, రాంబాబు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా వెంకట్రావు

ఒంగోలు(విద్య), మే 17 : ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనునకున్నారు. శుక్రవారం ఒంగోలులోని వీఐపీరోడ్డులోని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం భవనంలో కేవీజీ.కీర్తి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా నూతన గౌరవాధ్యక్షులుగా ఎ.అమ్మయ్య, అధ్యక్షుడిగా బి.వెంకట్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.అశోక్‌కుమార్, సహాధ్యక్షులుగా ఎన్.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా పీవీ ప్రభాకరావు, కె.వెంకటేశ్వర్లు, ఎం.విశ్వభారతి, టి.పాండురంగస్వామి, కార్యదర్శులుగా బి.నాగార్జున, విక్రమ్, జి.పాండు, ఎస్.శ్రీదేవి, కె.పెద్దన్న, ఎం.సురేష్‌బాబు, ఎ.గురులింగం, టి.వెంకటేశ్వర్లు, అదనపు కార్యదర్శిగా ఎస్‌హెచ్.కబీర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.అంజనేయులు, అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా చలపతి, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.వెంకటరావు, బి.అశోక్‌కుమార్, పీవీ.సుబ్బారావు, వై.శ్రీనివాసులు, కేవీజీ.కీర్తిలు ఎన్నికయ్యారు.

నేటి నుంచి కోదండరామస్వామి తిరునాళ్ల



కోదండరామస్వామి మూలవిరాట్ విగ్రహాలు

సీఎస్‌పురం(పామూరు), మే 17: సీఎస్‌పురం మండలంలోని రామాపురం గ్రామంలో శ్రీ కోదండరామస్వామి తిరునాళ్ల వేడుకలు శనివారం నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు సీతారాముల శాంతి కల్యాణోత్సవం, ఆదివారం వనభోజనాల కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఐదు జిల్లాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు, మంగళవారం గ్రామ దేవత పోలేరమ్మ పాలపొంగళ్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జానపద కళలను ప్రోత్సహించాలి



కోలాటం కళాకారులను అభినందిస్తున్న సీఐ రామానాయక్

పామూరు, మే 17: అంతరించిపోతున్న జానపద కళలను ప్రజలు ఆదరించి కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సీఐ ఎం.రామానాయక్ అన్నారు. మండలంలోని బొట్లగూడూరులో నెలరోజులపాటు కోలాటం నేర్చుకొన్న చిన్నారులు తమ కోలాట ప్రదర్శనను శుక్రవారం ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ చిన్నారులను, శిక్షణ ఇచ్చిన మాస్టర్ బి.రాజేష్‌ను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆధునిక ప్రపంచంలో సినిమాలు, టీవీల ప్రభావంతో కోలాటాలు, భజనలు, పౌరాణిక, జానపద కళలపై మక్కువ తగ్గిందన్నారు. కళాకారులకు ఆదరణ కరువయిందన్నారు. గతంలో గ్రామాల్లో పండుగలు ఉత్సవాల సందర్భంగా జానపద కళారూపాలు ప్రదర్శించేవారని గుర్తుచేశారు.

నేడు వాసవీమాత జయంతి వేడుకలు



పామూరులోని వాసవీమాత దేవస్థానం

పామూరు, మే 17: పామూరు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి దివ్య జయంతి వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు యేల్చూరి బాలకొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆర్యవైశ్యుల మహిళలచే అమ్మవారికి అభిషేకం కోసం కలశాలతో స్థానిక నెల్లూరు రోడ్డులోగల సత్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద నుంచి ఊరేగింపుగా తీసుకువస్తారు. అమ్మవారికి విశేష మంగళ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం, మహిళలచే సాముహిక కుంకుమార్చన, మంగళహారతి, మంత్రపుష్పం జరుగుతాయి. సాయంత్రం అమ్మవారికి సారె సమర్పణ , రాత్రికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఛైర్మన్ తెలిపారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధం

తాళ్లూరు, మే 17: వ్యవసాయ శాఖద్వారా 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట వి త్తనాలను పంపిణీ చేసేందుకు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. దోసకాయలపాడు ఆర్ బీకేను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడుతూ జినుగు, జీలుగ, పిల్లిపెసర విత్తనాల కోసం ఆర్‌బీకేల్లో నగదు చెల్లిస్తే నా లుగైదు రోజుల్లో విత్తనాలను సరఫరా చేస్తామని చెప్పారు. సంబంధిత ఆర్‌బీకేల్లో వీఏఏలను రైతులు సంప్రదించి, రుసుం చెల్లించాలన్నారు. ఆతర్వాత ఐదు రోజుల్లో విత్తనాలు పొందవచ్చునని చెప్పారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 18 మే 2024





• మాచర్లలో ఆర్ఏఎఫ్ బలగాలు

వేటుతోనైనా.. మారేనా?

కలెక్టర్ శివశంకర్





ఎస్పీ బిందుమాధవ్

• అధికారుల పనితీరుపై అనుమానాలే! • ఇంకొందరిపై నివేదికకు అధికారులు సిద్ధం • కలెక్టర్ శివశంకర్ రిలీవ్.. ఐజీకి ఎస్పీ బాధ్యతలు

నరసరావుపేట, మే 17: ప్రశాంత ఎన్నికలన్నారు.. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అవ సరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.. ధైర్యంగా వచ్చి ఓటేయ్యాలన్నారు.. అసాంఘిక శక్తులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసు కుంటామన్నారు.. కానీ అధికారులు ప్రకటనలు అమలు కాలేదు. వారి హెచ్చరికలను అరాచకశక్తులు పట్టించుకోలేదు. పల్నాడు జిల్లాలో పలు ప్రాంతాల్లో పోలింగ్‌కు ముందుకంటే పోలింగ్ రోజు, ఆ తర్వాత అరాచకం రాజ్యమేలింది. పోలీసు అధికారులు చెప్తూ వచ్చిన భద్రతా చర్యలు ఏమయ్యాయో తెలియదు కానీ వైసీపీ మూకలు ఇనుపరాడ్లు, కర్రలతో స్వైర విహారం చేశారు. పోలీసుల సమక్షంలోనే ఎక్కువగా విధ్వంసాలు జరిగాయి. ప్రతి సంఘటనలోనూ పోలీసు అధికారులు ప్రేక్షకపాత్ర వహించారని ఎన్నికల సంఘం గుర్తించింది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని కలెక్టర్, ఎస్పీ సహా ఆరు మంది పోలీసు అధికారులపై వేటేసింది. ఆ పోలీసు అధికారులపై సిట్ వేసి విచారణకు ఆదేశించింది. ఈ పరిస్థితుల్లో ఇప్పటికైనా అధికారుల తీరులో మార్పు వచ్చేనా అంటే ఇంకా కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డితో పాటు పలువురిని బదిలీ చేసినా యంత్రాంగం తీరు మారలేదని పోలింగ్ పరిణామాలు తెలియజేశాయి. అయితే కేంద్ర ఎన్నికల సంఘం జోక్యంతో ఈ సారి భారీగా వేటుతో పాటు వారిపై విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇంకొందరి పోలీసు అధికారులు పోలింగ్ సందర్భంగా వ్యవహ రించిన తీరుపై ఉన్నతాధికారులు నివేదిక రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ వరకు, ఆ తర్వాత ఎక్కడా దాడులు జరగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉంది. కలెక్టర్ శివశంకర్ శుక్రవారం ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త కలెక్టర్‌ను శుక్రవారం రాత్రి వరకు నియమించలేదు. ఎస్పీ బిందుమాధవ్ బాధ్యతలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి స్వీకరించారు. అనంతరం జిల్లాలోని సీఐలతో ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి శాంతిభద్రతలకు భంగం కలిగితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

ఆయనొక్కడికే సకల సౌకర్యాలు

కొత్త జిల్లా.. అనేక సవాళ్లు.. సమస్యలు కానీ అవేవీ చూడని శివశంకర్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సకల సౌకర్యాలు కల్పించుకునేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్న విమర్శలున్నాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాలో ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించారన్న విమర్శలున్నాయి. తన నివాసం కోసం దాదాపు రూ.3 కోట్లు వెచ్చించి సకల సౌకర్యాలు కల్పించుకున్నారు. అదేవిధంగా క్యాంప్ కార్యాలయం కోసం అర్బన్ సెంటర్ భవనాన్ని తీసుకున్నారు. తమ కార్యాల యాల్లో కూర్చునేందుకు సరైన కుర్చీలు కూడా లేవని పలువురు అధికారులు వాపోయినా పట్టించుకోలేదని సమాచారం. ఇక విద్యాశాఖ కార్యాలయానికి స్థలం, ఇంధన బంకు ఏర్పాటుకు జలవనరుల శాఖ కార్యాలయం కేటాయింపుపై విమర్శలు వచ్చాయి. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు ప్రభుత్వం రూపొందించిన ప్రణాళిక ప్రకారం నిర్మాణాలు జరగాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా కలెక్టర్ వ్యవహరించారన్న విమర్శలున్నాయి. సంక్రాంతి సంబరాలు నిర్వహణ, నిధులపై ఆరోపణలు వచ్చాయి. కలెక్టరేట్‌లో ఓ నిర్మాణం కోసం ఐఎంఏను విరాళం కోరినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆకస్మికంగా కలెక్టర్ బదిలీతో ఆయన కోటరీ లోని అధికారులు కంగుతిన్నారు.

ఫిర్యాదులు బుట్టదాఖలు

ఎన్నికలకు సంబంధించి అనేక ఫిర్యాదులు ఎన్నికల కమిషన్‌కు అందాయి. వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ జిల్లా ఎన్నికల అధికారికి కమిషన్ పంపింది. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరపకుండానే ఫిర్యాదులో పేర్కొన్న పరిస్థితులు జిల్లాలో లేవని అంతా బాగుందని ఎన్నికల కమిషన్‌కు జిల్లా ఎన్నికల అధికారులు సమాధానమిచ్చారు. ఈ ప్రక్రియలో ఓ అధికారి కీలకపాత్ర పోషించారని సమాచారం. అధికార పార్టీకి అనుకూలంగా ఆయన వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిశీలనలో ఏకపక్షంగా వ్యవహరించారని ఈసీ నిర్ధారించుకుంది.

అనుయాయులకే కీలక బాధ్యతలు

అధికారుల బదిలీల్లో కూడా ఎన్నికల నిబంధనలు పాటించలేదు. అధికార పార్టీకి అనుయాయులుగా పేరొందిన అధికారులను కలెక్టర్ బదిలీ చేయకుండా ఇక్కడే ఉంచారన్న ఆరోపణలు వచ్చాయి. వీరికి ఎన్నికల్లో కీలక బాధ్యతలు అప్పగించారని సమాచారం. డీపీవోపై పలు ఆరోపణలు వచ్చాయి. ఆయనకు కలెక్టర్ కీలక బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సిబ్బందిని ఎవరిని ఎక్కడికి పంపాలనే బాధ్యతలను ఆయన నిర్వహించారు. నకరికల్లు మండలానికి చెందిన మరో అధికారి కూడా ఈ విషయంలో కీలకంగా వ్యవహరించారని తెలిసింది. వీరిద్దరిపై కూడా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. అయినా సదరు అధికారులకు కలెక్టర్ వత్తాసు పలికారన్న విమర్శలున్నాయి. పోలింగ్ తర్వాత రోజు జిల్లాలో పెద్దఎత్తున విధ్వంసాలు జరుగుతున్నా కలెక్టర్ సరైన రీతిలో స్పందించలేదని ఎన్నికల కమిషన్ గుర్తించినట్లు తెలిసింది. ఎన్నికల ప్రక్రియలో నిబంధనలను అతిక్రమించడం వల్లే ఆయనపై బదిలీ వేటు పడిందన్న ప్రచారం జరుగుతోంది.

నాలుగో రోజూ.. 144 సెక్షన్

• పల్నాడులో మోహరించిన కేంద్ర బలగాలు
• కొనసాగుతున్న పికెట్లు.. మాదలలో పోలీసుల సోదాలు
• మున్సిపల్ పట్టణాల్లో దుకాణాలు మూయించిన పోలీసులు

నరసరావుపేట, మాచర్ల టౌన్, కారంపూడి, ముప్పాళ్ల, రెంటచింతల, సత్తెనపల్లి, మే 17: విధ్వంసాలు.. అరాచకాల నుంచి పల్నాడు ఇంకా తేరుకోలేదు. నాలుగు రోజులుగా జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంది. అయినా ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయం మధ్యే జనం ఉన్నారు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. బుధ, గురువారాల్లో జరిగిన పోలీసు తనిఖీల్లో వైసీపీ నేతల ఇళ్లల్లో పెట్రో బాంబులు ఉన్నట్లు తెలియడంతో ప్రజల్లో భయాందోళనలు మరింత పెరిగాయి. ఇంకెన్ని దగ్గర్ల ఇలాంటి బాంబులు, మారణాయుధాలు ఉన్నాయోనని ఆందోళన చెందు తున్నారు. దీంతో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి 600 మంది పోలీసులను రప్పించారు. 17 కంపెనీల కేంద్ర బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నాయి. మాచర్ల, నరసరావుపేట, కారంపూడిలో పోలీసు బలగాలు మోహరించాయి. మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాలపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, కారంపూడి, మాచర్ల పట్టణాల్లో దుకాణాలను పోలీసులు మూయించారు. ఈవీఎం ధ్వంసాలకు సంబంధించి వెబ్ ఫుటేజ్‌ను సేకరించి పాల్గొన్న వారందరిపై కేసులు నమోదు చేశారు. వీడియో క్లిప్పింగ్‌ల ద్వారా అల్లరి మూకలను గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అరాచకాలకు సంబంధించిన కేసులు నమోదు చేశారు. విధ్వంసాలకు పాల్పడిన 250 మందిని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. వీరిలో 20 మందిని రిమాండ్‌కు పంపారు. ఈవీఎంను ధ్వంసం చేసిన నాలుగు కేసుల్లో నిందితులను అరెస్టు చేశారు. ముందస్తు చర్యలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్లను కొనసాగిస్తున్నారు. పట్టణాల్లో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. శుక్రవారం మాచర్ల పట్టణానికి అదనంగా రెండు కంపెనీల ఆర్ఏఎఫ్ (210 మంది) బలగాలు దిగాయి. పట్టణంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అప్రకటిత కర్ఫ్యూ పరిస్థితులు కారంపూడిలో నెలకొన్నాయి. జన సంచారం లేకుండా వీధుల్లో పోలీసులు అడుగడుగునా కాపలా కాస్తున్నారు. ప్రధాన కూడళ్లలో బారికెడ్లు పెట్టి పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. రెంటచింతల మండలంలోని 11 గ్రామాలకు 7 గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ రమణమూర్తి చెప్పారు. ముప్పాళ్ల మండలం మాదలలో వైసీపీ నేత గృహంలో పెట్రోల్ బాంబులు దొరకడంతో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, సీఐలు రాజేష్, రాంబాబు వంద మంది పోలీసు బలగాలతో శుక్రవారం అనుమానితుల గృహాలను సోదా చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. మాదలలో పెట్రో బాంబులు కలిగి ఉన్న వైసీపీ నాయకుడు గుంటూరు సైదాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హజరతయ్య తెలిపారు. సత్తెనపల్లిలో ప్రజలు రోడ్ల వెంట గుమికూడ కుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ సహకరించాలని సీఐ శ్రీనివాసరావు కోరారు. ఎస్ఐ సంధ్యారాణి ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన కూడళ్ళల్లో బందోబస్తు నిర్వహించారు. నిరవధిక 144 సెక్షన్ అమలుతో పట్టణ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారాలను కోల్పోతున్నామని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మాచర్లలో మూతబడ్డ దుకాణాలు



కారంపూడిలో పోలీసు బందోబస్తు



రెంటాలలో పోలీసు పికెటింగ్



మాదలలో పర్యటిస్తున్న డీఎస్పీ గురునాథబాబు

అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి..

పిన్నెల్లి సోదరులు ఎలా పరారయ్యారు?

మాచర్లలో హింసకు పాల్పడిన వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి అరెస్టు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గృహ నిర్బంధంలో ఉన్న వారిద్దరూ గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చిన వారు గన్‌మెన్లను కింద ఉంచి ఇంటి మేడపైకి వెళ్లారు. ఆ తర్వాత అర్ధ రాత్రి గోడ దూకి ప్రైవేటు వాహనాల్లో గుర్తు తెలియని ప్రదేశానికి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. పిన్నెల్లి సోదరులు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు శుక్రవారం ఉదయం గుర్తించిన గన్‌మెన్లు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారి అరాచకాలపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్‌గా దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరెస్టు చేస్తారనే భయంతోనే ముందస్తుగానే వారు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. అయితే హౌస్ అరెస్టులో ఉన్న వారు ఎలా పరారయ్యారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయలు.. అదిరేట్లు

• ఘాటెక్కిన పచ్చి మిర్చి
• కిలో రూ.100కు చేరిన వైనం



గుంటూరు, మే17: కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రధానంగా పచ్చి మిర్చి ధర కిలో రూ.100కు చేరటం సామాన్య ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే ధరల పెరుగుదలలో మార్పు కనిపిస్తోంది. వేసవి కావటం, డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల ఉత్పత్తి లేకపోవటమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా కూరగాయల వ్యాపారి మల్లికార్జునరావు పేర్కొన్నారు. మొన్నటి వరకు పచ్చి మిర్చి కిలో రూ.50 నుంచి రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.100కు చేరింది. ఇక బెండకాయలు, దొండకాయలు, గోరుచిక్కుళ్ళు కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.60కు చేరుకుంది. దోసకాయలు కిలో రూ.30 లు ఉండగా ప్రస్తుతం రూ.40కు చేరుకుంది. ఇక బీన్స్ మొన్నటి వరకు కిలో రూ.100 నుంచి రూ.120 ఉండగా ప్రస్తుతం రూ.200కు చేరింది. ఇక సొరకాయ, బీట్ రూట్, క్యారెట్ ధరల్లో పెద్దగా మార్పు లేదు. టమోటా ప్రస్తుతం కిలో రూ.30కు లభ్యమవుతోంది. కాగా రైతుబజార్లలో కిలో పచ్చి మిర్చి రూ.65, టమోటా కిలో రూ.25లకు విక్రయాలు జరుగుతున్నాయి.



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చీరాలలో గవర్నర్ అబ్దుల్ నజీర్

చీరాల టౌన్, మే 17: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యక్తిగత పర్యటనలో భాగంగా శుక్రవారం చీరాల పరిధిలోని వాడరేవు వచ్చారు. అక్కడి ఐటీసీ అతిథి గృహంలో బస చేశారు. ఆయన్ను కలెక్టర్ పి.రంజిత్‌బాష, ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గవర్నర్ రాత్రికి అక్కడే బస చేసి శనివారం సాయంత్రానికి తిరిగి వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు.

నడిరోడ్డుపై దారుణాలు

• మూడు రోజుల్లో రెండు ఘటనలు
• పాత నేరస్థుల కదలికలపై కొరవడిన నిఘా
• ఉలిక్కిపడిన ప్రజలు.. కొత్త సంస్కృతిపై ఆందోళన

బాపట్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై దారుణాలు.. రౌడీ మూకలు బరితెగిస్తున్నాయి.. సినీ ఫక్కీలో ఛేజింగ్‌లు.. దాడులు.. హత్యలు.. గత కొన్ని రోజులుగా బాపట్లలో చోటుచేసుకుంటున్న ఘటనలతో ప్రజలు భీతిల్లిపోతున్నారు. పాత నేరస్తులపై పోలీసు నిఘా కొరవడటంతోనే అల్లరి మూకలు చెలరేగిపోతున్నాయని తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియ ముగిసిన మరుసటి రోజే రేపల్లెలో ఓ రౌడీషీటర్ తల నరికి దారుణంగా హత్యే చేశారు. ఈ ఘటన మరువక ముందే బాపట్ల పాత బస్టాండ్ దగ్గర బుధవారం రాత్రి కత్తులతో దారుణంగా ఓ వ్యక్తిని పొడిచి చంపారు. ఈ రెండు ఘటనలు కూడా ఆయా పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో జరగడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. పాత పగల నేపథ్యంలోనే ఈ దారుణాలు జరిగాయనే వాదనను పోలీసులు వినిపిస్తున్నారు. పలు జిల్లాల్లో ఎన్నికల అనంతరం హింస చెలరేగుతున్న సమయంలో బాపట్ల జిల్లాలో రెండు హత్యలు జరిగాయి. జిల్లాలో ఇలాంటి హత్యల సంస్కృతి గతంలో లేవు. ఇటీవల సూర్యలంక రోడ్డులో అయితే గ్యాంగ్‌వార్‌ను తలపించే విధంగా బాహాబాహికి దిగడమే కాకుండా చంపుకునే వరకు వెళ్లారు. గంజాయి మత్తులోనే ఇది జరిగిందనే ప్రచారం కూడా అప్పుడు జరిగింది. మళ్లీ ఇప్పుడు బాపట్ల పాతబస్టాండ్ దగ్గర కారుతో వెంటాడి ఢీకొట్టి అందరూ చూస్తుండగానే విచక్షణా రహితంగా దాడి చేసి హత్య చేశారు. ప్రశాంతతకు నెలవుగా బాపట్లలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం కొట్టివచ్చినట్లు కనిపిస్తోంది. తెరవెనక అండలేనిదే ఇంతటి దారుణాలకు సాహసించరనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వైసీపీ పాలనలో పాలకపార్టీ నేతలు వారి స్వప్రయోజనాల కోసం అరాచకశక్తులను తెర వెనక నుంచి ప్రోత్సహిస్తూ వారికి ఊతమిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిని బలపరిచే విధంగా బాపట్లలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి. పోలీసులు మూలాల్లోకి వెళ్లి విచారణ చేసి ఇలాంటి దారుణాలు మళ్లీమళ్లీ జరగకుండా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల వేళ పట్టణం మొత్తం సీసీ కెమేరాల నిఘాలో ఉందని చెప్పిన పోలీసులకు పాతబస్టాండ్ కూడలిలో జరిగిన హత్యకు సంబంధించి సరైన ఫుటేజ్ దొరక్కపోవడం గమనార్హం.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా ఆదేశాలు



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల, మే 17: బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఈవీఎంలను భద్రపరిచిన బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా చర్యలను ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన రిజిష్టర్ పరిశీలించారు. అనంతరం అన్ని నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. కౌంటింగ్‌కు సంబంధించి రాజకీయపార్టీల ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరి, బారీకేడ్ ఏర్పాటు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విఠలేశ్వర్, డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవోలు గంధం రవీందర్, హేలా షారోను పాల్గొన్నారు.

284 మందిపై కేసులు.. 255 మంది అరెస్టు

జిల్లాలో పోలింగ్ రోజున, తదనంతరం జరిగిన ఘర్షణలపై 284 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం తెలిపారు. వీరిలో ఇప్పటి వరకు 255 మందిని అరెస్టు చేశామన్నారు. జిల్లాలో ఎవరైనా ఘర్షణలకు పాల్పడినా, అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి శాంతిభద్రతలకు సంబంధించి 24 మందిపై 13 కేసులు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. 22 మందికి 41(ఎ) సీఆర్పీసీ నోటీసులు జారీ చేసి ఇద్దరిని రిమాండ్‌కు పంపించామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఘటనలపై మరో 21 కేసులు నమోదు చేసి 42 మందిని అరెస్టు చేశామన్నారు. జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు అధికారులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారన్నారు. చెడు నడత కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచామన్నారు.

తప్పుడు కేసులు పెడితే సహించం

- పోలీసులు న్యాయబద్ధంగా వ్యవహరించాలి
- టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని
- బొట్లపాలెంలో వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న నూకసాని బాలాజీ, నారపుశెట్టి పాపారావు

దర్శి, మే 17: టీడీపీ వర్గీయులపై తప్పుడు కేసులు పెడితే సహించబోమని ఆ పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. పోలింగ్ సందర్భంగా మండలంలోని బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకాలు దాడిచేసి గాయపరిచిన విషయం విదితమే. అనంతరం పోలీసులు ఏకపక్షంగా వ్యవహిస్తూ బాధితులపై అక్రమ కేసులు బనాయించారు. ఈనేపథ్యంలో శుక్రవారం బాలాజీ బొట్లపాలెం వచ్చారు. గాయపడిన టీడీపీ కార్యకర్తలను పరామర్శించారు. జరిగిన ఘటనపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నూకసాని మాట్లాడుతూ టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని, భయపడాల్సిన పనిలేదని బాధితులకు భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు.

అనంతరం దర్శిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీకి కొమ్ముకాసిన అధికారులను ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడ కూడా పోలీసులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల అనంతరం బడుగు, బలహీన వర్గాలపై వైసీపీ వర్గీయులు విచ్చలవిడిగా దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏకపక్షంగా వ్యవహిస్తూ టీడీపీ వర్గీయులను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడితే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు శాగం కొండారెడ్డి, మారెళ్ల వెంకటేశ్వర్లు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, వరగాని పౌలు, మన్నేపల్లి సమర, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రక్షాళన ప్రారంభం

- డిప్యుటేషన్‌పై పనిచేసే ఉద్యోగులపై డీఎంహెచ్‌వో ఆరా
- ఇద్దరు ఉద్యోగులను వారి సొంత స్థానాలకు వెళ్లాలని ఆదేశం
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో వైద్యశాఖలో కలకలం

ఒంగోలు(కలెక్టరేట్), మే 17: వైద్యారోగ్యశాఖలో ప్రక్షాళన ప్రారంభమైంది. డిప్యుటేషన్లు రద్దు చేసినా ఆశాఖలో పాతుకుపోయిన ఇరువురు ఉద్యోగులను వారి మాతృ స్థానాలకు వెళ్లిపోవాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. వైద్యాఆరోగ్య శాఖలో అక్రమాలు, అడ్డగోలుగా డిప్యుటేషన్‌లపై 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రక్షాళన ఏదీ' అన్న శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఇది కలకలం రేపింది. డిప్యుటేషన్‌లపై పనిచేస్తున్న వారిపై డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యాలయంలో అలా ఎంత మంది పనిచేస్తున్నారు? ఇప్పటివరకు ఎంత మంది డిప్యుటేషన్లను రద్దు చేశారు? తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. పూర్తి వివరాలను ఇవ్వాలని సంబంధిత సెక్షన్‌ల సూపరింటెండెంట్‌లను ఆదేశించినట్లు సమాచారం. అలాగే ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన డాక్టర్లు కూడా డిప్యుటేషన్‌పై వైద్యశాఖలో పనిచేస్తుండటంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం వేలకు వేలు జీతాలు ఇస్తున్నా ప్రజలకు వైద్య సేవలు అందించకుండా కొందరు కార్యాలయంలో పాతుకుపోయి పెత్తనం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అలాంటి వారిపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పూర్తి అదనపు బాధ్యతలు తీసుకున్న సురేష్‌కుమార్ అటువంటి డిప్యుటేషన్లపై రద్దుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే వైద్యశాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు శ్రీకారం చుట్టారు. డిప్యుటేషన్‌లపై పనిచేసే వారందరినీ వారి సొంత స్థానాలకు పంపనున్నారు.

పోస్టుల భర్తీపై ప్రభుత్వానికి నివేదిక: డీఎంహెచ్‌వో

వైద్యారోగ్యశాఖలో పోస్టుల భర్తీ విషయమై వచ్చిన ఆరోపణలపై విచారించి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లపై వచ్చిన ఆరోపణలపై రాజమండ్రి ఆర్డీ విచారణ చేశారన్నారు. వైద్యశాఖలో ఒక ఫార్మసీ ఆఫీసర్, ఒక హెల్త్ ఎడ్యుకేటర్ మాత్రమే పని కేటాయింపు ఆధారంగా జిల్లా కార్యాలయంలో పని చేస్తున్నారని తెలిపారు. పీహెచ్‌సీలకు చెందిన వారెవ్వరూ ప్రస్తుతం ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేయడం లేదని ఆయన వివరణ ఇచ్చారు.

విద్యుత్ మోటార్ తగిలి 11 నెలల బాలుడు మృతి

విజయనగర్‌కాలనీ(చీరాలటౌన్), మే 17: ఇంట్లోని విద్యుత్ మోటార్ తగిలి 11 నెలల బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని విజయనగర్ కాలనీలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం కాలనీకు చెందిన వినోద్, దివ్య ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈక్రమంలో వీరికి రియాన్ హన్స్(11 నెలలు) బాలుడు సంతానం. సొంతిల్లు లేకపోవడంతో కాలనీలోనే అద్దె ఇంట్లో ఉంటు ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా పురాతన ఇల్లు కావడంతో కాస్త చెమ్మవచ్చింది. దీంతో ఇంట్లోని విద్యుత్ నీళ్ల మోటారు కూడా తడిసింది. ఈనేపథ్యంలో ఇప్పుడిప్పుడే నడకనేర్చుకుంటున్న బాలుడు బంతాడుతూ మోటార్ పట్టుకుని కుప్పకూలాడు. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్య పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు.

పశువుల షెడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పశువులషెడ్‌ను పరిశీలిస్తున్న పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి

తాళ్లూరు, మే 17: పశువుల షెడ్‌ల వద్ద ఉండే వ్యర్థపదార్థాలతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ బేబీరాణి అన్నారు. పశుపోషకులు పశువుల షెడ్‌ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం పశువుల షెడ్లను శుక్రవారం పరిశీలించారు. గ్రామాల్లో పశువుల షెడ్ల నుచి వచ్చే వ్యర్థపదార్థాలతో డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెం దుతున్నాయని వైద్యశాఖ సిబ్బంది ఆశాఖ అధికారులకు విన్నవించారు. దీంతో పశుసంవర్థకశాఖ అధికారులు శివరాంపురంలో పశువుల షెడ్‌లను పరిశీలించి పశుపోషకులకు అవగాహన కల్పించారు.

ఈసందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ పశుపోషకులు కూడా తమ షెడ్‌ల వద్ద అపరిశుభ్రం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగునీరు ప్రవహించే ప్రాంతాల్లో బ్లీచింగ్, ఫినాయిల్ పిచికారి చేయించి దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ కాలేషావలి, ఉపసంచాలకులు రమేష్‌బాబు, సహసంచాలకులు పురుషోత్తమరావు, పశువైద్యాధికారులు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, రాంబాబు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్లు కుమ్మరించారు!

- ఎన్నికల్లో ప్రలోభాలు, పంపకాలకు వెచ్చించిన మొత్తం ఇదీ
- ఒంగోలు, దర్శిలో ఒక్కోచోట రూ.150కోట్లపైనే ఖర్చు
- చీరాల, కందుకూరు, పర్చూరు, అద్దంకిలో రూ. వంద కోట్లు చొప్పున..
- మార్కాపురం, గిద్దలూరులో రూ.80కోట్లపైనే!
- జనరల్ స్థానాల్లో కనిగిరిలో తక్కువ
- ఎస్సీ నియోజకవర్గాల్లో కొండపి, వై.పాలెం టాప్
- చివరలో ఎస్.ఎన్‌పాడు



ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు రూ.కోట్లు కుమ్మరించారు. ప్రలోభాలు, పంపకాలకే ఉమ్మడి జిల్లాలో రూ.వెయ్యి కోట్లకుపైన వెచ్చించినట్లు అంచనా. ప్రచారం, ఇతరత్రా ఖర్చులు దీనికి అదనం. ఎన్నికల ఖర్చు విషయంలో ఒంగోలు, దర్శి నియోజకవర్గాల అభ్యర్థులు ముందున్నారు. రూ.150 కోట్లకు పైగానే వెచ్చించారు. అద్దంకి, పర్చూరు, చీరాల, కందుకూరు నియోజవర్గాల్లో ఒక్కోచోట రూ.100 కోట్ల వరకూ ఖర్చుచేసినట్లు అంచనా. మార్కాపురం, గిద్దలూరుల్లోనూ చెరోచోట రూ.80కోట్లు వెచ్చించారు. జనరల్ కేటగిరీలో కనిగిరిలోనే కాస్తంత తక్కువ ఖర్చు చేశారు. దళితులకు రిజర్వు అయిన స్థానాల్లో కొండపి, ఎర్ర గొండపాలెం అభ్యర్థులు టాప్‌లో నిలిచారు. అన్నింటా తక్కువ వ్యయం అయిన నియో జకవర్గాల్లో సంతనూతలపాడు కనిపిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు జిల్లాలో గతం కన్నా ఎక్కువ వెచ్చించినట్లు తేలగా, పార్టీల నుంచి కూడా అంతో ఇంతో ఆర్థికసాయం లభించింది. మరీ ముఖ్యంగా వైసీపీ అభ్యర్థులే ఓటర్ల ప్రలోభాలకు అధిక మొత్తాన్ని ఖర్చు చేశారు. కొన్ని స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు పోటీపడగా, మరికొన్ని చోట్ల ఈవిషయంలో వెనుకబడిపోయారు.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

సాధారణంగా ఎన్నికల్లో పార్టీలు, వాటి మేనిఫెస్టోలు, ఆపై అభ్యర్థుల ప్రభావానికి గతంలో ప్రాధాన్యం ఉండేది. వాటికితోడు స్థానిక అంశాల ప్రభావం కన్పించేది. అనంతరం కులాలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇప్పుడు వీటన్నింటికీ మించి డబ్బుతో ఓటర్లను ఆకర్షించడం పెరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో అది మరింత అధికంగా కనిపించింది. దీనికితోడు ఈసారి ప్యాకేజీల పేరుతో కిందిస్థాయి నాయకులను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీగా వెచ్చించారు. సహజంగా ఎన్నికల్లో ఓటర్లను అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. పార్టీలు, వాటి విధానాలతో ఢీ అంటే ఢీ అన్నస్థాయిలో పోటీ జరిగిన నియోజకవర్గాల్లో అంతో ఇంతో డబ్బు ప్రభావం గెలుపోటములపై కనిపించిన దాఖలాలు కూడా ఉన్నాయి. కానీ ద్విముఖ పోటీలో ప్రధాన పార్టీల అనుకూల, వ్యతిరేక పవనాల ప్రభావం కూడా కీలకం. ఎక్కువ స్థానాల్లో ఆ అంశమే జయాపజయాలను నిర్ణయిస్తుంది. అయితే ఈ పర్యాయం ఇటు టీడీపీ కూటమి, అటు అధికార వైసీపీ అభ్యర్థులు తాయిలాలతో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను గుర్తించి గత ఐదేళ్లలో అంతోఇంతో సంపాదించిన నేపథ్యంతో ఈ విషయంలో అధికార పార్టీ అభ్యర్థులు ముందు నిలిచారు. వైసీపీ రాష్ట్ర నాయకత్వం కూడా పార్టీ అభ్యర్థులకు ఆర్థిక చేయూత ఎక్కువగానే ఇచ్చినట్లు తేటతెల్లమవుతోంది.

ఒంగోలు, దర్శిలో భారీగా వ్యయం

ఈ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు చేసిన వ్యయంపై ఒక అధ్యయనం చేయగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, దర్శి అసెంబ్లీ నియోజకవర్గాల్లోనే అభ్యర్థులు భారీగా ఖర్చు చేసినట్లు వెల్లడైంది. వ్యక్తిగతంగా చూస్తే మొత్తం అభ్యర్థుల్లో ఒంగోలు వైసీపీ అభ్యర్థి ఎక్కువ మొత్తం వెచ్చించినట్లు కనిపిస్తోంది. ఒంగోలు అసెంబ్లీలో వైసీపీ అభ్యర్థి తరఫున ఓటుకు మూడు వేల రూపాయల చొప్పున పంపిణీ చేశారు. అందుకోసమే రూ.60 కోట్లకు పైగా వెచ్చించినట్లు అంచనా. దీనికి అదనంగా బియ్యం, చీరలు ఇచ్చారు. ఇతరత్రా కలుపుకున్నా ఒంగోలులో వైసీపీ తరఫునే రూ.100 కోట్లకు పైగా ఖర్చుచేసినట్లు భావిస్తున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి పక్షాన ఓటుకు వైసీపీకన్నా తక్కువ ఇచ్చారు. ఆరకంగా రూ.40 కోట్లు, ఇతరత్రా ప్రలోభాల వ్యయం కలుపుకుంటే మొత్తంగా రూ.70 కోట్లు ఆయన ఖర్చు చేసినట్లు అంచనా వేస్తున్నారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇరు పార్టీల వారు ఓటుకు రూ.3వేల ప్రకారం ఇచ్చారు. ఆ రకంగా ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ రూ.120 కోట్ల వరకూ ఓట్ల కొనుగోలుకే ఖర్చు చేశారు. ఇతరత్రా మరో 45 కోట్లు వ్యయం అయినట్లు అంచనా.

ఆమూడింటిలో ఒక్కో చోట రూ.100 కోట్లపైన వ్యయం

ఉమ్మడి జిల్లాలోని చీరాల, కందుకూరు, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కోచోట ప్రధాన పార్టీల అభ్యర్థుల తరుఫున రూ.100 కోట్లకుపైన ఓట్ల కొనుగోలుకు కుమ్మరించినట్లు వెల్లడవుతోంది. చీరాలలో వైసీపీ, టీడీపీలకు తోడు కాంగ్రెస్ అభ్యర్థి డబ్బులు పంపిణీ చేశారు. వైసీపీ, టీడీపీ సమానంగా ఇవ్వగా, కాంగ్రెస్ తరఫున కొందరికి వెయ్యి, కొందరికి రూ.1,500 పంపిణీ చేశారు. పోలింగ్ రోజు మధ్యాహ్నం తర్వాత నుంచి అదనపు పంపిణీలు జరిగాయి. దీంతో ఇక్కడ ముగ్గురూ కలిసి రూ.100 కోట్లపైనే ఖర్చు చేసినట్లు అంచనా. అందులో వైసీపీ తరఫునే ఎక్కువ వెచ్చించినట్లు తెలుస్తోంది. కందుకూరులోనూ టీడీపీ, వైసీపీ అభ్యర్థుల వ్యయం కలిపి చూస్తే రూ.వందకోట్లు దాటింది. పర్చూరులో ఇరుపార్టీల వారు డబ్బులు సమానంగా పంపిణీ చేయగా, నేతల ప్యాకేజీలు భారీగానే ఉన్నాయి. అద్దంకిలోనూ ఇరు పార్టీల వారు సమానంగా పంపిణీ చేశారు. ఈ రెండు చోట్లా ఒక్కో చోట్లా రూ. 100 కోట్లకుపైబడి అభ్యర్థులు ఓట్ల కొనుగోలుకు వెచ్చించినట్లు కనిపిస్తోంది.

పశ్చిమాన తక్కువే..

పశ్చిమప్రాంతంలోని కొన్ని నియోజకవర్గాల్లో ఓట్ల కొనుగోలుకు చేసిన వ్యయం కాస్త తక్కువగానే ఉంది. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఒక్కో చోట పంపకాలు, ప్రలోభాలకు రూ.80 కోట్లకుపైగానే వెచ్చించారు.

మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ తరఫున కొన్ని ప్రాంతాల్లో ఓటుకు రూ.1,500, మునిసిపాలిటీల్లో రెండు వేల ప్రకారం పంపిణీ చేశారు. టీడీపీ కూటమి తరఫున అన్ని ప్రాంతాల్లో సమానంగా ఇచ్చారు. గిద్దలూరు నియోజకవర్గంలో వైసీపీ తరఫున ఓటుకు రెండు వేల ప్రకారం పంపిణీ చేశారు. కూటమి తరఫున అంతకంటే కొద్దిగా తక్కువ ఇచ్చారు.

కనిగిరిలో సమానం

జనరల్ కేటగిరీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనిగిరిలో ఇరుపార్టీల అభ్యర్థులు ఓటు రేటును సమాన స్థాయిలో అమలు చేశారు. ఇక్కడ ఇటు టీడీపీ కూటమి, అటు వైసీపీ తరుపున కూడా రూ.1500 ప్రకారమే పంపిణీ చేశారు. ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే ప్యాకేజీలు, ఇతర ఖర్చులు కూడా ఇక్కడ తక్కువే అయినట్లు తెలుస్తోంది. మొత్తంగా ఇరుపార్టీల అభ్యర్థులు కలిపి రూ.65 కోట్ల నుంచి 70కోట్ల వరకూ వెచ్చించినట్లు అంచనా.

రిజర్వుడు స్థానాల్లోనూ..

రిజర్వుడు నియోజకవర్గమైన కొండపిలో వైసీపీ తరఫున ఓటుకు రూ. 2000, కూటమి తరఫున కొంత తక్కువ పంపిణీ జరిగింది. ఎర్రగొండపాలెంలో కూడా వైసీపీ పక్షాన ఓటుకు రూ.2000 పంపిణీ జరగ్గా, టీడీపీ తరఫున అందులో సగం చెల్లించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇరుపక్షాల తరుపున ఓటుకు సమానంగా పంపిణీ జరిగింది.

వలంటీర్లకు, గిఫ్ట్‌లకు వైసీపీ అదనపు వ్యయం

ప్రతి నియోజకవర్గంలో వలంటీర్లకు ఆగిపోయిన జీతాల పేరుతో వైసీపీ ఒక్కొక్కరికి రూ.5 వేలు పంపిణీ చేసింది. అలా రెండు నెలలపాటు ఇచ్చింది. ఇక వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేకించి గిఫ్ట్‌లు కూడా అందజేశారు. ఇప్పుడూ లేనిది వైసీపీ ఈసారి అధిష్ఠానం నుంచి అందిన దుస్తులను జర్నలిస్ట్‌లకు పంపిణీ చేయడం విశేషం. అంతేకాక వారికి మద్దతు ఇచ్చే మీడియా సంస్థలను ఏరికోరి వాటిలో పనిచేస్తున్న వారికి డబ్బులు, గిఫ్ట్‌లు ఇచ్చే ప్రయత్నం చేశారు.

ప్రతి నియోజకవర్గంలో 1.50 లక్షల మందికిపైగా ఓటర్లకు డబ్బులు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ 1.50 లక్షల మంది నుంచి 2 లక్షల మంది ఓటర్లకు ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బులు పంపిణీ చేయగలిగారు. వివిధ కారణాల వల్ల గతం కన్నా లిక్కర్ పంపిణీ తగ్గింది. అయితే లిక్కర్ కావాలనుకున్న వారికి అదనంగా డబ్బులు పంపిణీ చేశారు. ఇవి కాకుండా ప్రచార సభలు, సమావేశాలు నామినేషన్ల కార్యక్రమాల ర్యాలీలకు జనసమీకరణకు ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 వరకూ చెల్లించి జనాన్ని తెచ్చుకున్నారు. ఇలాంటి ఖర్చులకు జిల్లా మొత్తంగా అభ్యర్థులు మరో వంద కోట్లకుపైన వెచ్చించినట్లు అంచనా.

అయితే ఎక్కువ శాతం ఓటర్లకు ఇరు పార్టీల వారి నుంచి డబ్బులు అందాయి. వారు ఇరు పక్షాలకు న్యాయం చేశారా? పాలనాపరంగా, సామాజికపరంగా వారు మెచ్చిన పార్టీలకే ఓట్లు వేశారా? అనేది తేలాల్సి ఉంది. ఈపర్యాయం ఉద్యోగుల ఓట్లకి అభ్యర్థుల నుంచి వ్యయం తక్కువే అయిందని చెప్పుకోవచ్చు.

తొలకరి సాగుకు సానుకూలం



- జిల్లావ్యాప్తంగా జల్లులు
- సగం మండలాల్లో ఒక మోస్తరు వర్షం
- చల్లబడిన వాతావరణం
- దుక్కుల దున్నకానికి సిద్ధమవుతున్న రైతులు

ఒంగోలు, మే 17 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ముందస్తు వానలు రైతులను మురిపిస్తున్నాయి. తొలకరి సాగుకు సానుకూల పరిస్థితిని కల్పించాయి. ఈనెలలో ఇప్పటికే జిల్లాలోని దాదాపు సగం మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. ఈసారి వర్షాలు ఆశాజనకంగా ఉంటాయన్న సంకేతాలు వాతావరణ శాఖ నుంచి అందుతున్నాయి. రుతుపవనాలు ముందస్తుగా వస్తుంటడం కూడా సాగుపై రైతుల్లో మరింత నమ్మకాన్ని కలిగిస్తున్నాయి. తాజా వర్షాలతో పలు ప్రాంతాల్లో దుక్కులు దున్నకానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు జూన్ ఆరంభం నుంచి ప్రారంభిస్తారు. మెట్ట పైర్లను అధికంగా వేస్తారు. అయితే మే రెండో వారంలో జల్లులు పడితే నాల్గో వారం నుంచి తొలకరి సాగుకు ఉపక్రమిస్తారు. ప్రధానంగా లేటు ఖరీఫ్‌లో లేదా రబీలో రెండో పంట వేసుకొనేందుకు వీలుగా ఉండే సజ్జ, నువ్వు, పెసర వంటి వాటితోపాటు పచ్చిరొట్ట ఎరువుకు ఉపకరించే పిల్లిపెసర, జీలుగ, జనుము ఇతర పశుగ్రాస పంటలు తొలకరి పైర్లుగా సాగు చేస్తారు. మే ఆఖరు నుంచి జూన్ ఆఖరులోపు వేసే ఈ పైర్లు మూడు నెలల్లో చేతికి వస్తాయి. వాటిని కోసిన అనంతరం ఆ భూముల్లో వరి, పొగాకు, మొక్కజొన్న, శనగ ఇతరత్రా పంటలు వేస్తారు. అయితే కొన్నేళ్లుగా వర్షాకాలం తారుమారుగా ఉంటున్న నేపథ్యంలో తొలకరి సాగు సక్రమంగా జరగడం లేదు.

ఈ ఏడాది ముందస్తు వానలు

ఈ ఏడాది తొలకరి సాగుకు సానుకూల వాతావరణం కనిపిస్తోన్నది. గత పక్షం రోజులుగా జిల్లాలో కురిసిన వర్షాలు అందుకు ఉపకరిస్తున్నాయి. జిల్లాలో మేలో 51.30 మి.మీ సాధారణ వర్షపాతం కాగా గత వారం రోజుల్లో దాదాపు 49.0 మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా మద్దిపాడు మండలంలో 139.6 మి.మీ కురిసింది. హనుమంతునిపాడులో 105.4, మార్కాపురంలో 103.8, పొదిలిలో 90.6, నాగులుప్పలపాడులో 91.4, తర్లుపాడులో 81.2, ఒంగోలులో 87.4 వర్షపాతం నమోదైంది. అలాగే పిసిపల్లి, సంతనూతలపాడు, కొండపి, వెలిగండ్ల, ముండ్లమూరు, దొనకొండ, పెద్దారవీడు, త్రిపురాంతకం మండలాల్లో 50నుంచి 80 మి.మీ కురిసింది. ఇతర మండలాల్లోనూ ఒక మోస్తరు జల్లులు పడ్డాయి.

మూడు రోజులుగా జిల్లా అంతటా వర్షం

జిల్లా అంతటా గత మూడు రోజులుగా జల్లులు పడుతూ వాతావరణం చల్లబడింది. మరో రెండు రోజులు ఇలాంటి పరిస్థితే ఉండొచ్చన్న సమాచారం వాతావరణ శాఖ నుంచి అందుతోంది. అలాగే ఈ ఏడాది అంతా మంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించింది. రుతుపవనాలు కూడా ముందుగానే వస్తున్నాయి. ఇవన్నీ ఈసీజన్ సాగుకు అనుకూలంగా మారాయి. జిల్లాలో నెలకొన్న తాజా వాతావరణ పరిస్థితులతో తొలకరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం లక్షా 72వేల హెక్టార్లు కాగా.. సుమారు 40వేల హెక్టార్లలో తొలకరి పైర్లు వేస్తారు. అందుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో దుక్కుల దున్నకానికి రైతులు సిద్ధమవుతున్నారు. నెలాఖరు లోపు రెండు, మూడుసార్లు ఒక మోస్తరు వర్షం కురిస్తే మరింత ఉత్సాహంగా ఖరీఫ్ సాగును చేపట్టే అవకాశం ఉంది.

వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక

ఖరీఫ్ సీజన్ సాగుకుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయశాఖ అధికారులు రూపొందించారు. సుమారు 8,893 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు కోరుతూ ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదించారు. అందులో 177 క్వింటాళ్ల జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుకు సంబంధించిన విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు చెప్తున్నారు. మరో నాలుగు వేల క్వింటాళ్ల కంది, పెసర, మినుము విత్తనాల సరఫరా కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో వచ్చేనెల 15నుంచి ఖరీఫ్ సాగు ప్రారంభమవుతుంది. ఈలోపు రాయితీపై ఇచ్చే విత్తనాలను సిద్ధం చేస్తామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

9.3 మి.మీ వర్షపాతం నమోదు

జిల్లాలోని పలు మండలాల్లో గురువారం ఒక మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 9.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఒంగోలులో అత్యధికంగా 56.4 మి.మీ కురిసింది. వెలిగండ్ల మండలంలో 48.2మి.మీ, పీసీపల్లిలో 34.4, హనుమంతునిపాడులో 28.4, కొండపిలో 22.8, సింగరాయకొండలో 18.8 మి.మీ వర్షపాతం నమోదైంది. సంతనూతలపాడు మండలంలోని 18.6మి.మీ, పుల్లలచెరువులో 18.0, టంగుటూరులో 14.8, జరుగుమల్లిలో 14.6, ఎర్రగొండపాలెంలో 14.2, ముండ్లమూరులో 11.6 మి.మీ కురిసింది. మరో పది మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.


అస్థిరంగా లోగ్రేడ్ మార్కెట్

- ధరల హెచ్చు తగ్గులతో భారీ నష్టం
- రైతు ప్రతినిధుల ఆవేదన
- ప్రస్తుత మార్కెట్ తీరుపై రైతులు, అధికారులతో బోర్డు ఈడీ సమీక్ష



ఆర్ఎం కార్యాలయంలో రైతు ప్రతినిధులు, అధికారులతో సమీక్షిస్తున్న బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు

ఒంగోలు, మే 17 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది పొగాకు ధరలు బాగానే ఉన్నప్పటికి లో గ్రేడ్ రకం మార్కెట్ స్థిరంగా లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పలువురు రైతు ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. లోగ్రేడ్‌లోని పచ్చ, మాడు, బ్రౌన్ రకం బేళ్లకు ఒక్కోరోజు ఒక్కోరకంగా ధరలను వ్యాపారులు ఇస్తున్నారన్నారు. అలా కాకుండా లోగ్రేడ్ ధరలు స్థిరంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని వారు పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబును కోరారు. దక్షిణాది పొగాకు మార్కెట్ హాట్‌హాట్‌గా కొనసాగుతున్నప్పటికీ ధరల హెచ్చుతగ్గులతో రైతులు నష్టపోతున్న తీరును పలువురు రైతు ప్రతినిధులు బోర్డు ఉన్నతాధికారైన ఈడీ దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో ఆయన శుక్రవారం ఒంగోలు వచ్చి ఇక్కడి ఆర్ఎం కార్యాలయంలో దక్షిణాది ప్రాంత వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు పొగాకు బోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్, ఆర్ఎం లక్ష్మణరావు వెల్లంపల్లి, ఒంగోలు-2, టంగుటూరు కేంద్రాల్లో వేలం తీరును పరిశీలించారు. ఆ సందర్భంగా వారు గమనించిన అంశాలను ఈడీ సమీక్షలో వివరించారు. కాగా ప్రస్తుతం లభిస్తున్న ధరల పట్ల సంతృప్తి ఉన్నప్పటికీ రోజుకో రకంగా హెచ్చుతగ్గుల మార్కెట్‌తో రైతులు నష్టపోతున్నారని, దానిని చక్కదిద్దాలని రైతు ప్రతినిధులు ఈడీ శ్రీధర్‌బాబును కోరారు. అలాగే అధికోత్పత్తి పంట అమ్మకాలను కూడా ఒకేసారి ప్రస్తుత వేలంతోపాటే కొనసాగించాలని, గత ఏడాది వలే అపరాధ రుసుం రద్దు చేయాలని, పొగాకు సూర, ముక్క, టాప్‌లీఫ్‌ను వేలం కేంద్రాల్లోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తి తగ్గడంతో ఇక్కడ ప్రస్తుతం మంచి ధరలు లభిస్తున్నాయన్నారు. అయితే రైతులు ఆందోళన చెందుతున్న లోగ్రేడ్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. అధిక ఉత్పత్తి పంట అమ్మకాల అనుమతి కోసం ఉన్నతాధికారులకు ఇప్పటికే లేఖ రాశామని ఆయన చెప్పారు. ఈ లోపు అనుమతి ఉన్న పంటను విక్రయించుకోవాలని సూచించారు. అపరాధ రుసుం మొత్తం రద్దు చేస్తే పంట ఉత్పత్తిపై నియంత్రణ కోల్పోతామన్న ఆయన కొంత మేర అది ఉండాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో బోర్డు సభ్యులు పొద ప్రసాదరావు, బ్రహ్మయ్య, మారెడ్డి సుబ్బారెడ్డి, వివిధ వేలం కేంద్రాల రైతు ప్రతినిధులు, వేలం కేంద్ర అధికారులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా శుక్రవారం మార్కెట్‌లో మేలురకం పొగాకు గరిష్ఠ ధర కిలోకు రూ.5 పెరిగి రూ.308కి చేరింది. ఒంగోలు-1లో ఈ ధర లభించింది. ఇతర కేంద్రాల్లో కిలో రూ.303 నుంచి 305 వరకూ లభించింది.



ఓ మగ్గంపై సగంలో ఆగిన నేత చీర పని

వర్షాలతో ఆగిన మగ్గం

తడి వాతావరణంతో సాగని చేనేత పనులు

చీరాల, మే 17 :సృజనకు మారుపేరు చేనేత . అలానే వాతావరణం సక్రమంగా ఉంటనే మగ్గంపై పోగు అతికేది. లేదంటే పని సాగదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మగ్గం పని ఆగింది. వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండటం అందుకు కారణం. చీరాల నియోజకవర్గంలో సుమారు 8వేల మగ్గాలు ఉన్నాయి. గతంలో గుంత మగ్గాలు ఎక్కువగా ఉండేవి. వర్షాల సమయంలో మగ్గాల గుంతల్లోకి వర్షపునీరుచేరి రోజుల తరబడి పనినష్టం కలిగేది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మగ్గాల డిజైన్లు మారాయి. చాలా వరకు జాకార్డు రకం మగ్గాలు, మోటారు మగ్గాలు వినియోగంలోకి వచ్చాయి. అయినప్పటికి ఆ మగ్గాలకు కూడా సరైన వాతావరణం ఉంటేనే పనిసాగేది. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉన్నా, ఎండవేడిమి ఎక్కువగా ఉన్నా పోగు అతకదు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులతో నేతన్నలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని గంటల పాటు వర్షం జల్లులు ఆగకుండా పడుతూనే ఉన్నాయి. వర్షం ఆగిన తరువాత ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో పని సాగే పరిస్థితి లేకుండా పోయిందని నేతన్నలు చెప్తున్నారు. ఈ క్రమంలో చేనేత సహకార సంఘాల్లో కూడా సభ్యులకు పని ఆగిందని చెప్తున్నారు. సహకారం రంగంలో ఉన్నవారికే పని దొరకని పరిస్థితి ఉంటే, ఇక సహకారేతర రంగంలో ఉన్న సామాన్య చేనేత కార్మికుడికి పని దొరకటం ఇంకా కష్టతరం. కూలీలుగా షావుకార్ల వద్ద పనిచేసేవారు కొంతమంది. ఒకింత ఆర్థిక స్థితి ఉంటే ఎంట్లు(నూలు) అరువు తెచ్చుకుని తమ మగ్గాలపై నేతనేస్తారు. తయారైన వస్త్రాలను విక్రయించిన తరువాత ఎంట్లు అరువు ఇచ్చినవారికి బాకీ చెల్లిస్తారు. బాకీపోను మిగిలిన సొమ్ముతో జీవనం సాగిస్తుంటారు. అయితే మంగు వాతావరణం ఉన్నప్పుడు షావుకార్లు కూడా ఎంట్లు అరువు ఇవ్వరు. దీంతో ఒక్కో సందర్భంలో అప్పులు చేయాల్సిన పరిస్థితి. తీసుకున్న అప్పుకు వడ్డీతో చెల్లించేందుకు చాలా కష్టపడాల్సి వస్తుంది.

కొనసాగుతున్న బెట్టింగులు

● అత్యధిక శాతం టీడీపీ మెజార్టీ పైనే..

అద్దంకి, మే17: సార్వత్రిక ఎన్నికలు ముగిసి 4 రోజులు దాటినా ఇంకా బెట్టింగుల జోరు మాత్రం కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై ఇరుపార్టీల నేతలు ఎవరి ధీమా వారిదేగా బెట్టింగులు పెడుతున్నారు. ఇక అద్దంకి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు నుంచే బెట్టింగులు మొదలయ్యాయి. ఎన్నిలు ముగిసిన తరువాత 4 రోజులుగా రెండు పార్టీల నాయకులు గ్రామాల వారీగా లెక్కలు వేసుకొని బెట్టింగులకు సిద్ధపడుతున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ విజయం విషయంలో తక్కువ బెట్టింగులు జరుగుతుండగా, 15 వేల మెజార్టీ చుట్టూ ఎక్కువ బెట్టింగులు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక మండలాల వారీగా కూడా మెజార్టీలపై ఎక్కువ బెట్టింగులు సాగుతున్నట్లు సమాచారం. గ్రామాలలో కూడా కొంతమంది బెట్టింగులు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు బెట్టింగులు కొనసాగే అవకాశం ఉంది.



వృద్ధులకు గొడుగులు, పండ్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

వృద్ధులకు గొడుగులు, పండ్లు పంపిణీ

పర్చూరు, మే 17: రోటరీ క్లబ్ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో స్థానిక ఆశ్రయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం వెలగా చార్వాణి(ఎన్ఆర్ఐ) ఆర్థిక సహకారంతో గొడుగులు, పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. దీనితోపాటు ఆశ్రమంలోని వృద్ధులకు ఉపయోగపడేవిధంగా రూ.10వేల విలువచేసే బీరువాను కూడా అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరాదరణకు గురైన వృద్ధుకు చేయూతనందించటం బాధ్యతగా గుర్తించాలన్నారు. సామాజిక సేవాకార్యక్రమాలే లక్ష్యంగా రోటరీ చేస్తున్న కృషికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయం అన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, రొటేరియన్ పాబోలు ఉదయభాస్కర్, పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు, పాబోలు వెంకన్న, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వర్షంలో పరీక్షలు రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్ పరీక్షలు

చీరాల, మే 17 : సెయింట్ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. 23వ తేదీ వరకు కొనసాగుతాయని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వనమా రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం మొదటి షిఫ్ట్‌లో 245 మందికి గాను 226 మంది, సాయంత్రం షిఫ్టులో 247 మందికి గాను 235 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్ తెలిపారు. ఉదయం వర్షంను సైతం లెక్కచేయకుండా హాజరైన విద్యార్థులకు కళాశాల నిర్వహకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

9.3 మి.మీ వర్షపాతం

ఒంగోలు(కలెక్టరేట్), మే 17 : జిల్లాలోని పలు మండలాల్లో గురువారం ఒక మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 9.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఒంగోలులో అత్యధికంగా 56.4 మి.మీ కురిసింది. వెలిగండ్ల మండలంలో 48.2మి.మీ, పీసీపల్లిలో 34.4, హనుమంతునిపాడులో 28.4, కొండపిలో 22.8, సింగరాయకొండలో 18.8 మి.మీ, సంతనూతలపాడులో 18.6మి.మీ కురిసింది. మిగతా మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

వేట సాగక... పూట గడవక..

నాచు, తూటు కాడతో ఎదుగుదల లేని చేపలు

పెట్టుబడులు కూడా రాక తీవ్ర నిరాశ

భవనాసి జాలర్ల విలవిల



భవనాసి చెరువులో పెరిగిన నాచు



వెలవెలబోతున్న భవనాసి చెరువు ఒడ్డున ఉన్న చేపల విక్రయశాలలు

అద్దంకి, మే17: భవనాసి చెరువులో వేట సాగించే జాలర్లు విల విల్లాడిపోతున్నారు. శింగరకొండ సమీపంలోని భవనాసి చెరువు ఆధారంగా అద్దంకి మండలంలోని గోపాలపురం, చక్రాయపాలెం, వెంపరాల, శింగరకొండపాలెం, కలవకూరు, గుర్రంవారిపాలెం, శంఖవరప్పాడు, అద్దంకి పట్టణంలోని శ్రీరామ్‌నగర్, రామకృష్ణాపురంలకు చెందిన సుమారు 200 కుటుంబాలు చేపల వేట సాగిస్తుంటారు. మత్స్యశాఖ ఆధీనంలో ఉండే భవనాసి చెరువులో గతంలో పెద్ద మొత్తంలో చేప పిల్లలు పోసే వారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా అంతంతమాత్రంగానే చేప పిల్లలు పోస్తున్నారు. దీంతో జాలర్ల సొసైటీ ఆధ్వర్యంలో సొంతంగా చేప పిల్లలను కొనుగోలు చేసి పోస్తున్నారు. అదే సమయంలో వలలు, పడవల మరమ్మతులకు కలపి ఒక్కో జాలరి సుమారు 20 నుంచి 30 వేల రూపాయలు పెట్టుబడి అవుతుంది. ఏటా ఏప్రిల్ నెలలో వేట ప్రారంభిస్తే మూడు, నాలుగు నెలల పాటు వేటకు ఢోకా ఉండదు. ఖర్చులు పోను 50 వేల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. కాని గత రెండు సంవత్సరాల నుంచి భవనాసి చెరువు లో జాలర్లకు కన్నీరే మిగులుతోంది. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాక ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా భవనాసి చెరువులో దట్టంగా పెరిగిన తూటు, నాచు వల్ల చేప పిల్లల ఎదుగుదల లేక పోగా ఎక్కువ శాతం పిల్లలు చనిపోతున్నాయి. దీంతో వేట సాగించే సమయానికి చేపలు లేక ఒట్టి చేతులతో వెనుతిరిగి రావాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. మూడు, నాలుగు నెలల పాటు సాగాల్సిన వేట చేపలు లేక నెల రోజులకే చెరువు ఖాళీ అవుతోంది. వేట సాగిన రోజులలో కూడా ఎదుగుదల లేని చేపలు వస్తుండటంతో ధర కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఒక్కో జాలరి కుటుంబం పట్టుమని 10 వేల రూపాయలకు కూడా చేపల అమ్మకాలు సాగని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా భవనాసి చెరువు ఆధారంగా వేట సాగించే 200 కుటుంబాలు సుమారు కోటి రూపాయలు నష్టపోతున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో కూడా నీరు లేక వేట సాగక పోవటం, ఇటు భవనాసి చెరువులో వేట సాగినా చేపలు లేక జాలర్ల కుటుంబాలు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

పలుచోట్ల ప్రత్యేక పూజలు, అన్నదానాలు

అద్దంకి, మే17: పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి 331 ఆరాధన ఉత్సవాలు సందర్భంగా పలు బ్రహ్మంగారి దేవాలయాలలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని శాంతినగర్(కలవకూరు డొంక) వద్ద స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి, బల్లికురవ మండలాలలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేల సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కాకాని పాలెంలో బ్రహ్మంగారి దేవాలయంలో వేదపండితులు బొప్పూడి కోటేశ్వరరావు, సత్తెనపల్లి శ్రీ శైలంల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు. దేవస్థానం కమిటీ సభ్యులు కొండపల్లి బ్రహ్మానందం, చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ఉండవల్లి కృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కన్నెబోయిన అనంతలక్ష్మి, బాల వీరయ్య, నాగులపాడు సొసైటీ అధ్యక్షుడు మానికొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాలలోని బ్రహ్మంగారి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అద్దంకి మండలంలోని శాంతినగర్ వద్ద బ్రహ్మంగారి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

మార్టూరులో..

మార్టూరు : వీర బ్రహ్మేంద్ర స్వామి 331 వ ఆరాధన మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం మార్టూరులోని గన్నవరం రోడ్డు దండుదారి వద్ద వీర బ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర బ్రహ్మేంద్రస్వామి, గోవింద మాంబ దంపతుల మూలవిరాట్టులను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. నాలుగు రోజులు నుంచి మార్టూరు, గన్నవరం, యనమదల, బొబ్బేపల్లి గ్రామాలలో ప్రత్యేక వాహనంపై స్వామి వారి జెండాను ఊరేగింపు చేశారు. అనంతరం ఉదయం దేవస్థానంలో జెండాను ఎగుర వేశారు. తరువాత స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాలనుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు భారీగా అన్నదానం చేశారు.



ఇంకొల్లులో ఊరేగిస్తున్న వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధనోత్సవాల జెండా

ఇంకొల్లులో..

కొణికి(ఇంకొల్లు) : మండలంలోని కొణికి, ఇంకొల్లు గ్రామాలలో శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఆరాధన మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి గ్రామంలో స్వామివారి జెండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకొల్లులో నాగులచెరువు వద్దకొణికిలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు మచ్చు నాగేశ్వరరావు, నారాయణం మురళి ప్రత్యేక పూజలు చేయగా కొణికి గ్రామంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసింహస్వామి, లక్ష్మణాచారి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



మార్టూరులో ప్రత్యేక అలంకరణలో వీర బ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ దంపతులు



రాష్ట్ర సహాయ ఎన్నికల అధికారి కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి తేళ్ల రాంబాబు

ఆమంచిపై ఇండిపెండెంట్ అభ్యర్థి ఫిర్యాదు

చీరాలటౌన్, మే 17 : ఎన్నికల సమయంలో చీరాల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ చేసిన అఘాయిత్యాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని చీరాల ఇండిపెండెంట్ అభ్యర్థి తేళ్ల రాంబాబు కోరారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని రాష్ట్ర సహాయ ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావును రాంబాబు కలిశారు. ఈసందర్భంగా ఆమంచిపై రాతపూర్వకంగా తయారు చేసిన ఫిర్యాదు పత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఒకవైపు పోలింగ్ జరుగుతుండగా మరోవైపు పలువురిపై ఆమంచి దాడులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంతేకాకుండా గతంలోను ఆమంచిపై పలు కేసులున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారిని రాంబాబు కోరారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత కల్పించాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్

ఒంగోలు(కలెక్టరేట్), మే 17: రాష్ట్రంలో పోల్డ్ ఎలక్ట్రానిక్ యంత్రాలకు పటిష్టమైన భద్రత కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. సచివాలయం నుంచి శుక్రవారం సాయంత్రం ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిలు జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్‌మీనా మాట్లాడుతూ ఈవీఎంలకు పటిష్ట భద్రత కల్పించడంతో పాటు స్ట్రాంగు రూముల వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం కలెక్టర్లు, ఎస్పీలు ప్రతిరోజు వాటిని సందర్శించాలన్నారు. రాష్ట్రంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బయట, లోపల సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్‌సుమిత్‌సునీల్, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఆర్వోలు సుబ్బారెడ్డి, లోకేశ్వరరావు, నాగజ్యోతి, జాన్‌ఇర్విన్, కుమార్, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరువు, తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

ఖరీఫ్ సాగుకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు ఇవ్వాలి ● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రసాద్ డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), మే 17: గత ఏడాది వచ్చిన కరువు, మిచౌంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్యలింగంభవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది ఖరీఫ్‌లో రైతులకు జరిగిన నష్టాన్ని ఇప్పటి వరకు విడుదల చేయకపోవడం దారుణంగా ఉందన్నారు. జగన్ ప్రభుత్వం అయితే ఏకంగా ఎన్నికల రెండు రోజుల ముందు రైతుల అకౌంట్లోకి డబ్బులు విడుదల చేసి రాజకీయంగా లబ్ధి పొందాలని చూసిందని, అయితే దీనిని గుర్తించిన ఎన్నికల కమిషన్ ఎన్నికల అ యిన వెంటనే విడుదల చేయాలని సూచించిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల జరిగి నాలుగు రోజు లు గడుస్తున్నా ఇంతవరకు రైతుల అకౌంట్లోకి నగ దు జమ చేయలేదని విమర్శించారు. గతంలో రాయలసీమ జిల్లాలకు చెందిన 58వేల మంది రైతు లు 3.68 లక్షల హెక్టార్లలో సాగు చేసిన పంటలు నష్టపోయారన్నారు. దేశ వ్యాప్తంగా 1.50లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వ డ్డే హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, పావులూరి అంజ య్య, పోలవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

పెరిగిన ఆలయ భూముల కౌలు వేలం

అద్దంకి, మే 17: మండలంలోని పలు దేవాలయాల భూముల కౌలు వేలం పాటలు శుక్రవారం నిర్వహించగా, గతంలో కంటే పెరిగినట్లు ఈవో కోటిరెడ్డి తెలిపారు. మండలంలోని శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి సంబంధించి శింగరకొండపాలెం వద్ద కలవకూరు రెవెన్యూ పరిధిలోని 635 సర్వే నెంబరు లో 24.50 ఎకరాల భూములకు మూడు సంవత్సరాలకు కౌలు వేలం నిర్వహించగా రూ. 5,49,000 రూపాయలు వచ్చింది. గత మూడు సంవత్సరాల క్రితం నిర్వహించిన వేలంలో 4,79,000 రూపాయలు కాగా ఈ ఏడాది 70 వేల రూపాయలు అదనంగా వచ్చింది. అయితే కొత్తరెడ్డిపాలెం వద్ద 722/1, 722/3 లో ఉన్న 28.24 ఎకరాల భూమిని కౌలుకు తీసుకునేందుకు రైతులు ఆసక్తి చూపకపోవటంతో వాయిదా వేసినట్లు ఈవో కోటిరెడ్డి తెలిపారు. గత ఏడాది సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల జరగకపోవటంతో పంటలు సాగు చేసే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కౌలుకు తీసుకునేందుకు రైతులు ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.మండలంలోని వెంకటాపురంలో రామయ్యకుంటకు చెందిన 12.96 ఎకరాల భూమి కౌలుకి బహిరంగ వేలం నిర్వహించగా 2,25,000 రూపాయలు వచ్చింది. మూడు సంవత్సరాల క్రితం నిర్వహించిన వేలంలో 1,54,000 రూపాయలు కాగా, ఈ ఏడాది 71,000 రూపాయలు అదనంగా వచ్చింది. సీతారామస్వామి దేవాలయానికి చెందిన 13 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించగా 1,66,000 రూపాయలు వచ్చింది. మూడు సంవత్సరాల క్రితం 1,40,000 రూపాయలు కాగా, ఈ ఏడాది 26,000 రూపాయలు పెరిగింది. కౌలు వేలం పాటల పర్యవేక్షణ అధికారిగా జె.పంగులూరు గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణ అధికారి యు. శ్రీనివాసరావు, శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పర్చూరు - గుంటూరు రోడ్డులోని బ్రిడ్జిపై ఇనుప చువ్వలు లేచి ప్రమాదకరంగా మారిన గుంత

ఆదమరిస్తే అంతే...

● ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

పర్చూరు, మే 17: నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే పర్చూరు - గుంటూరు ప్రధాన రహదారిలోని బ్రిడ్జిపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ద్విచక్ర వాహన దారులు బ్రిడ్జిపై ఇనుప చువ్వలు లేచిఉన్న గుంతలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. గడిచిన నెలరోజుల వ్యవధిలో ఇదే ప్రాంతంలో పలు ద్విచక్రవాహన దారులు ప్రమాదాల బారిన పడ్డారు. బ్రిడ్జిపై గుంతలు పడిన ప్రాంతంలో కనీసం మరమ్మతులు కూడా చేయలేదని వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జిపై పడిన గుంతలకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

అట్రాసిటీ కేసులపై

బాపట్ల డీఎస్పీ విచారణ

యద్దనపూడి, (మార్టూరు) మే 17: పోలీసులు నమోదు చేసిన అట్రాసిటీ కేసుపై శుక్రవారం రాత్రి బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీ కృష్ణ విచారణ చేపట్టారు. ఆయన రాత్రి యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామానికి వచ్చి సంఘటనకు దారి తీసిన పరిస్థితులు, ఫిర్యాదుదారు మహేష్‌ను, కొంతమంది వ్యక్తులను వి చారించారు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలో ఈ నెల 11 వ తేదీన తెలుగుదేశం కూటమికి చెందిన పార్టీ కార్యకర్తలు ద్విచక్రవాహనాలపై ర్యాలీగా వెళుతుండగా యనమదల వైపు నుంచి చింతపల్లిపాడు వైపు ఎంపీ నందిగం సురేష్ కాన్వాయ్‌తో వస్తున్నారు. అక్కడ ర్యాలీపై వస్తున్న కార్యకర్తలకు, ఎంపీ సురేష్ మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో వైసీపీ మద్దతుదారు మహేష్ అనే యువకుడు స్టేషన్‌లో కొంతమంది టీడీపీ మద్దతుదారులపై అట్రాసిటీ కేసు పెట్టారు. దాంతో డీఎస్పీ చింతపల్లిపాడు గ్రామానికి వచ్చి కొంతమందిని విచారించారు. తరువాత మార్టూరు మండలంలో కోనంకి గ్రామంలో రెండు అట్రాసిటీ కేసులకు సంబంధించి డీఎస్పీ మురళీ కృష్ణ విచారణ చేశారు. కోనంకి గ్రామంలో పోలింగ్ రోజున టీడీపీ, వైసీపీ మద్దతుదారులకు చెందిన వ్యక్తుల మధ్య జరిగిన గొడవకు సంబంధించి మార్టూరు స్టేషన్‌లో ఇరు వర్గాలు ఫిర్యాదుతో రెండు అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులకు సంబంధించి బాధితులను వారి ఇంటి వద్ద డీఎస్పీ విచారించారు. ఆయన వెంట మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజ శేఖర్ రెడ్డి, ఏఎస్ఐలు సైదా, బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



సహాయ ఎన్నికల అధికారిని కలిసిన ఆమంచి వర్గీయులు

చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి

● సహాయ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన ఆమంచి వర్గీయులు

చీరాలటౌన్, మే 17 : చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ వ్యవహార శైలి ప్రజాస్వామ్యానికి భిన్నంగా ఉందని, అతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమంచి వర్గీయులు సహాయ ఎన్నికల అధికారి కోటేశ్వరరావును కోరారు. శుక్రవారం వారు అధికారిని కలిసి చీరాల నియోజకవర్గంలో ఎన్నికల రోజు నుంచి జరిగిన పలు అంశాలను వివరించారు. ఏఎంసీ చైర్మన్ మార్పు గ్రెగోరీపై డీఎస్పీ ఉద్దేశ పూర్వకంగానే దాడిచేసినట్లు ఆరోపించారు. అలాగే స్థానిక శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ బయటకు వ్యక్తులను తీసుకువచ్చి కృష్ణమోహన్‌పై దాడికి తెగబడినట్లు ఆరోపించారు. వెంటనే చీరాల్లో జరిగిన ఘటనలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుపత్రం అందజేశారు. అధికారిని కలిసిన వారిలో పలువురు ఆమంచి వర్గీయులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అన్యాయం జరిగిందని

పొగాకు కూలీల ఫిర్యాదు

● పరిశీలించాలని డీజీపీకి సీఈవో ముఖేష్‌కుమార్ మీనా సూచన

కొండపి, మే 17 : తమను పచ్చాకు పనులకు తీసుకెళ్లి, చేసిన పనికి కూలి డబ్బులు ఇవ్వకుండా ఎగవేశారని, డబ్బులు అడిగితే తమను దూషించారని, తమకు న్యాయం చేయాలని సీఈవో ముఖేష్‌కుమార్ మీనాను బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన కూలీలు కలిసి కొండపి మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన రైతులపై ఫిర్యాదు చేశారు. కూలీలకు, రైతులకు మధ్య కూలి డబ్బుల విషయంలో వివాదం ఏర్పడింది. చేసిన పనికి తక్కువగా డబ్బులు వస్తాయని రైతులు అంటుండగా, తాము ఒప్పందం ప్రకారం పనిచేశామని తమకు డబ్బులు ఇంకా రావాలని కూలీలు అంటున్నారు. కూలీల ఫిర్యాదుకు స్పందించిన సీఈవో ఆ ఫిర్యాదును రాష్ట్ర డీజీపీ పరిశీలించాలని శుక్రవారం పంపారు. డీజీపీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కూలీలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై కృష్ణబాజీబాబు తెలిపారు.



మెట్టప్రాంతంలో మోస్తరు వర్షం

ఆత్మకూరు/అనంతసాగరం, మే 17 : మెట్ట ప్రాంతంలో కురుస్తున్న వర్షం అన్నదాతలో ఆశలు చిగురింపజేస్తోంది. ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఎండ తీవ్రత నుంచి ఉపసమనం లభించడంతో ప్రజలు కొంత ఊపరి పీల్చుకున్నారు. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ ఈ ఏడాది మే నెల రెండో వారం నుంచే వర్షాలు కురవడంతో వ్యవసాయం జోరుగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మైనింగ్ శాఖే

'తెల్ల'బోయింది!

- సైదాపురంలో క్వార్ట్జ్ తవ్వకాలపై మైనింగ్ దాడులు
- అనుమతుల్లేకుండా తవ్వుతుండగా ఐదు వాహనాల సీజ్
- రూ.1.5 కోట్ల పెనాల్టీ.. పోలీసుస్టేషన్‌లో అప్పగింత
- కానీ వారికి తెలియకుండానే కేసు నమోదు
- కోర్టులో హాజరు.. వాహనాల విడుదల
- ఇప్పుడు పెనాల్టీలు ఎవరు వసూలు చేస్తారు?

నెల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : అధికారం ఉంటే ఏమైనా చేయొచ్చని అక్ర మార్కులు నిరూపిస్తున్నారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల్లో అడ్డంగా దొరికిపోయినా తమ అంగ, ఆర్థిక బలంతో సులభంగా తప్పించుకుంటున్నారు. సైదాపురం మండలం జోగుపల్లి వద్ద జరిగిన వ్యవహారమే ఇందుకు నిదర్శనం. ఎన్నికల కోడ్ ముందు వరకూ క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల వైపు కన్నెత్తి చూసేందుకు సాహసించని అధికారులు ఇప్పుడు వరుస దాడులు చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో అక్రమ మైనింగ్ జరిగిన ప్రాంతాల్లో తనిఖీలు చేస్తూ ఏ స్థాయిలో అక్రమ తవ్వకాలు జరిగాయన్నది నిర్ధారిస్తున్నారు. ఈ క్రమంలో గత నెలలో జోగుపల్లి వద్ద ఓ మైన్‌లో అక్రమ తవ్వకాలను మైనింగ్ శాఖ అధికారులు గుర్తించారు. ఆ మైన్ పట్టా భూమిలో ఉన్నప్పటికీ క్వార్ట్జ్ తవ్వకాలకు మాత్రం అనుమతుల్లేవు. ఆకస్మికంగా దాడులు చేసిన మైనింగ్ శాఖ సిబ్బంది ఐదు ప్రొక్లెయిన్, లారీలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్కడ జరిగిన అక్రమ తవ్వకాలను కొలతలు వేసి గుర్తించారు. సదరు మైన్ యజమానికి దాదాపు రూ.1.50 కోట్ల పెనాల్టీలు విధించారు. మైనింగ్ శాఖ ఒక టన్నుకు రూ.900 చొప్పున పెనాల్టీ విధిస్తోంది. ఈ లెక్కన రూ.1.50 కోట్లు అంటే 16 వేల టన్నులకు పైగా క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్వినట్లన్నమాట. ఈ మొత్తం క్వార్ట్జ్ విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.50 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇంత భారీస్థాయిలో జరిగిన తవ్వకాలకు సంబంధించి మైనింగ్ అధికారులు పట్టుకున్న వాహనాలను సైదాపురం పోలీసు స్టేషన్‌లో సేఫ్ కస్టడీకి అప్పగించారు. పెనాల్టీ చెల్లించే వరకూ ఆ వాహనాలను విడుదల చేయవద్దంటూ పోలీసులను కోరారు. అయితే ఈ వాహనాలన్నిటినీ విడుదల చేసినట్లు తాజాగా తెలిసింది. రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఈ వాహనాలను కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు చెబుతున్నారు. కోర్టు ఆదేశాలతో వాహనాలను విడుదల చేసినట్లు వెల్లడించారు. అయితే పట్టా భూమిలో అనుమతుల్లేకుండా తవ్వకాలు జరిపిన వ్యవహారంలో మైనింగ్ శాఖ సిబ్బంది పట్టుకున్న వాహనాలపై రెవెన్యూ సిబ్బంది ఎలా కేసు పెడతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరి పోలీసులైనా ఈ సమాచారాన్ని మైనింగ్ అధికారులు ముందుగా ఎందుకు తెలియజేయలేదన్న దానిపై కూడా అనుమానాలు కలుగుతున్నాయి. రెవెన్యూ వాళ్లు ఫిర్యాదు చేశారు.. పోలీసులు కేసు కట్టారు.. మరి ఇప్పుడు ఆ పెనాల్టీ రూ.1.50 కోట్లను ఎవరు వసూలు చేస్తారు? ఎలా వసూలు చేస్తారు? అన్నది జిల్లా ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది. ఒక వేళ పోలీసులు కేసు కట్టినా మైనింగ్ చట్టాల ప్రకారం సెక్షన్లు జోడించాల్సి ఉంటుందని, ఆ సమాచారాన్ని మైనింగ్ శాఖకు తెలియజేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా క్వార్ట్జ్‌ను తవ్వేసినట్లు నిర్ధారణ అయినప్పటికీ ఒక్క కేసు కూడా పెట్టని రెవెన్యూ అధికారులు.. ఈ జోగుపల్లిలో పట్టా భూమిలో తవ్వకాలు జరుపుతుంటే ఎందుకు అంత ఉత్సాహం చూపారన్నదే అనేక అనుమానాలకు తావిస్తోంది. కానీ తహసీల్దార్ మాత్రం తామెటువంటి ఫిర్యాదు చేయలేదని చెప్పడం గమనార్హం. మరి ఫిర్యాదు లేకుండానే పోలీసులు కేసు నమోదు చేశారా..? అన్నది తేలాల్సి ఉంది. అయితే ఈ మొత్తం వ్యవహారం వెనుక ఓ అమాత్యుడు చక్రం తిప్పినట్లు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్నది మైనింగ్ శాఖ.. అక్రమార్కులకు పెనాల్టీలు విధించిందీ ఆ శాఖ అధికారులే.. ఆ పెనాల్టీలు వసూళ్ల బాధ్యత కూడా వారిదే! అప్పటివరకూ వారు పట్టుకున్న వాహనాలను కస్టడీలో ఉంచుకోవాల్సిన బాధ్యత పోలీసులది. సదరు శాఖకు తెలియకుండా ఆ వాహనాల జోలికి వెళ్లే అధికారం పోలీసులకు లేదు.

కానీ..

రెవెన్యూ శాఖ ఈ వ్యవహారంలో తలదూర్చింది. సదరు వాహనాలపై రెవెన్యూ అధికారులు కేసు పెట్టారు. మైనింగ్ అధికారులకు తెలియకుండా పోలీసులు కేసు నమోదు చేసేశారు. ఆ వెంటనే స్థానిక కోర్టులో ఈ వాహనాలను ప్రవేశపెట్టడం.. కోర్టు ఆదేశాలతో ఆ వాహనాలను విడుదల చేయడం జరిగిపోయాయి. అసలు మైనింగ్ వ్యవహారంలో అది కూడా పట్టా భూమి వివాదంలో రెవెన్యూ అధికారులు ఎందుకు తలదూర్చారు.. మైనింగ్ అధికారులకు చెప్పకుండా పోలీసులు ఎందుకు కేసు నమోదు చేశారు. పెనాల్టీ చెల్లించకుండా వాహనాలను విడుదల చేశారంటే అసలు ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు? ఇలా సవాలక్ష ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఇప్పుడు ప్రభుత్వానికి రావాల్సిన రూ.1.50 కోట్ల పెనాల్టీని ఎవరు వసూలు చేస్తారన్నదే అసలు ప్రశ్న. సైదాపురం మండలంలో జరిగిన ఈ వ్యవహారం ఇప్పుడు అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

మేము సేఫ్ కస్టడీకి అప్పగించాం

సైదాపురం మండలం జోగుపల్లి వద్ద పట్టా భూముల్లో అనుమతుల్లేకుండా క్వార్ట్జ్‌ను తవ్వారు. ఈ తవ్వకాలపై దాడులు చేసి ఐదు వాహనాలను పట్టుకున్నాం. పెనాల్టీలు కట్టేవరకు ఆ వాహనాలను సేఫ్ కస్టడీలో ఉంచాలని స్థానిక పోలీసులకు అప్పగించాం. కానీ ఆ తర్వాత ఏం జరిగిందో మాకు తెలియదు.

- శ్రీనివాసకుమార్, మైనింగ్ డీడీ

ఎటువంటి కేసు పెట్టలేదు

మేమంతా ఎన్నికల విధుల్లో ఉన్నాం. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, రవాణాపై ఎటువంటి కేసులు పెట్టలేదు. జోగుపల్లిలో పట్టుకున్న వాహనాలకు సంబంధించి కలెక్టర్ ఆదేశాలతో పెనాల్టీలు విధించినట్లు తెలిసింది.

- ప్రవీణ్‌కుమార్, సైదాపురం తహసీల్దార్

రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు

జోగుపల్లిలో అనధికారికంగా క్వార్ట్జ్‌ను తరలిస్తున్న వాహనాలను మైనింగ్ అధికారులు మాకు అప్పగించారు. దీనిపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశాం. ఈ కేసును కోర్టుకు తీసుకెళ్లాం. కోర్టు ఆదేశాలతోనే వాహనాలను విడుదల చేశాం.

- విజయ్‌కుమార్, సైదాపురం ఎస్‌ఐ



మైన్స్‌లో తనిఖీలు చేస్తున్న మైనింగ్ శాఖ అధికారులు

మైన్స్‌లో కొనసాగుతున్న దాడులు

నెల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం మండలంలోని క్వార్ట్జ్ మైన్స్‌లో మైనింగ్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. ఇన్నాళ్లూ యథేచ్ఛగా అనుమతులు లేకుండా క్వార్ట్జ్ తవ్వకాల బాగోతం ఈ దాడులతో బట్టబయలవుతోంది. గురువారం కొన్ని మైన్స్‌లో దాడులు చేయగా శుక్రవారం ఇంకొన్ని మైన్స్‌లో తనిఖీలు చేశారు. గురువారం తుమ్మలతలుపూరు గ్రామంలోని రెండు పెద్ద మైన్స్‌పై దాడులు చేసి ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలానే ఆ మైన్స్‌లో జరిగిన తవ్వకాల లెక్కలను కొలతల ద్వారా సేకరించారు. శుక్రవారం తూర్పుపూండ్ల గ్రామంలోని మరో రెండు పెద్ద మైన్స్‌లో దాడులు చేసి మరికొన్ని వాహనాలను పట్టుకున్నారు. ఇక్కడా అక్రమంగా తవ్విన లెక్కలు తేల్చేందుకు కొలతలు తీశారు. పట్టుకున్న వాహనాలను సైదాపురం పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో మైనింగ్ జియాలజిస్టులు, ఇతర సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.





రెండేళ్లుగా సరెండర్ లీవ్ బిల్లుల పెండింగ్

రూ.500 కోట్ల వరకు ఆగిన చెల్లింపులు

వేతనజీవుల ఎదురుచూపులు

ఇంకెప్పుడిస్తారు!?

నెల్లూరు (హరనాథపురం), మే 17 : తమది ఉద్యోగుల పక్షమేనంటూ ఊదరగొడుతున్న వైసీపీ ప్రభుత్వం ఏళ్ల తరబడి వేతనజీవులు దాచుకున్న సరెండర్ లీవ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. బిల్లుల చెల్లింపులు అటుంచితే, ప్రతినెలా ఒకటవ తేదీనైనా జీతాలు చెల్లించాలని పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఠంచనుగా 1వ తేదీకల్లా జీతాలు అందుకునే వేతనజీవులు ప్రస్తుత ప్రభుత్వంలో నెల ఆరంభమై రెండువారాలు గడిచినా ఖాతాల్లో డబ్బులు పడటం లేదు. దీనికితోడు తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులపై వైసీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. దీంతో జీతాలైనా సకాలంలో చెల్లించండి మహాప్రభో అనే స్థాయికి చేరుకున్నారు. తాము దాచుకున్న సరెండర్ లీవ్ బిల్లులైనా చెల్లించాలని తీవ్రవత్తిడి తేవటంతో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లకు అంటే 2021, 2022 సంవత్సరాల్లో మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత మళ్లీ ఫుల్‌స్టాప్ పెట్టింది.

● రెండేళ్లుగా పెండింగ్

ప్రతి ఉద్యోగికి సరెండర్ లీవ్ సంవత్సరానికి నెల రోజులు ఇస్తారు. ఉపాధ్యాయులకైతే సంవత్సరానికి 6 రోజుల సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్ చేసుకొనే అవకాశం ఉంటుంది. ఈ లీవ్‌కు సంబంధించిన నెల రోజుల మొత్తాన్ని ఉద్యోగులు అమ్ముకొంటుంటారు. చాలా మంది ఉద్యోగులు అవసరాలకు ఉపయోగ పడతాయని 2, 3 ఏళ్ల వరకు సరెండర్ లీవ్‌లను ఎత్తి పెట్టుకొని ఎన్‌క్యాష్ చేసుకొంటుంటారు. ఉదాహరణకు ఇక ఉద్యోగికి నెలకు రూ.లక్ష జీతం వస్తుందనుకొంటే రెండేళ్లపాటు ఆయన దాచిన సెలవులను అమ్ముకొంటే రూ.2లక్షలు పొందే వీలు ఉంటుంది. అవసరాల నిమిత్తం చాలా మంది ఉద్యోగులు తమ సరెండర్ లీవ్‌ను ఎన్‌క్యాష్ చేసుకోవడానికి బిల్లులు ట్రెజరీకి సమర్పించారు. అయితే, ఈ బిల్లులు రెండేళ్ల నుంచి చెల్లింపులకు నోచుకోలేదు. సుమారు రూ.500 కోట్ల వరకు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉన్నట్టు సమాచారం.



శేష వాహనంపై వేదగిరీశుడి వైభోగం

నెల్లూరురూరల్, మే 17 : వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయంలోని ప్రత్యేక మందిరంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంపై శ్రీవారు అధిరోహించి ఆలయ పురవీధుల్లో ఊరేగారు. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించేందుకు భక్తులు వేదగిరికి తరలివచ్చారు. కాగ ఉదయం ఆలయం వద్ద ధ్వజారోహణ కార్యక్రమాన్ని అర్చకులు వేడుకగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వేడుక కన్నుల పండువ గా సాగింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో గిరికృష్ణ పర్యవేక్షించారు.



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

ఓట్ల లెక్కింపునకు సిద్ధం కండి!

● ఆర్‌ఓల సమీక్షలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మే 17 : ఓట్ల లెక్కింపునకు అన్నివిధాలా సన్నద్ధం కావాలని కలెక్టర్ హరినారాయణ్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఈ నెల 28 లోగా కౌంటింగ్ ఏజెంట్ల పేర్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని సూచించారు. ఎన్నికల అనంతరం ఎలాంటి సంఘటనలు జరగకుండా పలుచోట్ల పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

● పోస్టల్ బ్యాలెట్లకు సీల్

నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టరేట్ స్ట్రాంగ్ రూములో ఉంచి సీల్ వేశారు. శుక్రవారం పోస్టల్‌లో వచ్చిన పోస్టల్ బ్యాలెట్ కవర్‌ను సిబ్బంది కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్‌కు అందచేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాటిని కలెక్టరేట్ స్ట్రాంగ్ రూంలో ఉంచి సీల్ వేశారు. ఆ ప్రతినిధులు సీల్‌పై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ బాపిరెడ్డి, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్ పెట్టెకు సీల్ వేసి స్ట్రాంగ్ రూముకు తరలిస్తున్న సిబ్బంది



లారీలో అక్రమంగా తరలిస్తున్న జామాయిల్ కర్ర

అగ్రిగోల్డ్ భూముల్లో

చోర్.. చోర్!

- తరిగిపోతున్న జామాయిల్ చెట్లు
- రాత్రికి రాత్రే తెగనరికి అమ్ముకుంటున్న అక్రమార్కులు
- తెరవెనుక అధికార పార్టీ నేతల హస్తం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 17 : అగ్రిగోల్డ్ భూముల్లో సాగు చేసిన జామాయిల్‌పై అక్రమార్కుల కన్నుపడింది. గుట్టుచప్పుడు కాకుండా చెట్లను తెగనరికి దుంగలను రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దుత్తలూరు మండలంలోని తురకపల్లి, రాచవారిపల్లి గ్రామాల సమీపాల్లో సుమారు 400 ఎకరాల్లో అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయి. వాటిలో గతంలో జామాయిల్ సాగు చేశారు. అయితే వాటి గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లోని అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకుల కన్ను జామాయిల్ చెట్లపై పడింది. ఇంకేముంది.. రాత్రికి రాత్రే వాటిని నరికి రవాణా చేస్తూ రూ.లక్షల్లో సంపాదించారు. గతంలో ఒకటీ రెండు సార్లు అటవీ అధికారులు దాడులు చేసినా అక్రమార్కులు పెడచెవిన పెట్టారు. గత నెలలో జామాయిల్ అక్రమంగా నరికి తరలిస్తున్నారని గ్రామస్థులకు తెలియడంతో వారివెళ్లి నిలదీయడంతో అక్రమార్కులు లారీతో సహా పరారయ్యారు. తెర వెనుక అధికార పార్టీకి చెందిన నాయకులే ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే సుమారు రూ.80 లక్షల విలువ చేసే కలప రవాణా చేశారని స్థానికులు అంటున్నారు.

● కేసుల నమోదు

తురకపల్లి, రాచవారిపల్లి గ్రామాల్లోని అగ్రిగోల్డ్ జామాయిల్ తోటలను ఇటీవల సీఐటీ అధికారులు పరిశీలించారు. అక్రమంగా కలప నరికి రవాణాకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. గతంలో వరికుంటపాడు మండలంలో సైతం అగ్రిగోల్డ్ భూముల్లో అక్రమంగా జామాయిల్ నరికి తరలిస్తుంటే పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గట్టి చర్యలు చేపట్టి అగ్రిగోల్డ్ ఆస్తులు కాపాడాలని పలువురు కోరుతున్నారు.



అగ్రిగోల్డ్ భూముల్లో నరికిన జామాయిల్

కేసులు నమోదు చేస్తాం

అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్ల నరికివేతపై ఇదివరకే మేము వెళ్లి పరిశీలించాము. ఉన్నతాధికారులకు నివేదిక కూడా ఇచ్చాము. అయితే, ఎన్నికల దృష్ట్యా కేసు నమోదు చేయాలేదు. మళ్లీ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి, కలపను అక్రమ రవాణా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తాము.

- ఆజాద్, సీఐడీ ఎస్‌ఐ

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రామస్వామిపాలెంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బిట్రగుంట, మే 17: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిత్యప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వైద్యులు రోజ్‌లిన్, అమృత పలువురికి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించిన 151 మందికి ఉచిత మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు గండూరి మంజుల, కార్యదర్శి చైతన్య, సూపర్‌వైజర్లు విక్టోరియారాణి, క్రిష్ణమూర్తి, ఆరోగ్య సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా సీతారాముల ఉత్సవం

ఉదయగిరి రూరల్ మే 17: మండలంలోని శునకానపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీసీతారాముల ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం ఉత్సవ మూల విరాట్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి వసంత మహోత్సవం, పారువేట నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా ఆలయకమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నాడు-నేడు పనుల తనిఖీ

ఉదయగిరి రూరల్ మే 17: మండలంలోని మాసాయిపేట మెయిన్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న రెండో దశ నాడు నేడు పనులను శుక్రవారం ఎంఈవో1 షేక్ మస్తాన్‌వలీ పరిశీలించారు. టైల్స్, మురుగుదొడ్ల నిర్మాణం, డోర్ల ఏర్పాట్ల పనుల్లోని నాణ్యతను పరిశీలించారు. అలాగే ప్రహరీ నిర్మాణ విషయంలో నెలకొన్న వివాదాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. చేసిన పనులకు వాటర్ క్యూరింగ్ బాగా చేయాలని, పాఠశాల ఆవరణంలో మొక్కలు పెంచేలా దృష్టి సారించాలని కోరారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

కావలి రూరల్, మే 17: కావలి పట్టణ వెక్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని అలవలపాటి సిరి ప్రియాంక అదృశ్యంపై ఆమె తల్లిదండ్రులు గురువారం రాత్రి 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె సిరి ప్రియాంక పరీక్షలు రాయటానికి వెళ్తున్నట్లు చెప్పి కావలి వచ్చినట్లు తెలిపారు. కళాశాలలో పరిచయస్తుడైన విశాఖపట్నంకు చెందిన రవి అనే యువకుడితో సన్నిహితంగా ఉండటం ఇంట్లో తెలియడంతో కళాశాలకు పంపకుండా ఇంట్లోనే ఉంచినట్లు తెలిపారు. పరీక్షల నిమిత్తం కళాశాలకని చెప్పి వచ్చిన కుమార్తె అదృశ్యం కావడంపై రవిపై అనుమానం వ్యక్తం చేస్తూ విద్యార్థిని తల్లి మాలతి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

13 మందిపై అట్రాసిటీ కేసు

ఉలవపాడు, మే 17: మండలంలోని కరేడులో రెండు సామాజిక వర్గాల మధ్య విభేదాలు కొట్లాటకు దారితీసిన సంఘటనలో 13మందిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై బాజీరెడ్డి తెలిపిన వివరాల మేరకు... ఈనెల 14వ తేదీ సాయంత్రం కరేడు ఎస్సీ కాలనీకి చెందిన యువకులు కాలనీకి ఆనుకొని ఉన్న మరో సామాజిక వర్గం బజారులో వెళ్తుండగా కులం పేరుతో దూషించి మా వీధిలోకి రావద్దని వాదనకు దిగారని, దీంతో వివాదం చెలరేగి ఇరు సామాజిక వర్గాలు కొట్లాటకు దిగారు. ఇందులో గాయాలకు గురైన ఇరువర్గాల వారు ఒంగోలు రిమ్స్‌లో, కందుకూరు ఏరియా ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. కాగా, గురువారం రాత్రి ఆసుపత్రి వర్గాల నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కే జాలిరెడ్డి, సోమశేఖర్, రాఘవరెడ్డితోపాటు మొత్తం 13 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేయగా, మహిళలను దూషించి భౌతిక దాడి చేసినందుకు ఎస్సీ యువకులు వెంకట నరసింహ, కల్యాణ్, శ్రీకాంత్, మనోజ్, సాయిలపై కొట్లాట కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేజీవీల్స్‌తో రహదారుల ధ్వంసం



దెబ్బతిన్న అన్నారెడ్డిపాళెం అరవపాళెం రహదారి

సంగం, మే 17: మండలంలోని అన్నారెడ్డిపాళెం - అరవపాళెం రహదారి కేజీవీల్స్‌తో అధ్వానంగా తయారైంది. రైతులు పొలాల్లో బురద దుక్కులు దున్నుకునేటప్పుడు ట్రైర్లకు కేజీవీల్స్ తగిలించి దుక్కులు చేస్తారు. అయితే కేజీవీల్స్‌తో ఒక చోట నుంచి మరోచోటకు వెళ్లేటప్పుడు కేజీవిల్స్ తగిలించి తారు రహదారిపై తిరగడంతో ధ్వంసమవుతున్నాయి. అన్నారెడ్డిపాళెం - అరవపాళెం తారు రోడ్డుపై కేజీవీల్స్‌తో తిప్పడంతో అధ్వానంగా తయారైందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కేజీవీల్స్‌లు నడపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



మృతి చెందిన గేదె

ఏఎస్‌పేట, మే 17: విద్యుత్ షాక్‌కు గురై గేదె మృతి చెందిన సంఘటన శుక్రవారం ఏఎస్ పేట మండలం చౌటభీమవరంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు చౌటభీమవరం గ్రామంలో తాగునీటి మోటరు స్టార్టర్ ఏర్పాటు చేసిన స్తంభం వద్ద కొన్ని రోజులుగా ఎర్త్ వస్తోంది. ఈ విషయం విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో స్తంభం వద్దకు ఎవరూ వెళ్లకుండా పలువురు స్తంభం చుట్టూ కంపను ఏర్పాటు చేశారు. గురువారం కురిసిన వర్షానికి స్తంభం చుట్టు నీరు చేరింది. శుక్రవారం గ్రామానికి చెందిన కే. హజరత్తయ్య అనే రైతు గేదె మేతకు వెళ్లి వస్తూ స్తంభం వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

వింజమూరు, మే 17 : పట్టణంలోని విరాట్‌నగర్‌లో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి గుడిలో శుక్రవారం స్వామి వారి ఆరాధన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆత్మకూరు నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు

ఆత్మకూరు, మే 17 : బుద్ధపౌర్ణమి సందర్భంగా ఈ నెల 23న ఆత్మకూరు నుంచి అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం కరీమున్నిసా తెలిపారు. ఈ నెల 22వ తేది ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు.

ఉప్పుటేరు లో లెవల్ వంతెనతో ప్రజల అవస్థలు

● ఓ మోస్తరు వర్షానికే వంతెనపై వరద నీరు ● గ్రామాల రాకపోకలకు ఆటంకం ● హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజల మొర



పెదపవనిలో ఉప్పుటేరుపై నిర్మించిన లోలెవల్ వంతెన

లింగసముద్రం, మే 17 : మండలంలోని చినపవని-పెదపవని గ్రామాల మధ్యన ఉప్పుటేరుపై నిర్మించిన లో లెవల్ వంతెనతో ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సుమారు 25 సంవత్సరాల క్రితం కందుకూరు-పెదపవని గ్రామాల మధ్యన ఆర్అండ్‌బీ రోడ్డుపై నిర్మించిన ఈ లోలెవల్ వంతెనపై నుంచి కొద్దిపాటి వర్షానికే వరద నీరు ప్రవహిస్తోంది. ముఖ్యంగా వర్షాకాలం సమయంలో భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ లోలెవల్ వంతెనపై నుంచి సుమారు ఐదారు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహించి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. అంతేగాక ఈ సమయంలో పెదపవని గ్రామానికి మండలంలోని మిగతా గ్రామాలకు సంబంధాలు పూర్తిగా బంద్ అవుతాయి. అంతేగాక ఇటు లింగసముద్రం మండలం నుంచి, అటు వైపు కావలి పట్టణం నుంచి బస్సులు, లారీలు ఇతర వాహనాల రాకపోకలు నిలిచి పోతాయి. ఈవిధంగా రెండు మూడు రోజుల పాటు వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. మండలంలోని లింగసముద్రం, అన్నెబోయినపల్లి, వీఆర్ కోట, చినపవని తదితర గ్రామాల ప్రజలు ఈ వంతెన మీదుగానే కావలి, నెల్లూరు, చెన్నై వంటి ప్రాంతాలకు వైద్యశాలలకు, ఇతర పనులపై వెళుతుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డుపై హైలెవల్ వంతెన నిర్మించాల్సిన అవసరం ఉంది.

2021లో వరదలకు ఇద్దరు దుర్మరణం

2021వ సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలకు ఈ వంతెనపై నుంచి సుమారు ఐదారు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహించింది. ఈ వరద నీటి ప్రవాహాన్ని ఆటోలో దాటి కావలికి వెళ్లేందుకు ప్రయత్నించిన మండలంలోని మొగిలిచెర్ల గ్రామానికి చెందిన ఇద్దరు ఎస్సీ యువకులు ఆటోతో సహా కొట్టుకొని పోయి దుర్మరణం పాలయ్యారు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఈ లోలెవల్ వంతెనను హైలెవల్ వంతెనగా మార్చి వరద ప్రమాదాల నుంచి వాహనదారులను, ప్రయాణికులను కాపాడాలని ప్రజలు, కోరుతున్నారు.

యువనేస్తం ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు

సంగం, మే 17: మండలంలోని సిద్దీపురంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయా వైద్యశాలలో చికిత్స పొందుతున్న షేక్ జిలానికి యువనేస్తం సేవా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు నాయబ్ రసూల్, పరంధామయ్య, అన్వేష్‌రెడ్డి, రామిరెడ్డి ధనుంజయ్, వారి మిత్ర బృందం, గ్రామస్థుల సహకారంతో బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 75వేలు ఆర్థిక సాయం అందజేశారు.

కావ్య క్రిష్ణారెడ్డి విజయం ఖాయం

● ఆర్యవైశ్య నేతల అభినందనలు



కావ్య క్రిష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఆర్యవైశ్య నేతలు

కావలి, మే 17: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి విజయం ఖాయం అని ఆర్యవైశ్య నేతలు పేర్కొన్నారు. శుక్రవారం కావలి పట్టణం ముసునూరులోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. కావలి నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలించిన అనంతరం క్రిష్ణారెడ్డి గెలుపు తథ్యమని తెలిసిపోయిందన్నారు. జూన్ 4న జరుగనున్న ఓట్ల లెక్కింపులో మెజార్టీ తేలిపోతుందన్నారు. కావలి అభివృద్ధి చెందాలంటే క్రిష్ణారెడ్డి లాంటి నేత అవసరం ఎంతయినా ఉందన్నారు.

● బ్రహ్మంగారి ఆరాధనోత్సవంలో..

కావలి పట్టణ వెంగళరావు నగర్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం క్రిష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని భగవంతుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు మొగిలి కల్లయ్య, నాయుడు రాంప్రసాద్, శానం హరి, బిట్రగుంట శివప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు, ఆలా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యమే జేవీవీ ధ్యేయం



మాట్లాడుతున్న డాక్టర్ బెజవాడ రవికుమార్

కావలిటౌన్, మే17: ప్రజలను చైతన్యవంతం చేయడమే జేవీవీ ధ్యేయం అని జిల్లా గౌరవాధ్యక్షుడు, రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రవి నర్సింగ్ హోమ్‌లోని సమావేశ మందిరంలో జేవీవీ విస్తృత కార్యవర్గ సమా వేశం జరిగింది. జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ జనంలోని అజ్ఞానాన్ని పారదోలి వారిని విజ్ఞానవంతులను చేయడమే జేవీవీ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. సుదీర్ఘకాలం నుంచి పట్టణంలో పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, మూఢ నమ్మకాలను పారదోలడం, కూల్ డ్రింక్స్ వద్దు సహజ పానీయాలు ముద్దు అంటూ చైతన్య కార్యక్రమాలు, పది విద్యార్థులకు సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్, ప్రతిభా పురస్కారాలు అందించడం తదితర కార్యక్రమాలను ఉద్యమంలా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా చేపట్టబోయే కార్యక్రమాల గురించి కార్యచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో జీ హరినాథ్, సుబ్బరాయశర్మ, జిల్లా నాయకులు పాపిశెట్టి జానకిరామ్, కల్యాణి, జమీర్, మాధవ, కల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు బ్యాంకులో వేయొద్దు

● ఎన్నికల కమిషన్‌కు పోస్ట్ ద్వారా అర్జీలు



సీఎస్, ఈసీ కి పంపిన అర్జీలను ఆవిష్కరిస్తున్న దళిత నేతలు

కావలి, మే17: వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్లు బ్యాంకులో వేయవద్దని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నికల కమిషన్‌కు పోస్ట్ ద్వారా అర్జీలు పంపినట్లు ఆయన తెలిపారు. పోస్ట్‌ద్వారా పంపిన అర్జీలను శుక్రవారం కావలి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకర్లు రకరకాల కొర్రీలు పెట్టడం ద్వారా ఈనెల 1న వృద్ధులు, దివ్యాంగులకు బ్యాంకులలో వేసిన పింఛన్ సగం మందికి పైగా పొందలేక పోయారన్నారు. పైగా బ్యాంకులకు వెళ్లాలంటే వారు అనేక ఇబ్బందులకు గురయ్యారని, ఇప్పటికీ బ్యాంకుల నుంచి ఫించన్లు అందని వారు చాలామంది ఉన్నారన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో సచివాలయ ఉద్యోగులు 12 మంది ఉన్నారని వారి ద్వారా జూన్ మాసం పింఛన్లు నేరుగా ఇళ్లకు అందచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి నేతలు ముక్కు మోహన్‌రావు, జడ్డా వాసు, తిరుపతి, జానీ బాష తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ఆత్మకూరు, మే 17 : మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఆరు కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 10,000 వంతున రూ. 60,000లను సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి నేతృత్వంలో అందజేశారు. 17వ వార్డు పరిధిలోని షేక్ ఖాదర్‌బాషు, 3వ వార్డు పరిధిలో కొప్పవరపు వెంకటశేషయ్య, 12వ వార్డులో మాముడూరు గోపికృష్ణ, 9వ వార్డులో దేవరల్లి లక్ష్మమ్మ, 11వ వార్డులో తంగిళ్లపల్లి పెద్దలక్ష్మమ్మ, 12వ వార్డులో కటారి నాగరాజు కుటుంబాలను ట్రస్ట్ సభ్యులు పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఖరీఫ్ సాగుకు రైతులు దుక్కులు చేసుకోవాలి

కందుకూరు, మే 17 : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే పంటలపై రైతులకు వ్యవసాయ, వాతావరణ సూచనలను కందుకూరు విజ్ఞాన్ కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ సమాచారం మేరకు ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా నమోదవుతుందని, జూన్ మొదటి వారంలోనే ఋతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని, రైతులు దుక్కులు చేసుకోవాలని, దీని ద్వారా నిద్రావస్థలో ఉన్న చీడపీడలు, శిలీంద్రాలు, ఇతర హానికర సూక్ష్మజీవులు పైకితేలి పక్షులకు ఆహారంగా మారడం, లేదంటే ఎండకు చనిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. దీనిద్వారా రైతులకు కలుపు, తెగుళ్ల సమస్యలు తగ్గుతాయని చెప్పారు. ఈ తేమను ఉపయోగించుకొని పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, అలసంద వంటి వాటిని పొలంలో చల్లుకొని 40 రోజుల తరువాత సగం పూత దశలో ఉన్నప్పుడు పొలంలో రోటవేటర్ సహాయంతో కలియదున్నుకోవడం ద్వారా భూమిలో సేంద్రియ కర్బణం పెరిగి పంట దిగుబడి పెరుతుందని సూచించారు. శనగ, మినుము, కంది, పెసర, వేరుశనగ వంటి పంటలలో శిలీంద్రం ద్వారా నష్టపరిచే ఎండుతెగులు, మొదలుకుళ్లు, వేరుకుళ్లు తెగుళ్లు రాకండా ట్రైకోడర్మావిరిడే, సూడోమోనాస్, వంటి జీవ శిలింద్ర నాశినులను 2 కిలోల చొప్పున 100 కిలోల మగ్గిన పేడఎరువు, 20 కిలోల వేపచెక్క కలిపి నీడలో 15రోజులు మగ్గపెట్టి తేమ ఉన్నప్పుడు పొలంలో చల్లుకోవాలని సూచించారు.

రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

ఆత్మకూరు, మే 17: సోమశిల జలాశయం పరిధిలో సాగునీటి కొరత ఉండడంతో మండల పరిధిలోని రైతులు వరికి బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. బోర్ల ద్వారా వరిపైరు సాగు చేపట్టడంతో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. వరిలో ఒక ఎకరాకు వాడే నీటిని ఆరుతడి పంటలకు వాడితే 5 నుంచి 7 ఎకరాలకు సరిపోతుందన్నారు. కావున రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు.

ఎన్నికల నగదు చెల్లించాలంటూ ఆందోళన



వినతి పత్రాన్ని అందజేస్తున్న బీఎల్‌వోలు

వరికుంటపాడు, మే17 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 12, 13వ తేదీల్లో ఎన్నికల విధులు నిర్వర్తించిన తమకు నగదు చెల్లించాలంటూ శుక్రవారం బీఎల్‌వోలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు కే. ప్రభుదాసు మాట్లాడుతూ 39 కేంద్రాల పరిధిలోని పంచాయతీల్లోని కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించడం జరిగిందన్నారు. వీటికి సంబంధించి ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నిధులను అధికారులు తమకు అందజేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. పంచాయతీ కార్యదర్శులు ఒక్కో బూత్‌కు సుమారు రూ.13 వేల వరకు ఖర్చు చేసినప్పటికీ కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే అందజేయడం ఎంత వరకు సమంజసమన్నారు. భోజనం సైతం నాసిరకంగా అందజేశారని దుయ్యబట్టారు. అలాగే తమతో పాటు వీఆర్ఏకు, ఏఎన్ఎంలకు రోజు వారి అలవెన్స్‌లు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఎల్‌వోలు వినతి పత్రం అందజేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఆర్మీ ఉద్యోగులు



పోస్టల్ బ్యాలెట్లను సబ్‌కలెక్టర్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తున్న అధికారులు

కందుకూరు, మే 17 : ఆర్మీ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించు కుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కందు కూరు నియోజక వర్గానికి చెందిన 13 మంది ఆర్మీ అధికారులు, ఉద్యోగులు పోస్టు ద్వారా ఓటును ఎన్నికల అధికారులకు పంపించారు. నియోజకవర్గంలో మొత్తం 66 మంది ఆర్మీ ఉద్యోగులు ఓటు నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 16 మంది పోస్టల్ బ్యాలెట్‌లు మాత్రమే వచ్చాయని జూన్ 4వ తేదీ ఉదయం 8గంటల వరకు అవకాశం ఉందని ఎన్నికల నిర్వాహణ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు చేరిన ఆర్మీ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లను సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో రాజకీయ పార్టీల ఎన్నికల ఏజంట్ల సమక్షంలో భద్రపరిచారు.

నిరుపయోగంగా ప్రభుత్వ కార్యాలయ భవనాలు



చినపవని గ్రామానికి 3 కి.మీ దూరంలో నిర్మించిన హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు

లింగసముద్రం, మే 17 : గ్రామాలకు దూరంగా ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించడంతో అధికారులు, సిబ్బంది, ప్రజలు వెళ్లడం లేదు. దీంతో సదరు భవనాలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని చినపవని గ్రామానికి 3 కి.మీ దూరంలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించారు. ఇక్కడ జనసంచారం కనుచూపు మేరలో ఉండదు. దీంతో ఈ రెండు కేంద్రాలలో పనిచేసే మహిళా సిబ్బంది భయపడుతున్నారు. దీంతో వారు గ్రామంలో సచివాలయం, పశు సంవర్ధక కేంద్రంలో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే పెంట్రాల, మొగిలిచెర్ల, తిమ్మారెడ్డిపాలెం గ్రామాల్లో కూడా ఊరికి దూరంగా ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించడంతో అక్కడకు సిబ్బంది వెళ్లకుండా గ్రామాలలోని సచివాలయాలలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాలయలతో ఊరికి దూరంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

జలం లేని జలజీవన్

● నీరందక మండల వాసుల అవస్థలు



గుడవళ్లూరులోని ఓవర్ హెడ్‌ట్యాంకు

కొండాపురం, మే 17: వేసవికాలం రావడంతో గ్రామాలలో సగటు నీటి వినియోగం ఎక్కువయ్యింది. ఆస్థాయిలో మండలంలో ఏగ్రామంలోనూ నీటి సరపరా జరగడంలేదు. జలజీవన్ మిషన్ వంటి పథకాలతో ప్రతి ఇంటికి నేరుగా కుళాయిద్వారా ఉచితంగా నీటి సరపరాను చేస్తున్నామనే ప్రభుత్వం ప్రకటన క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. జలజీవన్ మిషన్ జలం లేని మిషన్‌గా మారిందని మండలవాసులు అంటున్నారు, దీంతో రోజువారీ వాడుకునేందుకు నీరు సక్రమంగా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలపరిధిలో 19 పంచాయతీలలో దాదాపు 52 గ్రామాలున్నాయి. మండలంలో దాదాపుగా 10 వేలవరకు ఇళ్లు ఉండగా జనాభా సుమారు 39 వేలవరకు ఉంది. గతంలో ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు ఎక్కించి పైపులైన్ల ద్వారా గ్రామ ప్రజలకు నీటి సరఫరా చేస్తుండేవారు. ఈవిధానంలో ప్రెషర్‌తోపాటు ఎక్కుసమయం నీరు వస్తుండటంతో ప్రతి ఇంటికీ సరిపడేవిధంగా నీరు అందేవి. తర్వాతి కాలంలో కొన్ని గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంకులను పక్కనపెట్టి నేరుగా బోర్లువేసి మోటార్లద్వారా పైపులైన్లకు నీటి తరలించి ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడనుండే నీటి సమస్య మొదలయ్యింది. ఏర్పాటుచేసిన మోటార్లు మూడు ఫేజుల విద్యుత్ ఉన్నప్పుడు మాత్రమే పనిచేస్తుండటంతో ఆసమయంలో పైపులైన్లద్వారా కొందరికి మాత్రమే నీరు అందుతుంది. పైపులైన్లకు చిన్న మోటార్లను బిగించుకొని నీటిని తోడుతుండటంతో గ్రామాలలో మోటారు బిగించుకోని వారందరికీ నీరు అందడంలేదు. దీంతో నీరందక పలువురు అల్లాడుతున్నారు. ప్రత్యామ్నాయంలేక రోజువారి వినియోగం కొరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించకోవడం లేదని ప్రజలు అంటున్నారు.

జలజీవన్‌తో తీవ్రమైన సమస్య

కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రం నూతనంగా ఇటీవల జలజీవన్ అనే పథకాన్ని తీసుకువచ్చింది. ఈపథకం ద్వారా నూతనంగా బోర్లు వేసి మోటార్లు బిగించి పంచాయతీలలోని మజారా గ్రామాలకు పైపులైన్లు వేసి కుళాయి బిగించి ఉచితంగా ఇంటింటికీ నీటిని సరఫరాచేయాల్సి ఉంది. పైపులైన్లు పొడిగించడ జరిగింది కానీ బోర్లు వేయలేదు. దీంతో అంతకు ముందున్న నీటిసరఫరాకంటే ఎక్కువవ్వడంతో గ్రామాలలో ఎక్కువమందికి నీరు అందడం లేదు. వేసవికాలం రావడంతో నీటి సమస్య ఎక్కువవ్వడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి మండలంలో పలు గ్రామాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సామాన్యుడికి భారం.. ఇంటి నిర్మాణం

రోజురోజుకు పెరుగుతున్న సిమెంట్, ఇనుము ధరలు



ఉదయగిరిలో అర్థంతరంగా ఆగిన భవన నిర్మాణం



నింగినంటిన ఇసుక, ఇసుక

ఉదయగిరి, మే 17 : సామాన్యుడి సొంత ఇంటి కల కలగానే మిగిలిపోతోంది. రోజురోజుకు పెరుగుతున్న సిమెంట్, ఇనుము ధరలతో పేద మధ్య తరగతి కుటుంబాలు ఇల్లు కట్టుకోవడానికి సతమతమవుతున్నాయి. ఇల్లు కట్టుకోవాలంటే ఇంటి నిర్మాణం పూర్తి చేసేసరికి అనుకున్నదానికంటే బడ్జెట్ రెట్టింపై అప్పుల పాలవుతున్నారు. అప్పు దొరకని వారి ఇంటి నిర్మాణాలు మాత్రం అర్థాంతరంగా ఆగిపోవాల్సిన పరిస్థితి. ఇల్లు లేని పేద మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం ఇచ్చే పక్కా గృహాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు, ఐదేళ్లగా ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయకపోవడంతో ఇళ్ల నిర్మాణాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో వాటిపై ఆశలు వదులుకున్న సామాన్యులు సొంతంగా ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు. అయితే ఇంటి నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, కంకర, ఇటుకల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో సామాన్య ప్రజలకు ఇళ్ల నిర్మాణం భారంగా మారింది. రెండేళ్ల క్రితం రూ.250లు ఉన్న సిమెంట్ బస్తా ధర ప్రస్తుతం రూ.350 నుంచి రూ.380 లు వరకు దాటింది, దీంతో ఒక్కో బస్తాపై వందకు పైగా అదనపు భారం పడుతుంది, టన్ను ఇనుము గతంలో రూ.45వేల నుంచి రూ.50 వేల వరకు ఉండేది, ఇప్పుడు రూ.58వేల నుంచి రూ.60 వేలకు పైగా ధర పలుకుతోంది. ఇటుకల ధర రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు పెరిగిపోయి ఆకాశానంటుతున్నాయి. అలాగే ఇసుక ట్రాక్టర్ రూ.4,500 వరకు పలుకుతోంది. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు కష్టతరంగా మారాయి. రోజు రోజుకు ఇసుక, సిమెంట్, కంకర, ఇనుము ధరలు పెరుగుతున్నాయి, దీంతో సామాన్యులకు ఇల్లు కట్టుకోవాలంటే కష్టతరంగా మారింది.